8-11Pg1fBPGOL 1 ONG_8-11Pg1fBPGOL.qxd 08/Nov/25 12:32 AM Page 1

మొజాయిక్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-11-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 277 పేజీలు: 12 వెల: 6.50



శుక్రవారం వందేమాతరంగీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక స్టాంపును విడుదల చేసిన ప్రధాని మోడీ


## భరతమాత ఆరాధన మంత్రం
# 'వందేమాతరం'

### 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక స్టాంపును విడుదల చేసిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, నవంబరు 7:** వందేమాతరం గేయం మన చిరకాలస్వప్నం లాంటిదని, ఒక ధృఢ సంకల్పానికి బీజం వేసిందని, ఒక నిత్యపఠనమే పరమావధిగా ఉన్న మంత్రమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. భరత మాత ఆరాధన సాధన అని అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు నిర్వహించుకుంటున్నామని ఇవి దేశప్రజలకు ఎంతో ప్రేరణనిస్తాయని మోడీ అన్నారు. వందే >>2

# రాష్ట్రంలో 3 మెగా సిటీలు

**విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన పరిశ్రమల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడంతో పాటు అవి కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పరిశ్రమల కోసం అవసరమైన భూములు, విద్యుత్ లభ్యత కూడా ఉండేలా చూడాలని సిఎం సూచించారు. శుక్రవారం సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 26 పరిశ్రమలకు సంబంధించిన ప్రతిపాదనల్ని ఎస్ఐపిబి ఆమోదించింది. వీటి ద్వారా రూ.1,01,899 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా 85,570 ఉద్యోగాలు దక్కనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడచిన 16 నెలల్లో జరిగిన 12 ఎస్ఐపిబి సమావేశాల ద్వారా మొత్తంగా రూ.8,08,899 కోట్ల పెట్టుబడులు, 7,05,870 ఉద్యోగాలు రానున్నాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చేలా చూడటం అధికారుల బాధ్యత. పెట్టుబడిదారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని సమయం వృధా



### క్లస్టర్‌వారీ విధానంలో పారిశ్రామికాభివృద్ధి
### 15 ఇండస్ట్రియల్ జోన్ల అభివృద్ధికి చర్యలు
### పెట్టుబడుల సదస్సుకు ముందే వివిధ పరిశ్రమలకు శంకుస్థాపనలు
### 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో సిఎం చంద్రబాబు
### రూ.1,01,899 కోట్ల పెట్టుబడులు, 85,870 ఉద్యోగాలకు ఎస్ఐబిపిలో ఆమోదం

కాకుండా తక్షణం ఆమోదం తెలియచేయాలి. ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన పరిశ్రమలు, ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూసే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. పెట్టుబడులు పెట్టే పరిశ్రమల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండాచూడాలి. క్షేత్రస్థాయిలో ఆయా పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అనుమతులను త్వరిత గతిన వచ్చేలా శ్రద్ధ పెట్టాలి. గతపాలకులు భూమి కేటాయించినా ఇప్పటికీ ప్రారంభంకాని ప్రాజెక్టులు ఎన్ని ఉన్నాయో సమీక్షించాలి. ఏ ప్రాజె క్టులైనా నిర్మాణ పురోగతి లేకపోతే అనుమతులు >>2

## వి.కావేరి ట్రావెల్స్ యజమాని అరెస్టు
### బస్సు దగ్ధం కేసులో ఎ2 ముద్దాయిగా వినోద్ కుమార్

**కర్నూలు, నవంబరు 7, ప్రభాతవార్త :** ట్రావెల్స్ బస్సు దగ్ధం కేసులో వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను శుక్రవారం కర్నూలు పోలీసులు అరెస్టుచేశారు. 2025 అక్టోబర్ 24వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో కర్నూలుజిల్లా ఉలిందకొండ పీఎస్ పరిధిలోని కల్లూరు >>2

## ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా
### సాస్కి నిధుల సాయంతో పల్లెపండుగ-2: డి.సిఎం పవన్

**విజయవాడ,నవంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు నాణ్యతతో కూడిన స్వచ్ఛమైన మంచి నీటి సరఫరా, గుంతలు లేని రహదారులు అందుబాటులో ఉంచాలన్నదే తన ముందున్న ప్రధాన లక్ష్యమని పవన్ కల్యాణ్ వెల్లడించారు. తన ప్రతి అడుగూ ఆ దిశగానే ఉంటాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్, పల్లె పండగ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా పాటిం చాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పల్లె రోడ్ల సమాచారం ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో త్వరలో సరికొత్త సాంకేతికతను ఆవిష్కరించబోతున్నట్టు తెలిపారు.జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా గ్రామీణ రోడ్ల పూర్తి సమా చారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకునే సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. సాస్కీ నిధుల సాయంతో పల్లె పండగ 2.0ని >>2



శుక్రవారం పల్లె పండగ 2.0, జల్ జీవన్ మిషన్, స్వమిత్వ పథకాలపై సమీక్షిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

## అమరావతికి రూ.7,500 కోట్ల భారీ ఆర్థిక సహకారం

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, నవంబరు 7:** ప్రజారాజధాని అమరావతి అభివృద్ధి పనులు శరవేగంగా జరిగేలా "నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్ సంస్థ (ఎన్ఎబిఎఫ్ఐడి) సంస్థ రూ.7,500 కోట్ల రుణాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(ఏపీ సిఆర్డిఏ)కు మంజూరు చేసింది. ఈ రుణం ద్వారా రాజధాని నగరంలోని ముఖ్యమైన నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి.రుణం మంజూరుకు సంబంధించిన పత్రాలను శుక్రవారం అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ సామ్యూల్ జోసెఫ్, ఎన్ఎబిఎఫ్ఐడి బ్యాంకు అందించే రుణాలు ప్రాజెక్ట్ ఫైనాన్స్ విభాగ వైస్ ప్రెసిడెంట్ కె.దినేష్, ఏపీ సిఆర్డిఏకమిషనర్ కె.కన్నబాబుకు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,మంత్రి డా.పొంగూరు నారాయణ పాల్గొన్నారు. అమరావతి నిర్మాణానికి లభించిన ఈ యొక్క ఆర్థిక సహకారం ద్వారా రాజధాని నిర్మాణ అభివృద్ధి పనులు వేగంగా జరగనున్నాయి.ప్రజారాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దడంలో ఎన్ఎబిఎఫ్ఐడి అందజేసిన ఆర్థిక సహకారం ముఖ్యమైనదిగా పరిగణించబడుతోంది.



Vijayawada: Andhra Prabha Colony: Mithra Auto Agency: 7337540033. 8886063544 | Varun Motors: Ring Road: 9885701729 Enikepadu: 9885104222, 9885706831 | Kanuru: Santosh Auto: 7799787967 | Eluru: Reddy & Reddy Motors: 9533290285 | Bhimavaram: Novelty Reddy & Reddy Motors: 9948424555 | Guntur: Jayalakshmi Automotives: 7396669031 | Varun Motors: 8977752604 | Nellore: Vishnu Cars: 7995088876 | Bhargavi Automobiles: 9848357778 | Ongole: Jayalakshmi Automotives: 9949033433.

8-11pg2exHMNWJQER 2_8-11pg2exHMNWJQER.qxd 08/Nov/25 12:10 AM Page 1



# రాష్ట్రంలో 3 మెగాసిటీలు

>> రద్దు చేయాలి. ఎలక్ట్రానిక్ పార్క్ ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలి. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ రంగంలో విస్తృతమైన అవ కాశాలు ఉన్నాయి. చిప్, సెమీ కండక్టర్లు, డ్రోన్ వంటి పరిశ్రమలను ప్రోత్సహించాలి. రాష్ట్రంలో సుమారు 15 పారిశ్రామిక జోన్లను ఏర్పాటు చేసుకుని క్లస్టర్ వారీ విధానంతో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కూడా ప్రోత్సా హకాలు ఇస్తుంది. ఇలాంటి వాటిని గుర్తించి ప్రమోట్ చేయాలి. కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకాలు కొంచెం ఆలస్యమైనా రాష్ట్ర ప్రభుత్వం వైపు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పెట్టుబడులు చేజారకుండా చూడాలి. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సా హకాలపై సంప్రదింపులు జరుపుదాం. పారిశ్రామిక అవసరాల నిమిత్తం పరిశ్రమలకు విద్యుత్ సరఫరా విషయంలో ఇబ్బందులు లేకుండా చూసేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలి. కేంద్రంతో కలిసి పనిచేసే అంశాన్ని పరిశీలించాలి. ఇక ప్రభుత్వం కూడా పారిశ్రామిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేసు కోవాలి. అలాగే ఎవరైనా ప్రైవేట్ ల్యాండ్ ఓనర్లు తమ భూములను పరిశ్రమలకు, కంపెనీలకు ఇవ్వడానికి ముందుకు వస్తే.. అలాంటి వారిని ప్రోత్సహించాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**మెగా సిటీలు... మాస్టర్ ప్లాన్లు:** రాష్ట్రంలో మూడు మెగా సిటీలు అభివృద్ధి చేయాలి. అనకాపల్లి నుంచి విజయనగరం వరకు విశాఖను మెగా సిటీగా అభివృద్ధి చేయాలి. అలాగే తిరుపతి, అమరావతి నగరాలను కూడా మెగా సిటీలు చేయాలి. ఇప్పటికే అమరావతికి మాస్టర్ ప్లాన్ ఉంది. విశాఖ, తిరుపతి మెగా సిటీలకు కూడా మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ఈ మెగా సిటీలను టూరిజం, ఐటీ సహా వివిధ పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా చూడాలి. ఈ మేరకు టూరిజం, ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖలు సమన్వయం చేసుకుని ఈ మెగా సిటీలు అభివృద్ధి జరిగేలా చూడాలి. అలాగే వీటికి టౌన్ షిప్స్ ఇంటిగ్రేషన్ జరగాలి, నివాసయోగ్యమైన నగరాలుగా తీర్చిదిద్దాలి. గూగుల్ డేటా సెంటర్ వల్ల విశాఖకు మరిన్ని కంపెనీలు, పరిశ్రమలు రానున్నాయి. భవిష్యత్తులో విశాఖకు వచ్చే కంపెనీలకు భూ లభ్యత ఉండేలా చూసుకోవాలి. టూరిజం అభివృద్ధికి ఆతిథ్య రంగాన్ని ప్రోత్సహించాలి. ప్రముఖ బ్రాండ్‌లకు చెందిన హోటళ్ల నిర్మించేలా చూడాలి. రాష్ట్రంలో మూడు ఎకనామిక్ కారిడార్లు ఏర్పాటు అవుతున్నాయి. దీనికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు చేసుకోవాల్సి ఉంది. ఈ మేరకు మూడు కారిడార్లకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తాం. బీచ్ టూరిజాన్ని మరింతగా అభివృద్ధి చేయాలి" అని సీఎం చెప్పారు.

**పెట్టుబడుల సదస్సును ఘనంగా నిర్వహించాలి:** ఈ నెల, 14, 15వ తేదీల్లో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సును ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఎస్ఐపిబి ఆమోదించిన పరిశ్రమల్లో వేగంగా శంకుస్థాపనలు జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. తనతో పాటు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహా వివిధ శాఖల మంత్రులు ఆయా జిల్లాల్లో పరిశ్రమలకు శంకుస్థాపనలు చేస్తామని తెలిపారు. ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇక ఇటీవల తాను జరిపిన విదేశీ పర్యటనల్లో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులను భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానించానని.. వారు ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖంగా ఉన్నారని.. అలాగే భాగస్వామ్య సదస్సుకు వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని వివరించారు.

విశాఖలో జరగబోయే పెట్టుబడుల సదస్సుకు భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని ఈ సం దర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, టిజి భరత్, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బిసి జనార్ధన్ రెడ్డి, వాసం శెట్టి సుభాష్, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. **12వ ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదించిన పెట్టుబడుల వివరాలు:** రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్స్ లిమిటెడ్ రూ.202 కోట్లు, 436 మందికి ఉద్యోగాలు, ఎపిటోమ్ కాంపొనెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.700 కోట్లు, 1,000 మందికి ఉద్యోగాలు, ఎన్‌పిఎస్‌పిఎల్ అడ్వాన్స్ మెటీరియల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,081 కోట్లు, 600 మందికి ఉద్యోగాలు, క్రయాన్ టెక్నాలజీ లిమిటెడ్ రూ.1,154 కోట్లు, 1500 మందికి ఉద్యోగాలు, ఎస్‌సిఐసి వెంచర్స్ ఎల్ఎల్పీ రూ.550కోట్లు, 1130 మందికి ఉద్యోగాలు, ఇండిచిప్ సెమీ కండెక్టర్స్ లిమిటెడ్ రూ.22,976 కోట్లు, 1241 మందికి ఉద్యోగాలు, ఫ్లూయింట్‌గ్రిడ్ లిమిటెడ్ రూ.150 కోట్లు, 2,000 మందికి ఉద్యోగాలు, మథర్సన్ టెక్నాలజీ సర్వీస్ లిమిటెడ్ రూ.110 కోట్లు, 700 మందికి ఉద్యోగాలు, క్వార్క్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.115 కోట్లు, 2000 మందికి ఉద్యోగాలు, కె.రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,172 కోట్లు, 9,681 మందికి ఉద్యోగాలు, విశాఖ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,200 కోట్లు, 30వేల మందికి ఉద్యోగాలు, ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.119కోట్లు, 2,000 మందికి ఉద్యోగాలు, ఎస్ఏఇఎల్ సోలార్ పీ12 ప్రైవేట్ లిమిటెడ్ రూ.1728 కోట్లు, 860 మందికి ఉద్యోగాలు, నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ రూ.7972 కోట్లు, 2,700 మందికి ఉద్యోగాలు, మైరా బే వ్యూ రిసార్ట్స్ రూ.157 కోట్లు, 980 మందికి ఉద్యోగాలు, విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.51 కోట్లు, 750 మందికి ఉద్యోగాలు, సుగ్నా స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1247 కోట్లు, 1,100 మందికి ఉద్యోగాలు, సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ రూ.8570 కోట్లు, 1000 మందికి ఉద్యోగాలు, వాల్మన్ ల్యాట్స్ ప్రైవేట్‌లిమిటెడ్ రూ.1682 కోట్లు, 415 మందికి ఉద్యోగాలు, ఏఎమ్‌జీ మెటల్స్ అండ్‌మెటీరియల్స్ లిమిటెడ్ రూ.44,000 కోట్లు, 3000మందికి ఉద్యోగాలు, వాసంగ్ ఎంటర్ ప్రైస్ రూ.898 కోట్లు, 17,645 మందికి ఉద్యోగాలు, బిర్లాను లిమిటెడ్ రూ.240 కోట్లు, 588 మందికి ఉద్యోగాలు. సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.1,090కోట్లు, 1250 మందికి ఉద్యోగాలు, భారత్ డైనమిక్స్ రూ.489 కోట్లు, 500 మందికి ఉద్యోగాలు, డాజ్కో ప్రైవేట్ లిమిటెడ్ రూ.1234 కోట్లు, 1454 మందికి ఉద్యోగాలు, శ్రీవేదా ఇన్నోవేషన్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.12 కోట్లు, 1500 మందికి ఉద్యోగాలు కల్పించనున్నాయి.



శుక్రవారం సిఎం చంద్రబాబుతో సమావేశమైన మహిళా క్రికెటర్లు మిథాలీ రాజ్, శ్రీచరణి, మంత్రి లోకేష్

## మహిళా క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్ల ప్రోత్సాహకం


### ఇంటి నిర్మాణం కోసం వెయ్యి చ.గ స్థలం

### గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని సిఎం నిర్ణయం

**విజయవాడ,నవంబరు 7, ప్రభాతవార్తప్రతినిధి:** మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజేత, టీమిండియా సభ్యురాలైన తెలుగమ్మాయి శ్రీ చరణికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ నజరానా ప్రకటించారు. శ్రీ చరణికి రూ.2.5 కోట్ల నగదు బహుమతి ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. దీంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు కడపలో 1000 చ.గ. స్థలం కేటాయిస్తున్నట్టు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్ 1 అధికారిగా ఉద్యోగం కూడా కల్పిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి నారా లోకేష్‌ను క్రికెటర్ శ్రీచరణి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమెన్ వరల్డ్‌కప్ గెలుచుకున్న ఆనందక్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో శ్రీ చరణి పంచు కున్నారు. తనకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ శ్రీ చరణిని అభినందించారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకో వడం ద్వారా భారత దేశ మహిళల సత్తాచాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని సీఎం అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు భారత జట్టుకు అందించాలని అభిలషించారు. ఈ సందర్భంగా శ్రీ చరణి మహిళా క్రికెటర్లు సంతకాలు చేసిన టీ షర్ట్ ను ముఖ్యమంత్రికి అందించారు. దానిని ఆప్యాయంగా స్వీకరించిన ముఖ్యమంత్రి శ్రీచరణి బృందం భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. ఆమెకు వీణ బొమ్మను జ్ఞాపికగా అందజేసారు. శ్రీ చరణితో పాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మహిళా క్రికెట్ జట్టుమాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా ఉన్నారు. అంతకుముందు గన్నవరం ఎయిర్ పోర్టులో శ్రీ చరణికి ఘనస్వాగతం పలికిన మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆమెతో పాటు సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ శ్రీచరణికి స్వాగతం పలికారు.

## ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా

>> ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. డీసీఎం పవన్ కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో పల్లె పండగ 2.0, అడవి తల్లి బాట పనుల పురోగతి, జల్ జీవన్ మిషన్, స్వమిత్వ పథకాలపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిధులు అందుబాటులో ఉన్నా పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అటవి తల్లిబాట, జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా తక్షణం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రతి పనిని నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసేలా ఈ ప్రణాళికలు ఉండాలన్నారు. ఈ మేరకు యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సాస్కి నిధులకు అనుమతుల స్టేటస్ గురించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఉప ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ అంశంపై తక్షణం ఆర్థిక శాఖతో చర్చించాలని పవన్ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని, రహదారులను మెరుగుపరచుకునేలా ఈ టెక్నాలజీ ఉండాలి. ఈ విధంగా జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టంను త్వరితగతిన అభివృద్ధి చేయండి. అధునాతన సాంకేతికత సాయంతో అటువంటి వ్యవస్థకు రూపకల్పన చేయండి. 48 గంటల్లో దీనికి సంబంధించి ఒక స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం కావాలి. ఒక వర్కింగ్ గ్రూప్ రూపొందించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందులో పొందుపరచాలి. ఈ అంశంలో ఆర్టీజీఎస్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలి. అడవి తల్లి బాటను పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంచుకుని ఈ వ్యవస్థకు అనుసంధానించండి. తద్వారా ఎప్పటికప్పుడు గిరిజన గ్రామాల్లో జరుగుతున్న పనుల పరోగతిని పరిశీలించే అవకాశం ఉంటుంది. ఏ పని చేసినా ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి అన్నదే ప్రభుత్వ ఉద్దేశం" అని పవన్ కల్యాణ్ అన్నారు. గిరిజన గ్రామాల్లో చేపట్టిన అడవి తల్లిబాట పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని పవన్ కల్యాణ్ అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని, పక్కా ప్రణాళికతో అన్నింటినీ అధిగమించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం జన్మన్ పథకం కింద వచ్చే నిధులతోపాటు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం సాయం మొత్తం కలిపి 1,158 కోట్ల రూపాయలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. మొత్తం 761 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 662 రహదారులు నిర్మించాలన్న సంకల్పంతో పనులు ప్రారంభించామని తెలిపారు. అడవి తల్లిబాట పనులను వేగవంతం చేయాలని, ఎక్కడైనా అటవీ శాఖతోగాని, ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే వాటిని తక్షణం పరిష్కరించుకునేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయికి వెళ్లి పనుల పురోగతిని పరిశీలించాలన్నారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, మన్యం జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ఏదైనా సమస్య ఉంటే దాన్ని తక్షణం పరిష్కరించి పనులు ముందుకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని పవన్ సూచించారు. పల్లె పండగ పల్లె పండగ 2.0 కోసం సాస్కి నిధులు వినియోగించుకోవడంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన నిధులు విడుదలయ్యేలా కృషి చేయాలని పవన్ అన్నారు. రూ.2,123 కోట్ల సాస్కి నిధులతో పల్లెల్లో 4007 కిలోమీటర్ల మేర రహదారులు, గోకులాలు, మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, కమిషనర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షి ంచాలని అన్నారు. సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ శశిభూషణ్ కుమార్, కమిషనర్ శ్రీ కృష్ణ తేజ, సర్వే విభాగం కార్యదర్శి శ్రీ కూర్మనాథ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చీఫ్ ఇంజినీర్ శ్రీ బాలూ నాయక్, శ్రీమతి గాయత్రి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



శుక్రవారం అమరావతిలో ఎన్‌బిఎఫ్ఐడి కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధులతో సిఎం చంద్రబాబు, మంత్రి నారాయణ

## వి.కావేరి ట్రావెల్స్ యజమాని అరెస్టు

>> మండలం చెట్ల మల్లాపురం గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న వి.కావేరిట్రావెల్స్ బస్సు ప్రమాదంలో 19మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బస్సు డ్రైవర్ మరియు యజమాని మీద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, విచారణలో భాగంగా మొదటినిందితుడు మిరియాల లక్ష్మయ్యను అక్టోబర్ 28న అరెస్ట్ చేశారు. విచారణాధికారి పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య నేతృత్వంలో దర్యాప్తు కొన సాగగా, ఈ కేసులో రెండవ ముద్దాయి అయిన వి కావేరి ట్రావెల్స్ బస్సు యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను శుక్రవారం ఉదయం 7.30 గం.లకు పోలీసులు అరెస్ట్‌చేశారు. దర్యాప్తు కొనసాగు తన్నదని, మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు కర్నూలు పోలీసులు పేర్కొన్నారు.

## బనకచర్లపై ఎపి వెనక్కి

### డిపిఆర్ టెండర్లు రద్దు: పోలవరం అథారిటీ సమావేశంలో వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,నవంబర్7:** బనకచర్లపై ఆంధ్రప్రదేశ్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు లింక్ ప్రాజెక్టు నిర్మాణానికి డిపిఆర్ కోసం చేపట్టిన టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన పోలవరం అథారిటీ సమావేశంలో ఈ అంశాన్ని వెల్లడించింది. అంతరాష్ట్ర నదీ జలాల ఒప్పందాలకు విరుద్ధంగా ఏపీ ఈ ప్రాజెక్టును చేపడుతోందని తెలంగాణ రాష్ట్రం మొదటి నుంచి వ్యతిరేకిస్తూ వచ్చింది. దీనిపై కేంద్రానికి, సిడబ్ల్యుసికి ఫిర్యాదు చేసింది. న్యాయ పోరాటానికి సిద్ధమైంది. దీంతో ఏపీ ఈ ప్రకటన చేసినట్లు సమాచారం. ఫలితంగా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ఇప్పట్లో లేనట్లేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ప్రాజెక్టుపై ఇరు రాష్ట్రాలకు ఎలాంటి వివాదం లేకుండా మరో ప్రణాళికతో కూడా ఏపీ ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు.

### వారం - వర్జ్యం

08-11-2025, శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం శరదృతువు, కృష్ణపక్షం

తదియ ఉ.7.33, చవితి తె.4.26

మృగశిర రా.10.06, విశాఖ కార్తె

వర్జ్యం : తె.5.50-7.18

దు.ఉ.6.09-7.43

శుభసమయం : ఉ.10.45-11.15

రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం :** ఆప్తులనుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఆర్థికపరిస్థితి అనుకూలం.

**వృషభం :** కుటుంబ సమస్యలు కొంత వరకు తీరతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. ఆర్థికపరిస్థితి అనుకూలంగా వుంటుంది.

**మిథునం:** బంధువులతో వ్యక్తిగత విషయాలపై సంప్రదిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**కర్కాటకం :** భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. గృహ నిర్మాణ యత్నాలు సాగిస్తారు. కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** ఓర్పుతో నేర్పుతో ముందుకు సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు. పెట్టుబడులకు అనుకూలం.

**కన్య :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది.

**తుల :** ఆస్తి విషయాలలో నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు. వివాదాలకు దూరంగా వుండండి. ఋణబాధల నుండి విముక్తిని పొందుతారు.

**వృశ్చికం:** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. నూతన సంస్థలనుండి ఉద్యోగావకాశాలు కలిసి వస్తాయి.

**ధనుస్సు:** సన్నిహితులకు మాట సహాయం అందిస్తారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మకరం:** సంఘసేవా సంస్థలకు డబ్బు రూపేణా మీ వంతు సహాయాన్ని అందిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభిస్తాయి. వాహనసౌకర్యం కలదు.

**కుంభం:** భూమి, ఇళ్ల కొనుగోలు యత్నాలు సాగిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభిస్తాయి. ఆర్థిక పరమైన లావాదేవీలు అనుకూలంగా ఉంటాయి.

**మీనం :** నూతన కార్యక్రమాలను ప్రారంభించాలో నిర్ణయించుకోవడం కష్టతరమవుతుంది. వివాదాలకు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఆరాధన మంత్రం 'వందేమాతరం'

>> మాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదలచేసామని, ప్రతి గీతానికి ఒక మూలభావం, సందేశం ఉంటుందని అన్నారు. మన వందేమాతరం మూలభావం భారత్, తల్లి భారతి అని అన్నారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్‌స్టేడియంలో వందేమాతరం 150వ సంస్మరణ దినోత్సవంలో పాల్గొని మాట్లాడిన మోడీ స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాదిమంది భారతీయుల్లో స్ఫూర్తినింపిందని గుర్తుచేసారు. 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలునిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. వందేమాతరం గీతం 1875 నవంబరు ఏడోతేదీ బంకింగ్ చంద్ర ఛటర్జీ రచించారు. ఈ గీతం తొలిసారిగా ఛటర్జీ రాసిన ఆనంద్‌మఠ్ నవలలో ప్రచురించారు. అప్పటినుంచి జాతీయ గీతంగా ఆలాపనలోకి వచ్చింది.

**వందేమాతరం చరణాలు తొలగించేసారు!**

వందేమాతం జాతీయ గీతానికి 150 యేళ్లు నిండాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ ఉత్సవంలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ.. వందే మాతరం గీతంలోని కొన్ని ముఖ్యమైన చరణాలను 1937లో తొలగించినట్లు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూ మోడీ ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. విభజనకు చెందిన కొన్ని చరణాలను ఆ గేయం నుంచి తొలగించారని, ఇప్పటికీ లాంటి విభజన మైండ్‌సెట్ దేశానికి సవాల్‌గా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వందేమాతరం 150 ఏళ్లకుచెందిన సంస్మరణ స్టాంపు, నాణాన్ని ప్రధాని రిలీజ్ చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం ఈ దేశ స్వరంగా మారిందన్నారు. ప్రతిభారతీయుడు తమ మనోభావాలను ఆ గేయం ద్వారా వ్యక్తపరి చారన్నారు. కానీ 1937లో దురదృష్టవశాత్తు, వందేమాతరం గేయంలోని కొన్ని చరణాలను తొలగించారని, వందేమాతర గీత విభజన దేశ విభజనకు బీజం వేసిందన్నారు.

## ఎపిలో మైక్రోసాఫ్ట్ భారీ క్వాంటమ్ కంప్యూటర్

### రూ.1,772 కోట్ల పెట్టుబడి ప్రతిపాదన

### విట్‌వర్సిటీలో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి

**విజయవాడ,నవంబరు 7,పభాతవార్త ప్రతినిధి:**ఏపీలో మైక్రోసాఫ్ట్ భారీ క్వాంటమ్ కంప్యూటర్ అందుబాటులోకి రానున్నది. ఈ కంప్యూటింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్...రాష్ట్రంలో రూ.1,772.08 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించింది. ఇందులో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,200 క్యూబిక్ సామర్థ్యమున్న (50 లాజికల్ కూ ్యబిక్స్) భారీ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులతో అధికారులు జరిపిన సంప్రదింపులు ఫలవంతం కానున్నాయి. మైక్రోసాఫ్ట్ కోసం క్వాంటమ్ వ్యాలీలో 4వేల చదరపు అడుగుల .విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అమరావతిలో 133 క్యూబిక్ సామర్థ్యంతో ఐబీఎం సంస్థ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. క్వాంటమ్ వ్యాలీలో పెట్టుబడులు పెట్టేందుకు మరిన్ని సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. జపాన్‌కు చెందిన పుజిసు 64 క్యూబిక్ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం....రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ కింద అందించే నిధులకు మరో 50 శాతం వెచ్చించి ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. క్వాంటమ్ వ్యాలీలో పరిశోధనలు నిర్వహించే సంస్థలకు దశల వారీగా 90 లక్షల చదరపు అడుగుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం నిర్మించనున్న ఐకానిక్ టవర్ వల్ల 40 వేల చదరపు అడుగులు అందుబాటులోకి వస్తాయి. టవర్ నమూనాను ఎల్‌అండ్‌టీ సంస్థ రూపొందించింది. రాష్ట్రాన్ని క్వాంటమ్ కంప్యూటింగ్, డీప్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇప్పటికే 50 ఎకరాలను "క్వాంటమ్ వ్యాలీ" కోసం సీఆర్డీఏ కేటాయించింది. ఈ క్వాంటమ్ వ్యాలీలో దేశీయ, అంతర్జాతీయ యూనివర్సిటీలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలు, ఇండస్ట్రీలు అందరికీ అత్యాధునిక కంప్యూటింగ్ సేవలను అందించనుంది. దీనిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ (ఏక్యూసీసీ) అనే ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేశారు. ఇప్పటికే బోర్డు నిర్ణయాల ప్రకారం వివిధ కంపెనీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు (ఇవోఐ) ఆహ్వానించారు. ఇక అమరావతిలోని విట్ యూనివర్సిటీలో కూడా క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బెంగళూరుకు చెందిన క్యూపై ఏఐ సంస్థ అభివృద్ధి చేసిన చిన్న క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. దాని కోసం అయ్యే సుమారు రూ.6 కోట్ల ఖర్చును విట్ స్వయంగా భరిస్తుంది. ఈ ప్రాజెక్టుకు అద్దె లేదా వినియోగ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రాన్ని డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి భవిష్యత్ రంగాల్లో ఆవిష్కరణల కేంద్రంగా నిలబెట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ క్రమంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు కీలక మలుపు కానుంది. క్వాంటమ్ వ్యాలీ ద్వారా సైంటిఫిక్ రీసెర్చ్‌కు కొత్త అవకాశాలు, స్టార్టప్‌లకు ఆధునిక టెక్నాలజీ యాక్సెస్, పరిశ్రమలకు పోటీ శక్తికి పెంపొందించడంతో పాటు, ప్రపంచ టెక్నాలజీ మ్యాప్‌లో అమరావతి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.




శుక్రవారం వెలుగొండ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

## వెలుగొండ ఆయకట్టుకు 2026 కల్లా నీరు

### యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పనులు

### నిపుణులతో కలిసి పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల

**పెద్దదోర్నాల, ప్రభాతవార్త:** వెలిగొండ ప్రాజెక్టు పనులు వచ్చే సంవత్సరానికి పూర్తి చేసి ఆయకట్టు రైతాంగానికి పూర్తి స్థాయిలో నీరు అందిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వెలిగొండ ఫీడర్ కెనాల్‌ను ఇరిగేషన్ నిపుణుల బృందంతో, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి శుక్రవారం ఆయన వెలుగొండ ప్రాజెక్టు పరిశీలించారు. మొంథా తుఫాన్ వర్షాలకు వెలుగొండ ఫీడర్ కెనాల్ 850 మీటర్ వద్ద, వంద అడుగుల పొడవున 30 అడుగుల లోతులో పడిన గండిని చూశారు. జంట సొరంగాలలోకి 9కి.మీ చొచ్చుకు వచ్చిన నీటిని తొలగించే పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో కూడా వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకుని ఫీడర్ కెనాల్ సీసీ వాల్ లైనింగ్ నిర్మాణంలో డిజైన్స్ అప్రూవల్ చేయమని సూచించారు. ఈ సందర్భంగా వెలిగొండ క్యాంప్ ఆఫీసర్‌లో ప్రాజెక్టు పెండింగ్ పనులపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 30 ఏళ్ల కిందట తన భూమి పూజ చేసిన ఈ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తవ్వకపోవడంపై తీవ్ర ఆవేదన చెందినట్లు రామానాయుడు చెప్పారు. అందువల్లనే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వెలిగొండపై ఆయన ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులను పరుగులు తీయిస్తున్నారు అన్నారు. ఈ నేపథ్యంలోనే మేమంతా రేయింబవళ్లు శ్రమించి వెలిగొండ పూర్తికి కంకణం కట్టుకున్నామన్నారు. వాస్తవాలు ఇలా ఉండగా వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసిన జగన్, తన అబద్ధాల వేదిక సాక్షి మీడియాలో వెలిగొండపై అవాకులు చవాకులు పేలడం ఆశ్చర్యం గొలుపుతోందన్నారు ఏడాదిన్నరగా ప్రాజెక్టు పనులు కుంటుపడ్డాయని విమర్శలు చేయడం విడ్డూరం కాక మరేమిటి అని ప్రశ్నించారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లా, ఫ్లోరైడ్ బాధిత జిల్లా అయిన ప్రకాశం జిల్లా వాసులను మోసం దగా చేశాడు అన్నారు. తల్లిని, చెల్లిని మోసం చేసిన అతనికి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేయడం పెద్ద విషయం కాకపోవచ్చన్నారు. నిర్వాసితులకు రూ.900 కోట్లకు పైగా పరిహారం అందించాల్సి ఉండగా తన ఐదేళ్ల హయాంలో ఒక్క రూపాయి అందించలేదని దుయ్యబట్టారు. నాడు2014-19లో టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రూ.1373 కోట్లు నిధులు కేటాయించి రూ.1319 కోట్లు అనగా 96 శాతం ఖర్చు చేశారని చెప్పారు. పూర్తి కాకుండానే పూర్తయిపోయింది అని జాతికి అంకితం చేసిన జగన్ జమానా తరువాత కూడా.. టన్నెల్ -2లో ఇంకా 4.2 కి.మీ లైనింగ్ పనులు, బెంచింగ్ పనులు చేయడంతో పాటు, టీబీఎం మెషిన్ తొలగించాల్సి ఉందన్నారు. ఫీడర్ కెనాల్ లైనింగ్ 3 కి.మీ పొడవున రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల కోసం ఇటీవలే రూ.456 కోట్లతో టెండర్లు పిలిచామని రామానాయుడు వివరించారు. ఈ నెలలోనే ఫీడర్ కెనాల్ పనులు మొదలు పెట్టబోతున్నట్లు చెప్పారు. టన్నెల్-2లో బీటీఎం మెషిన్ తొలగించడానికి సాంకేతిక నిపుణుల కమిటీని నియమించామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు 2026 కల్లా వెలిగొండ పూర్తి చేసి, ఆయకట్టు రైతులకు నీరందించే లక్ష్యంతో రేయింబవళ్లు పని చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీకి కట్టుబడి ఇటీవలే హంద్రీనావా కాలువల ద్వారా రాయలసీమకు కృష్ణా జలాలను తరలించి చూపించామన్నారు. అలాగే వెలిగొండకు కూడా 2026 నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి నీరందించటం ఖాయమన్నారు. అలోగానే నిర్వాసితుల కాలనీలు పూర్తి చేయటం, పరిహారం పంపిణీ తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం గత హయాంలో ఈ ప్రాజెక్టుకి సంబంధించి ఏడు కాలనీలలో నాలుగు కాలనీలు నిర్మించినట్లు చెప్పారు. ఆ పనులు తాలూకు బిల్లులు ప్రభుత్వం వచ్చిన తర్వాతే చెల్లించామన్నారు. ఈ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధమైన కృషి జరుగుతుందని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు. జగన్ హయాంలో చిల్లిగవ్వ కూడా ఇవ్వని కారణంగా వెలిగొండ నిర్వాసితులకు ఇంకా 900 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉందన్నారు. 2026 సంవత్సరం చివరికి ప్రాజెక్టు పూర్తితో పాటు ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని రామానాయుడు చెప్పారు.

08-11Pg3exHMNWJQETKP 3 ONG_08-11Pg3exHMNWJQETKP.qxd 08/Nov/25 12:26 AM Page 1



# అమరావతి వెంకటపాళెంలో శ్రీవారి ఆలయం విస్తరణ

**- ఆలయ ప్రాకారం, కల్యాణోత్సవమండపం, రాజగోపురం పనులు**
**- డిసెంబర్ 30నుండి పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు - టిటిడి ఇఒ ఎకెసింఘాల్**


తిరుమలలో డయల్ యువర్ ఇఒ కార్యక్రమం

**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వెంకటపాళెంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం విస్తరణ పనులు చేపడుతున్నట్లు టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ వెల్లడించారు. ఆలయంలో ఆలయ ప్రాకారం, కల్యాణోత్సవమండపం, రాజగోపురం తదితర అభివృద్ధి పనులు ఈనెల 27వతేదీ నుండి ప్రారంభవుతాయన్నారు. భక్తుల సూచనల మేరకు శ్రీవారి దర్శనాలకు సంబంధించి శ్రీవాణి,ఇతర దర్శన టోకెన్లు జారీచేసే విధానంపై పరిశీలించి నివేదిక సమర్పించేందుకు టిటిడి ధర్మకర్తలమండలి ఒక కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబర్ 30వతేదీ నుండి 2026 జనవరి 8వతేదీ వరకు పది రోజులు వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తున్నామని, టిక్కెట్లు, టోకెన్లు జారీ విధానం త్వరలోనే ప్రకటిస్తామన్నారు. శుక్రవారం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం అనంతరం మీడియాతో భక్తులు సూచనలు, సలహాలు, ఇంకా చేపట్టే పలు అంశాలపై వివరించారు. ప్రతినెలా ఆన్‌లైన్‌లో విడుదల చేసే ఆర్జితసేవలు, ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, దివ్యాంగులు,వృద్ధుల దర్శనాల టిక్కెట్లు బుక్‌చేసుకోవడంలో ఇబ్బందులను అధిగమించి ఒక స్పష్టమైన విధానం అమలుచేయనున్నామని ఇఒ సింఘాల్ తెలిపారు. ఇక అంగప్రదక్షణకు సంబంధించి ఆన్‌లైన్ లక్కీడిప్‌లో జారీచేసే టోకెన్లను ఇకనుండి ముందువచ్చిన వారికి ముందన్నట్లు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి నెలకోటా కేటాంయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం తిరుమలలో ఏటిసి(ఆళ్వార్ ట్యాంక్ విశ్రాంతి భవనం)నుండి గోగర్భమ్ డ్యామ్ కూడలి వరకు శాశ్వత షెల్టర్లు, క్యూలైన్లు, స్టీల్ ఫుట్‌వేర్‌బ్రిడ్జిలు, మరుగుదోడ్లు నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో 750 కోట్ల రూపాయలతో శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఐదువేల భజనమందిరాలు నిర్మాణం చేపడతామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి ఆలయాల్లో భక్తుల రద్దీకి తగ్గట్లు అన్నప్రసాదాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇఒ చెప్పారు. ఇక ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి దళారులను నమ్మి మోసపోవద్దని, భక్తులు ఆన్‌లైన ద్వారానే దర్శన టిక్కెట్లు పొందాలని ఇఒ విజ్ఞప్తి చేశారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీవిధివిధానాలు త్వరలోనే తెలియజేస్తామని ఆయన వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్ణయం తీసుకుని పాదర్శకంగా టోకెన్లు కేటాయించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విఎస్ఒలు ఎస్టీవి రామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఎస్వీబిసి సిఇఒ ఫణికుమార్‌నాయుడు ,పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.



## భారతదేశ ప్రేమ, ఐక్యతకు ప్రతీక 'వందేమాతరం'

**తిరుపతి,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** 1875లో రచించిన వందేమాతరం గేయం భారతదేశ ప్రేమ, ఐక్యతకు, భక్తి భావానికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిందని పలువురు వక్తలు కొనియాడారు. భారతీయ సంప్రదాయం,చేనేతను ప్రోత్సహించాలనే సంకల్పంతో కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, ఆచార్యులు, హ్యాండ్లూమ్ చీరలు ధరించారు. చేనేత వస్త్రాలను ధరించాలనే సామూహిక ప్రతిజ్ఞ చేశారు. వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని ఘనంగా శుక్రవారం పద్మావతి మహిళ వర్సిటీ ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో పండుగవాతావరణంలా నిర్వహించారు. పద్మావతి వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య రజని, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వందేమాతరం స్ఫూర్తిని భావి తరాలకు అందించే బాధ్యత మనదే: డిసిఎం పవన్



**విజయవాడ,నవంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ రణ నినాదంలా నిలిచింది వందేమాతరం అని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ గారు రాసిన ఈ గేయం యావత్ దేశాన్ని ఉద్యమ స్ఫూర్తితో నడిపించింది. స్వతంత్ర సమరయోధులకు మనో బలాన్ని ఇచ్చింది. బ్రిటిషర్లను వందేమాతరం అనే మాటే భయపెట్టింది. భారతీయుల నోట మంత్రంలా మారిన వందేమాతరాన్ని పలికితే జైళ్ల పాల్జేశారు. ఈ రోజుకీ వందేమాతరం ఆలపించినా, విన్నా నరనరాన దేశభక్తి నిండుతుంది. ఒళ్ళు పులకరిస్తుంది. శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ గారు మన జాతికి అందించిన ఆ గేయంలో ఉన్న శక్తి అది. పోరాట స్ఫూర్తిని నింపిన వందేమాతరం గురించి భావి తరాలకు ఘనంగా తెలియచేయాలి. ఈ గేయం శుక్రవారం నాటికి 150 ఏళ్ళు పూర్తి చేసుకొంటుంది. దేశవ్యాప్తంగా నిర్దేశిత సమయంలో ప్రజలందరూ వందేమాతరం ఆలపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# తిరుమల సమాచారం

## కపిలేశ్వర సన్నిధిలో ముగిసిన చండీహోమం



**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వర ఆలయంలో ప్రముఖ శైవాలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా శుక్రవారం చండీహోమం ముగిసింది.గతనెల 30వతేదీనుండి శుక్రవారం వరకు ఈ హోమాలు జరిగాయి. శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా యాగశాలలో చండీయాగం సమాప్తి, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాభిషేకం, అమ్మవారి మూలవర్లకు కలాశాభిషేకం, అలంకరణ, నివేదన హారతి చేపట్టారు. సాయంత్రం కలశస్థాపన పూజ, జపం, హోమం, నివేదన జరిపించారు. 500 రూపాయలు చెల్లించి గృహస్థభక్తులు ఈ హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## అనూహ్యంగా పెరిగిన వారాంతపు రద్దీ



**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలదివ్యక్షేత్రం భక్తులతో జనసంద్రంగా మారింది. వారాంతం సెలవులు,రెండవ శనివారం, ఆదివారం రావడంతోబాటు కార్తీకమాసంతో తిరుమలలో లక్షలాదిమంది భక్తులు ఉన్నారు. ఏకంగా వీరంతా ఆ దేవదేవుని దర్శనానికి సర్వదర్శనం క్యూలైన్లలో నారాయణగిరి ఉద్యానవనాల షెడ్ల వద్దనుండి నిరీక్షిస్తున్నారు. శనివారం మరింతమంది భక్తులు తమిళనాడు, కర్నాటక నుండి తరలివచ్చారు.. ఆలయానికి ఎదురుగా అఖిలాండం వద్ద కొబ్బరికాయకొట్టి ఏడుకొండలస్వామీ గోవిందా గోవింద నామస్మరణతో పునీతులవుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు తిరుమలకు కాలినడకన భారీగా భక్తులు చేరుకున్నట్లు టిటిడి సమాచారం. దీంతోబాటు తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం వెంకటాద్రినిలయం అందుబాటులోకి రావడంతో నాలుగువేలమంది సామాన్యభక్తులకు వసతి కల్పించేందుకు సులభమైంది. సామాన్యభక్తులు తిరుమలలో స్వామివారి దర్శనానికి 16గంటలుపాటు నిరీక్షించాల్సిన అవసరం ఉంది. భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ శ్రీవారి సేవకులతో నిరంతరాయంగా అన్నప్రసాదాలు,తాగునీరు,కాఫీ, పాలు అందించేలా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ,,విఎస్ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, డిప్యూటీ ఇఒలు రాజేంద్ర,సోమాన్నారాయణ పర్యవేక్షిస్తున్నారు. సాయంత్రంవరకు 41వేలమంది భక్తులు మహాలఘులో గోవిందుని దర్శనం చేసుకున్నారు.

## భారతీయ జాతి గౌరవానికి ప్రతీకగా నిలిచిన గీతం వందేమాతరం : వైఎస్ జగన్



**విజయవాడ.నవంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ జాతి గౌరవానికి ప్రతీకగా నిలిచిన "వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ తన సోషల్ మీడియా వేదిక ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు."వందేమాతరం 150 సంవత్సరాల స్ఫూర్తికి నా వందనం. భరత జాతి నఖశిఖ పర్యంతం, నరనరాల్లో ఉప్పొంగిన ఉద్యమ గీతమే వందేమాతరమని, సామాన్యులను సమరయోధులుగా మలచి, స్వాతంత్ర్య స్ఫూర్తికి సంకల్ప బలాన్ని అందించిన సాత్విక సాయుధ శరమే వందేమాతరమన్నారు.బంకిం చంద్ర ఛటర్జీ గారు రచించిన ఈ పవిత్ర గీతం మన స్వాతంత్ర్య సమరయోధులలో రగిలించిన ఐక్యతా భావనే మనందరికీ ఆదర్శం. ఆ స్ఫూర్తితో మన భావితరాల కోసం, వారి అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాంఅని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.

## 30 యేళ్లు దాటిన మహిళలు స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలి

### ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్

**విజయవాడ.నవంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం ఇంటింటికీ వచ్చి చేసే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ లను చేసుకునేందుకు మహిళలు ముందుకు రావాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జి.వీరపాండియన్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారంనాడు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశాతో కలిసి మహిళలకు ప్రత్యేక క్యాన్సర్ పరీక్షకు ఆహ్వానం పేరుతో రూపొందించిన ఇన్విటేషన్ కార్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...నాలుగో విడత ఎన్సీడీ(నాన్ కమ్యునకబుల్ డిసీజెస్) స్క్రీనింగ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 17న ప్రారంభించారని, ప్రత్యేకించి ఇది క్యాన్సర్ స్క్రీనింగ్ ఉద్దేశించినదని తెలిపారు. శుక్రవారం నుండి క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని విజయవాడ నుంచి ప్రారంభిస్తున్నమన్నారు. మూడవ విడత ఎన్సీడీ స్క్రీనింగ్ లో ఎదురైన అనుభవాలు, సవాళ్లను పరిశీలించిన అనంతరం 4వ విడతలో ప్రత్యేకించి క్యాన్సర్ స్క్రీనింగ్ పై దృష్టిపెట్టాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారన్నారు. 4వ విడత ఎన్సీడీ స్క్రీనింగ్ పై అవగాహన కల్పించేందుకు పెద్దఎత్తున ప్రచారాన్ని చేపట్టామని, ఇందుకోసం ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ మరియు కమ్యూనికేషన్(ఐఇసి) కార్యక్రమం కింద పోస్టర్లు, కరపత్రాల్ని ప్రచురించి జిల్లాలకు పంపించామన్నారు.

## హైకోర్టు ఆదేశాల మేరకే క్రీడా కోటా ఎంబిబిఎస్ అభ్యర్థుల తుది జాబితా

**- బెంగాల్ ఐపిఎస్ అధికారి కుమార్తెకు సీటు కేటాయింపుపై శాప్ స్పష్టత**

**విజయవాడ,నవంబరు 7,ప్రభాత వార్తప్రతి నిధి:** ఏపీ హైకోర్టు మార్గదర్శకాలను అనుసరించి క్రీడా కోటా ఎంబీబీఎస్(నీట్) అభ్యర్థుల తుది జాబితాను రూపొందించి సంబంధిత విశ్వవిద్యాలయానికి సమర్పిస్తామని శాప్ తెలిపింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ ఐపీఎస్ అధికారి కుమార్తెకు నిబంధనలకు విరుద్ధంగా ఏపీ క్రీడా కోటాలో ఎంబీబీఎస్ సీటు కేటాయించినట్లు కొన్ని ప్రసార మాధ్యమాల్లో తప్పుడు వార్తలు వచ్చాయని పేర్కొంది. గురువారం ఓ ప్రకటనలో వాటిని ఖండించింది. కేటాయింపులో శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రమేయం ఉందని వచ్చిన ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ ప్రవేశాలకు సంబంధించి క్రీడా కోటా కింద అభ్యర్థుల ప్రాధాన్య క్రమ జాబితా(టెంటేటివ్ ప్రయారిటీ లిస్టు)ను గత నెల 9న ప్రకటించాం. దీనిపై అభ్యంతరాల స్వీకరణకు ఏడు రోజులు గడువిచ్చాం. తన కుమార్తె పద్మావతికి ఏపీ క్రీడా కోటా కింద సీటు మంజూరు చేయాలని ఐపీఎస్ అధికారి వీఎస్ఆర్ అనంతనాగ్...శాప్‌నకు అర్జీ పెట్టారు. ఈ మేరకు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఆమెకు సీటు కేటాయించాలని ఏపీ హైకోర్టు బుధవారం ఉత్తర్వులిచ్చింది'.

## స్టేట్ బార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కారమ్స్,చెస్ పోటీలు

కార్యక్రమాన్ని ప్రారంభించనున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

బహుమతులను పంపిణీ చేయనున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య

**విజయవాడ,నవంబరు 7,ప్రభాతవార్త** తొలి సారిగా ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్వర్యంలో ఫెడరేషన్ అధ్యక్షులు,బెజవాడ బార్ అధ్యక్షులైన ఎకె భాషా (అబ్దుల్ ఖుద్దూస్ భాషా),గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు,బార్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వై.శివ సూర్యనారాయణ తదితరుల నేతృత్వంలో నేడు,రేపు కారమ్స్,ఛెస్ పోటీలను బెజవాడ బార్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ప్రారంభించనుండగా, గెలుపొందిన విజేతలకు బహుమతులను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య పంపిణీ చేయనున్నారు. తొలి సారిగా అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర స్థాయిలో జరుగనున్న ఈ పోటీలు బెజవాడ బార్ అసోసియేషన్‌లో జరగనుండటం విశేషం. ఈ కార్యక్రమంలో బార్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులైన,నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.అయ్యప్పరెడ్డి,విశాఖపట్నం బార్ అధ్యక్షులు ఎంకె శ్రీనివాస్,కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.హరినాథ్‌చౌదరి,ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీలుగా వ్యవహరిస్తున్న ఏలూరు బార్ అధ్యక్షులు కె.సీతారామారావు,ఒంగోలు బార్ అధ్యక్షులు బి.భాస్కరరావులు కూడ ఈ పోటీలకు సహకారం అందించనున్నారు. ఈ పోటీల వలన బెజవాడ బార్ గౌరవం మరింత ఇనుమడించనుందని పలువురు న్యాయవాదులు పేర్కొంటున్నారు. గౌరవ అతిథులుగా కృష్ణాజిల్లా జడ్జి గుట్టల గోపి,విజయవాడ రెండవ అదనపు జిల్లా,సెషన్స్ న్యాయమూర్తి ఎ.సత్యానంద్,ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సూరాబత్తుల మల్లేశ్వరరావు,సుంకర రాజేంద్రప్రసాద్,చలసాని అజయ్‌కుమార్,కె.చిదంబరం,విడి సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ దివాకరబాబు,విజయవాడ పోలీస్ కమీషనర్ ఎస్‌వి రాజశేఖరబాబులు పాల్గొననున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగనున్న ఈ పోటీలు నేడు,రేపు ఉదయం 10 గంటలకు బెజవాడ బార్ అసోసియేషన్ ప్రాంగణంలో జరుగనున్నాయి.రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదుల మధ్య జరిగే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పోటీలకు బెజవాడ బార్ వేదిక కానుంది.

## 11,12,13 తేదీల్లో టిడిపి మండల, క్లస్టర్,యూనిట్, విలేజ్, బూత్ కమిటీల ప్రమాణస్వీకారం : రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు 'పల్లా'

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, నవంబర్ 7:** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోని మండలం, క్లస్టర్, యూనిట్, విలేజ్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈనెల 11,12,13 తేదీల్లో ఆయా నియోజకవర్గ పార్టీ కార్యాలయాల్లో జరుపుకోవాలని రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

కార్యకర్తల ఆమోదంతో పార్టీ అధిష్ఠానం ఖరారు చేసిన తుది జాబితాను పంపిచటం జరిగిందన్నారు. అందరికీ సమాచారం అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 'పల్లా' పేర్కొన్నారు.

# 2023లో నోటిఫికేషన్‌పై ఇంజనీరింగ్ నియామకాలు జరగలేదు

**-'డయల్ యువర్ ఇఒ'కు భక్తులు ఫిర్యాదులు**

**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ఇష్టదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి ఆలయంలోనికి వచ్చిన భక్తులను క్యూలైన్లలో సిబ్బంది తోస్తున్నారని ,దీనివల్ల భక్తులు అసహనం చెందుతున్నారని అనంతపురంకు చెందిన మణికంఠ ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో దర్శన టిక్కెట్లు బుకింగ్‌పై ఓటిపి రావడానికి ఆలస్యమవుతోందని తెలిపారు. దీనిపై టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ సమాధనంగా భక్తుల సలహాలు, సూచనల మేరకు ఓటిపి విధానం తీసుకురావడం జరిగిందని, సమస్యను పరిష్కరిస్తామన్నారు. దర్శన క్యూలైన్‌లోభక్తులతో మెలిగే విధానంపై శ్రీవారి సేవకులకు శిక్షణనిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. హైదరాబాద్‌నుండి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ మూడునెలల అడ్వాన్స్‌గా టిక్కెట్లు బుక్‌చేసుకునే విధానం ఇబ్బందిగా ఉందని, ప్రతిరోజూ టిక్కెట్లు బుక్‌చేసుకునే విధానం బావుంటుందని తెలిపారు. దీనిపై ఇఒ స్పందిస్తూ భక్తులందరికీ ఇబ్బంది లేకుండా అడ్వాన్స్ బుకింగ్ విధానం తీసుకురావడం జరిగిందన్నారు. కడపనుండి గణేశ్ మాట్లాడుతూ 2023లో ఇంజనీరింగ్‌విభాగంలో ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని, కానీ నియామకాలు జరగలేదని తెలిపారు. ఈ విషయంపై స్పందించిన ఇఒ ఈ విషయం తనవరకు వచ్చిందని, 15రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం ఉదయం అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరిగింది. గంటసమయం నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుండి 19మంది భక్తులు తమతమ ఫిర్యాదులు,అభిప్రాయాలు, సూచనలు చేశారు. వాటన్నిటికీ టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ సమాధానాలిచ్చారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విఎస్ఒలు ఎస్టీవి రామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్(ఆర్1),సోమన్నారాయణ(ఆరోగ్యం), రాజేంద్ర(అన్నదానం),ఉద్యానవనవిభాగం డిడి శ్రీనివాసులు, ఎస్వీబిసి సిఇఒ ఫణికుమార్‌నాయుడు ,క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు. ఖమ్మంనుండి సాయిచరణ్ మాట్లాడుతూ శ్రీవారి దర్శనం టిక్కెట్లు పొందే సమయంలో డెబిట్,క్రెడిట్ కార్డులు బదులుగా ఆర్‌బిఐ సూచించిన యూపిఐద్వారా చెల్లించే సౌలభ్యం కల్పించాలని కోరారు. ఇందుకు ఇఒ సింఘాల్ సమాధానంగా ఐటివిభాగం అధికారులతో చర్చించి అమలుచేసేలా చూస్తామన్నారు. బెంగుళూరునుండి రమేశ్ మాట్లాడుతూ శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహించే మండపంలో ఇకచోట మాత్రమే తాగునీరు ఉందని, మరోచోట ఏర్పాటుచేయాలని కోరారు.దీనిపై ఇఒ స్పందిస్తూ సమస్య అర్థమైందని, భక్తుల సౌకర్యాలపై ఇచ్చిన సూచనను పాటించి అమలుచేస్తామన్నారు. అనంతపురం నుండి ఈశ్వర్ మాట్లాడుతూ కొంతమంది ప్రజాప్రతినిధుల పిఆర్ఒలు అధిక ధరలకు దర్శనం టిక్కెట్లు అమ్ముతున్నారని, కట్టడిచేయాలని సూచించారు. ఈ ప్రశ్నకు ఇఒ సింఘాల్‌స్పందిస్తూ ప్రజాప్రతినిధులకు టిటిడి సౌకర్యం కల్పించిందని, కొంతమంది దళారులు డబ్బులు తీసుకుని భక్తులను మోసగిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. దళారులను నమ్మవద్దని, శ్రీవాణి ట్రస్ట్‌ద్వారా టిక్కెట్లు పొంది స్వామివారిని దర్శించుకోవాలని ఇఒ కోరారు.


తిరుమలలో డయల్ యువర్ ఇఒలో అధికారులు

# ఉల్లిరైతుల ఖాతాల్లో హెక్టారుకు రూ.50వేలు

## ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ,నవంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రైతులకు అండగా నిలవాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారికంగా ప్రకటన చేసింది. ఉల్లి రైతులను ఆదుకోవాలని నిర్ణయించినట్లు ఏపీ ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకోసం హెక్టారుకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు సిద్ధమవుతుంది. కర్నూలు, కడప జిల్లాల్లోని 20,913 మంది రైతులకు రూ. 104.57 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది. ఈపంట ఆధారంగా ఈ సహాయం అందుతుందని అధికారులు వెల్లడించారు. ఉల్లి రైతులకు అండగా నిలవాలని.. ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసు కుంది. దీనివల్ల 45 వేల ఎకరాల్లో ఉల్లి పండించిన రైతులకు మేలు జరుగుతుంది. ఇప్పటికే ఉల్లి కొనుగోలులో మార్కెటింగ్ శాఖ, మార్క్‌ఫెడ్ కీలక పాత్ర పోషించాయి. క్వింటాల్ ఉల్లి రూ.1,200 చొప్పున, మొత్తం రూ.18 కోట్లు వెచ్చించి కొనుగోలు చేశాయి. దీనికి సంబంధించి రూ.10 కోట్లు ఇప్పటికే రైతులకు చెల్లించారు. మిగిలిన రూ.8 కోట్లను కూడా త్వరలోనే అందిస్తామని మంత్రి అచ్చన్నాయుడు వెల్లడించారు. వివిధ పరిస్థితుల కారణంగా ఈసారి క్వింటా ఉల్లి రూ.600 కంటే ఎక్కువ ధర పలకలేదు. దీంతో ప్రభుత్వం క్వింటా రూ.1,200 చొప్పున సుమారు లక్షా 39 వేల క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేసింది.కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చిన ఉల్లిని దాదాపుగా సేకరించింది. కొంత ఉల్లిని రైతు బజార్లకు, మరికొంత ఉల్లిని వ్యాపారులకు తరలించి విక్రయించింది. అయినప్పటికీ కొంతమంది రైతుల వద్ద ఇంకా ఉల్లి మిగిలి ఉంది. గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారని గుర్తించిన ప్రభుత్వం.. ఉల్లి సాగు చేసిన రైతులకు హెక్టారుకు రూ.50వేల చొప్పున అందించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. దీనికి సంబంధించిన నియమనిబంధనల మేరకు లబ్దిదారులకు సాయం అందనుంది. ఇక.. మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం పైన ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తుఫాను కారణంగా దాదాపు రూ 5,245 కోట్ల మేర రాష్ట్రానికి నష్టం వాటిల్లినట్లు కేంద్రానికి నివేదిక పంపారు. తక్షణ సాయం కోరారు. పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు.

# పరకామణి కేసులో సిఐడి పక్కాఆధారాల కోసం వ్యూహం!

**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో 2023లో జరిగిన చోరీ కేసులో నిందితుడు రవికుమార్ పట్టుబడిన తీరు, ఆ తరువాత పోలీసులు కేసు నమోదు, విచారణ, చివరకు లోక్‌అదాలత్‌లో రాజీచేసుకున్న అంశాల వరకు సిఐడిపక్కా ఆధారాల కోసం వ్యూహాత్మకంగా అడుగులేస్తోంది. ఇప్పటికే నిందితుడు రవికుమార్ కూడబెట్టిన అక్రమ ఆస్తులపై తెలిసిన విషయాలు చెప్పాలని సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్ మీడియా సమావేశంలో విజ్ఞప్తిచేసిన విషయం విదితమే. ఇందుకోసం 9440700921 నంబర్‌కు వాట్సాప్‌ద్వారా,లేక ఏడిజిసిఐడిఅట్‌దిరేట్‌ఆఫ్ ఎపి.జిఒవి.ఇన్"కు మెయిల్‌చేసినా వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా కల్పించారు. అయినా సిఐడి అధికారులు వారి స్థాయిలో వాళ్ళు వివరాలు ఆరాతీస్తున్నారు. హైకోర్టు ఆదేశాలతో దర్యాప్తుకు రంగంలోకి దిగిన సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్, ఎస్పీలు, డిఎస్పీలు,సిఐల బందం ఐదుటీమ్‌లుగా విడిపోయి తిరుమల,తిరుపతిలో క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే తిరుమలలోపరకామణి భవనం, కమాండ్ కంట్రోల్ రూమ్, సిసి టివి దృశ్యాలు, చోరీచేస్తూ నిందితుడు పట్టుబడిన ప్రాంతం మరోసారి పరిశీలించారు. పరకామణిలో కొందరి సిబ్బందిని కూడా సమాచారం కోసం పలకరించినట్లు తెలుస్తోంది. పెద్దజీయర్ మఠంలో గుమస్తాగా ఉండే రవికుమార్ పరకామణివిధులకు ఎలా వెళ్ళాడు?అక్కడ ఎవరి సహాయంతో కీలకమైన హోదాలో విధులు నిర్వహించాడనేది ఇప్పుడు సిఐడి రాబడుతున్న విషయం. అయితే అన్ని కోణాల్లో దర్యాప్తు మొదలుపెట్టామని, డిసెంబర్ 2వతేదీకి హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామని డిజి రవిశంకర్‌అయ్యన్నార్ మీడియాకు తెలిపారు. ఈ కేసులో విచారణ, దర్యాప్తుపై ఊహాగానాలు వద్దని, మరింతగా సమాచారం హైకోర్టుకు అందజేస్తామన్నారు. ఈ కేసులో అక్రమాలు అవకతవకలు జరిగాయనేది స్పష్టమైందని, సమగ్ర దర్యాప్తు చేపడతామన్నారు.




## 26 మంది పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

**విజయవాడ,నవంబరు 7,ప్రభాత వార్తప్రతినిధి:** స్వర్ణ పంచాయతీల డేటా సేకరణలో తీవ్ర నిరక్ష్యం వహించిన 26మంది పంచాయతీ కార్యదర్శులపై ఆ శాఖ కమిషనర్ సస్పెన్షన్ వేటువేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణ పంచాయతీ పోర్టల్ తీసుకురాగా, కొందరు పంచాయతీ కార్యదర్శుల నిర్వాకంతో ఈప్రక్రియలో తప్పిదాలు జరిగాయి. దాదాపు మూడు వేల పంచాయతీల పరిధిలో వీటిని గుర్తించారు. ఒక్కో పంచాయతీలో ఒకే ఫోన్ నంబర్‌ను వందల అసెసమెంట్‌లకు లింక్ చేసినట్టు అధికారులు గుర్తించారు. దీంతో తీవ్రనిరక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శులను..

.జిల్లాకు ఒకరి చొప్పున గుర్తించి వారందరిపైనా ప్రభుత్వం వేటు వేసింది.

వార్త

ధైర్యం అన్నదే అసలయిన సంపద. ధైర్యం కోల్పోయినట్టయితే అన్నీ కోల్పోతాం.

-జేమ్స్ చెర్రీ

# కల్తీకి కాపలాదారులా?


మానవుడికే కాదు పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి సంకటంగా మారుతున్న కల్తీని నిరోధించేందుకు పాలకపెద్దలు చేస్తున్న ప్రయత్నాలుఏమాత్రం ఫలించడం లేదు. దేశంలో రానురాను కల్తీ పెరిగిపోతున్నది. తాగేనీటిలో కల్తీ, పప్పులో కల్తీ, ప్రాణాపాయం నుండి కాపాడే మందుల్లో కల్తీ చివరకు పౌష్టికాహారంగా వయసుతో ప్రమేయం లేకుండా పసిపిల్లల నుండి వృద్ధులవరకు సేవించే పాలల్లో కల్తీ, అదీ ఇది అని తేడా లేకుండా అంతా కల్తీమయంగా మారిపోతున్నది. మనిషి మనుగడనే ప్రశ్నార్థకం చేసే సూచనలు కన్పిస్తున్నాయి. ఈ కల్తీ ప్రభావం సామాన్య జనంతోపాటు ముఖ్యంగా ప్రభుత్వ వసతి గృహాలపై తీవ్రంగా చూపుతున్నది. ఇటీవల కలుషిత ఆహారం తినిప్రభుత్వ వసతి గృహాల్లోఉన్న ఎంతో మంది విద్యార్థినీవిద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. ఇంత ప్రమాదకరంగా మారుతున్నా, పొగ మంచులా అంతటా విస్తరించినా అడిగేవారు, అడ్డగించేవారు కరవైపోతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అవినీతికి, కల్తీకి అవినాభావ సంబంధం ఉంది. పెరుగుతున్న అవినీతికి రెట్టింపు స్థాయిలో కల్తీ విస్తరిస్తున్నది. దీనిని అరికట్టేందుకు ఎన్నో చట్టాలున్నాయి. ఆ చట్టాలు అమలు చేసి కల్తీ జరగకుండా నిరోధించేందుకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు ఉన్నారు. కోట్లాది రూపాయల జీతభత్యాల రూపేణా తీసుకుంటున్నారు. కానీ కల్తీని ఏ మాత్రం నియంత్రించలేకపోతున్నారు. ఈ కల్తీ భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా మానవజీవనానికి సవాలుగా మారుతున్నా మనదేశంలో అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నదనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇది మూడోకంటికి తెలియకుండా జరగడం లేదు. బహిరంగ రహస్యమే. అన్నింటికంటే ముఖ్యంగా ఆహార కల్తీ పెరిగిపోతున్నది. కొందరు దళారులు, వ్యాపారులు లాభాల కోసం పప్పుదినుసుల్లో, మసాలాలు వంటి నిత్యావసర సరుకుల్లో కల్తీ చేస్తున్నారు. అనేక హోటళ్లలో కల్తీ ఇష్టారాజ్యాంగా సాగిపోతున్నది. కల్తీ అడ్డుకట్ట ప్రమాణాల చట్టం 2006లో తీసుకువచ్చినా పట్టించుకునేవారే లేరు. ఇది ఎన్నో ప్రమాదాలను హెచ్చరిస్తున్నది. ఇక భారత ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ ఎఫ్ఎస్ఎస్ఐ అమలు గూర్చి దాదాపు మరిచిపోయారనే చెప్పొచ్చు. మార్కెట్లో విక్రయించే ఆహార పదార్థాల తయారీకి ఎఫ్ఎస్ఎస్ఐ అనుమతి తప్పనిసరి. కానీ వ్యాపార సంస్థలేవీ అనుమతులు తీసుకోవడం లేదు. ఈ చట్టాన్నే కాదు కల్తీని నిరోధించేందుకు ఉద్దేశించిన అనేక చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. 1947 నాటి వంటనూనెల నియంత్రణ చట్టం, 1955 నిత్యావసర సరుకుల్లో కల్తీ నియంత్రణ చట్టం, 1992 పాల ఉత్పత్తుల్లో కల్తీ నియంత్రణ చట్టం, అన్నిటికంటే ముఖ్యంగా 1954 నాటి ఆహార కల్తీ నిరోధక చట్టాన్ని పూర్తిగా మరిచిపోయారని చెప్పొచ్చు. ఇక్కడా, అక్కడా అనికాదు. దేశవ్యాప్తంగా కల్తీ విజృంభించిపోతున్నది. కోట్లాది మంది ఈ కల్తీ కారణంగానే రకరకాల రుగ్మతులకు గురవుతున్నారు. కల్తీకాటుకు యేటా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది రకరకాలవ్యాధుల బారిన పడుతుంటే లక్షల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. అన్నిటికంటే బాధాకరంగా మరణిస్తున్న వారిలో ముప్పైశాతానికి మించి ఐదేళ్లలోపు వయసున్న బాలబాలికలే. ఇక పాలల్లో కల్తీ అదుపు తప్పిపోతున్నది. డిమాండ్‌కు తగినట్లు ఉత్పత్తి లేకపోవడంతో ఆ వ్యత్యాసాన్ని పూడ్చేందుకు రకరకాల మార్గాల్లో కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు. చక్కెర, ఉప్పు, గంజిపొడి, బియ్యం పిండి, యూరియా, గ్లూకోస్, హైడ్రోజన్ పెరాక్సైడ్, కాస్టిక్ సోడా, వంట సోడా, డిటర్జెంట్, మైలమాన్‌పొడి, నూనె, తదితర పదార్థాలతో కల్తీపాలను తయారు చేస్తున్నారు. ఈ కల్తీపాలను తాగితే అజీర్తి సమస్యలతో ప్రారంభమై కడుపు నొప్పితోపాటు మూత్రపిండాలు, కాలేయం, నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రసాయనికాలతో కూడిన పాలను తీసుకుంటే క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకే ప్రమాదంఉందని కూడా వైద్యులు చెబుతున్నారు. ఇక పాలల్లో చిక్కదనం కోసం మైలమన్ రసాయనిక పొడిని కలుపుతున్నారు. ఇక క్రిమిసంహారక మందులను పిచికారి చేసిన మేతను పశువులకు వేయడంతో దుష్ప్రభావాలకు కారణాలవుతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకినప్పుడు పాలు పితకకూడదు. కానీ అవేమీ పాటించడం లేదు. ఇలాంటి ఎన్నో కారణాలతో పాలు కల్తీ అయిపోతున్నాయి. ఈ పాలద్వారా తయారు చేసే రకరకాల తీపి పదార్థాలు కూడా కలుషితమైపోతున్నాయి. భారతదేశానికి సంబంధించి ఎన్నో సందర్భాల్లో దేశసర్వోన్నత న్యాయస్థానం కల్పించుకున్న పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. దేశప్రజలకు విక్రయించే పాలల్లో అరవై శాతంపైగా కల్తీయేనన్న వాస్తవాన్ని సాక్షాత్తు జాతీయ ఆహార భద్రత ప్రమాణాల మండలి ఏనాడోవెల్లడించింది. అప్పట్లో దేశంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీ నిర్వహిస్తే అధిక శాతం కల్తీ బయటపడింది. ఇలాంటి సందర్భాల్లో సర్వోన్నత న్యాయస్థానం కల్పించుకొని ఇంతపెద్ద సమస్య పైపాలకులు ఏం చేస్తున్నారో చెప్పండంటూ నిలదీసి అడిగింది. ఈ దురాగాతాలను నివారించడంలో విఫలమవుతున్న అధికార గణంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ప్రశ్నించిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా పాలకులు కల్తీ విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త చట్టాల సంగతి దేవుడెరుగు. ఉన్నచట్టాలను త్రికరణ శుద్ధిగా అమలు చేసేందుకు ప్రయత్నంచేయాలి. ముఖ్యంగా కల్తీని నిరోధించేందుకు కృషిచేయాల్సిన కొందరు అధికారులు కాపలాదారులుగా వ్యవహరించడం దురదృష్టకరం.

చాలా మంది లోభులవడం వల్ల ఎందరో ఆకలితో అలమటిస్తున్నారు. ఇతరులతో పంచుకోవడం ఎలాగో తెలుసుకుంటే సమస్య ఉండదు.



ఐ.జాన్సన్

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.



బెర్ట్రాండ్ రస్సెల్

# ప్రజావాక్కు



## భయపెడుతున్న రోడ్డు ప్రమాదాలు!

రాష్ట్రంలోరోడ్డు ప్రమాదాలసంఖ్యభయంగొలిపే స్థాయిలో పెరిగిపోతోంది. ఏవార్తాపత్రికలను తిరగేసినా భయంకరమైన రోడ్డుప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృత్యువాతకు గురైనఅభాగ్యుల ఫోటోలు ప్రతిరోజూ పత్రికలలో దర్శనమిస్తాయి. వాహనాలసంఖ్య విపరీతంగా పెరిగిపోయాయి. రోడ్లపరిస్థితి అధ్వానంగా తయారుకావడం, ట్రాఫిక్ నిబంధనలను కనీసంగాకూడా పాటించకపోవడం, మితిమీరిన వేగం, కాలంచెల్లిన వాహనాలు, పరిమితికి మించిన లోడ్ పరుగులు తీసే లారీలు, ట్యాంకర్లు రోడ్డు ప్రమాణాలకు నేపథ్యంగా నిలుస్తున్నాయన్నదివాస్తవం. దీనికితోడు ఇటీవల కాలంలో 'సెల్ రైడింగ్'విపరీతంగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. జనంతో కిక్కిరిసిన నగర రోడ్లు, వాహనాలు దార్లు తీరిన హైవేలలో అష్టకష్టాలు పడుతూ సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్‌చేయడం మంచిదికాదు.

- సింగు లక్ష్మీనారాయణ, చింతకుంట,కరీంనగర్ జిల్లా

## ట్రంప్‌కు బెదరని ఓటర్లు

అమెరికన్ ప్రజల మనోభీష్టం అధ్యక్షుడైన డోనాల్డ్ ట్రంప్ మీదఉన్న అయిష్టం ఏదో విధంగా వ్యక్తపరచడమే. అందుకే వచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నారు. న్యూయార్క్ సిటీమేయర్ ఎన్నికల్లో డెమొక్రాటిక్ అభ్యర్థి భారత్ మూలాలు కలిగిన 34 ఏళ్ల మజ్దాని కన్సర్వేటివ్ అభ్యర్థిని చిత్తుగా ఓడించడం, అలాగే 61 సంవత్సరాల డెమొక్రాటిక్ పార్టీకి చెందిన భారత సంతతి మహిళ గజాలా ఫిర్దౌస్ హష్మీ వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నరుగా, మరో భారతీయ అమెరికన్ అఫ్తాబ్ కర్మసింగ్ పురేవల్ సిన్సినాటి పట్టణ మేయర్‌గా ఎన్నికల దుంధుభి మోగించారు. ఈ విజయాలు ట్రంప్ పరిపాలన మీద రిఫరెండమ్‌గా భావించవచ్చు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## బకాయి నిధులను విడుదల చేయాలి

రాష్ట్రప్రభుత్వంసకాలంలో ఫీజురియంబర్మెంటు, ఉపకార వేతన నిధులను విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్ కళాశాలలయాజమాన్యం ఆర్థికఇబ్బందులతో కళాశాలలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్లవిద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందడం లేదు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం కాలేజీలను బంద్‌చేయడంతో విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు.

- బూర్గుపల్లి కృష్ణ యాదవ్, విద్యానగర్, హైదరాబాద్

## స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించాలి

తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో పెట్టుబడుల ఆకర్షణకు మరింత సమగ్ర ప్రయత్నం అవసరం. పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత తయారీకేంద్రాలు, ఔషధ ఉత్పత్తి, సమాచార సేవలు, పర్యాటకం వంటి అనేక రంగాలలో అపారమైన అవకాశాలు ఉన్నప్పటికీ, ఇవి పూర్తిస్థాయిలో వినియోగం కావడంలేదు. ఇతరరాష్ట్రాల్లో గుజరాత్ చేపట్టిన వైభవ గుజరాత్", మధ్యప్రదేశ్ నిర్వహిస్తున్న 'పెట్టుబడిదారుల మహాసభ' వంటి కార్యక్రమాలు రాష్ట్ర బ్రాండ్ ప్రతిష్టను పెంచి, దేశ విదేశీ పెట్టుబడులనుఆకర్షించాయి. ఇదేనమూనాలో తెలుగురాష్ట్రాలు కూడా విశాలస్థాయిపెట్టుబడిసభలను ప్రతీసంవత్సరం నిర్వహించాలి. ఇలాంటి సభలు కేవలం అధికారుల ప్రసంగాలు, ప్రదర్శనలు మాత్రమే కావు. పెట్టుబడి ఒప్పందాల్లో కేవలం పరిశ్రమ స్థాపనకే ప్రాధాన్యం ఇవ్వకుండా, స్థానిక ప్రజల సామర్థ్యాన్ని పెంచే విధంగా నిబంధనలు చేర్చాలి.

-డా॥ సి.హెచ్.ప్రతాఫ్, శ్రీకాకుళం

## పునర్జీవం పొందుతున్న ప్రజాకళ

ఆదిలాబాద్ జిల్లాలో ప్రజా కళారూపమైన జడ్కొప్పులాట మళ్లీ ప్రాణం పోసుకుంటుండడం సంతోషకరమైన పరిణామం. ఈ కళ కేవలం వినోదం మాత్రమేకాదు, గ్రామీణ జీవన విధానానికి అద్దం పట్టే ఒక విలువైన సాంస్కృతిక సంపద. పాత కాలంలో ఈ కళారూపం ద్వారా ప్రజలకు విద్య, సామాజిక సందేశాలు, నైతిక బోధనలు అందించేవారు. కానీ నేటి ఆధునిక కాలంలో యువతలో మొబైల్ ఫోన్లు, సినిమాలు, సోషల్ మీడియా వంటి ఆధునిక వినోదాల ప్రభావం పెరిగింది. దీని ఫలితంగా జడ్కొప్పులాటలాంటి సాంప్రదాయ కళలు క్రమంగా మరుగున పడుతున్నాయి. పాతకళాకారులు చెబుతున్నట్టుగా, కొత్త తరం ఈ కళల పట్ల ఆసక్తిచూపకపోవడం ఆందోళన కలిగించే విషయం.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## లెంకలగడ్డ లో ప్రకృతి విలయ తాండవం

ప్రకృతి బీభత్సానికి జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ఉమ్మడి మండలంలోని లెంకలగడ్డ గోదావరి అటవీ ప్రాంతంలో చెట్లు, మిర్చి, పత్తిపంటలకు భారీనష్టం వాటిల్లింది. మంగళవారం సాయంత్రం లంకలగడ్డ సమీపంలోని గోదావరి వద్ద ఒక్కసారిగా సుడిగాలి బీభత్సం సృష్టించింది. సుమారు 4గంటలపాటు గాలి రావడంతో అటవీ ప్రాంతంలో చెట్లు నేల కొరిగాయి. వందలఎకరాల్లోపత్తి, మిర్చిపంటలకునష్టంవాటిల్లింది.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆధ్యాత్మిక ముసుగులో నకి'లీలలు'

**పెద్దపెద్ద అధికారులు, రాజకీయనేతలే కాళ్లమీద పడి మొక్కుతుంటే మనమెంత అని సామాన్యులు కూడా క్యూలు కడుతున్నారు. వారికెక్కడలేని ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఏదిఏమైనా కుల,మత, వర్గ, వైషమ్యాలతో విచ్ఛిన్నకర విపరీత ఆలోచనా విధానాలు, కక్షలు, కార్పణ్యాలు, స్వార్థంతో అతలాకుతలమై అట్టుడికిపోతున్న మానవ హృదయ కుహరాల నుండి తమస్సును తరిమికొట్టి మనస్సును నింపి మనిషి మనిషిగా మనగలగడానికి మార్గోపదేశం చేసే అత్యంత పవిత్రమైన గౌరవప్రదమైన స్వామిజీల వ్యవస్థలోకి ఇలాంటి చీడపురుగులు ప్రవేశించడం అత్యంత విచారకరం, బాధాకరం. ఈ విషయంలో పాలకులు మనస్సు పెట్టాలి. మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత పోలీసులు రంగప్రవేశం చేసే కంటే ముందుగానే నిఘా ఏర్పాటు చేసి పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ఇలాగే కొనసాగితే మొత్తం ఈ వ్యవస్థ మీదనే నమ్మకాలు సన్నగిల్లుతాయి.**

దామెర్ల సాయిబాబ

సర్వమానవులు నిత్యం జీవన పోరాటంలో ఏదో విధమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటుంటారు. ఎండకు ఎండని, వానకు తడవని మానవుడు ఎలా ఉండడో కోరిక లేని మనిషి లేడనే చెప్పొచ్చు. కోరికలు పెరిగే కొద్దీ మనశ్శాంతి కరవుకాక తప్పదు. వారివారి స్థాయిని బట్టి, అవసరాలను బట్టి, ఈ కోరికలు పెరుగుతుంటాయి. అందుకే అంటారు 'ధనము కలిగిన వానికి ధనము దాచుట రంధి (వ్యధ)ధనము లేకున్ననూ పొట్టరంధి, సంతుకలిగిన వానికి సాదలేకనూ రంధి, సంతులేకున్న చాలా రంధి... అలా రకరకాల సమస్యలతో కోరికలతో మనశ్శాంతి కరవైన పరిస్థితుల్లో ఆధ్యాత్మికం, భక్తి, ముఖ్యంగా స్వామిజీ ఉపన్యాసాలు, ప్రవచనాలతో తమ తమ సమస్యలకు పరిష్కారం దొరికి కొంతైనా ప్రశాంతత లభిస్తుందనే ఆశతో స్వామిజీలను, బాబాలను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ సంస్కృతి రానురాను పెరిగిపోతున్నది. అయితే భారతీయ ఆధ్యాత్మిక వాహినిలో స్వామిజీలు, గురువుల పాత్ర మహోన్నతమైనది. 'నిధి చాలా సుఖమా! రాముని సన్నిధి చాలా సుఖమా అంటూ ప్రశ్నించి రాముడి పదసన్నిధి వైభవాన్ని కీర్తనలుగా పాడి తాను తరించి కోట్లాది ఆధ్యాత్మిక హృదయాల్లో త్యాగయ్య చిరంజీవిగా నిలిచారు. అలాగే వేలాది కీర్తనలతో తిరుమలేశుని సేవలో అన్నమయ్య తరించారు. ఏ భక్తుడి చరిత్రచూసినా మనలను తరింప చేసేందుకు జన్మించిన మానవ మూర్తులుగా వారు సాక్షాత్కరిస్తారు. ఇలాంటి తులసీవనంలో గంజాయి మొక్కలు కూడా మొలకెత్తడం మన గ్రహచారం, దురదృష్టకరం. స్వామిజీలను ఆశ్రయించి తమ సమస్యల పరిష్కారం కొరకు అన్వేషించే అమాయకులను లక్ష్యంగా చేసుకొని కొందరు స్వార్థపరులు స్వామిజీల అవతారం ఎత్తి ప్రజలను మోసం చేయడమేకాక చేయరాని, చేయకూడని పనులు చేస్తున్నారు. అందరు స్వామిజీలు, బాబాలు అలా చేస్తున్నారని చెప్పడం లేదు. త్రికరణశుద్ధిగా దైవాన్ని నమ్ముతూ, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే స్వామిజీ లు ఎందరో ఉన్నారు. కానీ ఈ నకిలీ ఆధ్యాత్మిక గురువుల సంఖ్య రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే విషయం. ఇది కూడా ఒక వ్యాపారంగా మారిపోయింది. పెద్దగా పెట్టు బడి లేకుండా కుబేరులుగా మారడానికి ఇవి దగ్గర దారిగా ఎంచుకుంటున్నారు. దీనికి కావల్సిందల్లా ప్రజానమ్మకం, విశ్వాసం, బలహీనతలే. అవే పెట్టుబడులు. ప్రజల బలహీ నతలను, నాడిని పట్టుకొని విశ్వాసం కలిగిం చగలిగితే కనక వర్షం కురిసినట్లే. దీనికి కనీస అర్హతలంటూ ఏమీలేవు. వయసుతో నిమిత్తం లేదు. రాత్రికి రాత్రేకాషాయ వస్త్రాలు ధరించి, తెల్లవారే సరికి స్వామిజీలుగా, బాబాలు గా అవతారం ఎత్తవచ్చు. చిన్న పరిశ్రమ పెట్టాలన్నా, మరే చిన్నదుకాణం ఏర్పాటు చేసుకోవాలనుకున్నా ఎన్నో లైసెన్సులు, అనుమతులు, మరెందరో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. దీనికి అలాంటి ఇబ్బందులు లేవు. అనుమతులు కానీ, లైసెన్సులు కానీ అవసరంలేదు. నాయకులనో, అధికారులనో తమ దారికి మళ్లించుకోగలిగితే ప్రభుత్వపరంగా రాయితీలపై భూములు పొందవచ్చు. అందుకే దేశవ్యాప్తంగాఎక్కడపడితే అక్కడ బాబాలు,స్వామి జీలు వెలుస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే కనీసం తమ పేరును కూడా రాసుకోలేనివారు కాషాయ వేషధారణతో ఏవోచెప్పి ప్రజలను నమ్మిస్తున్నారు. దక్షిణతాంబూలాలతో పాటు పాదపూజలు చేయించుకుంటున్నారు. అలాంటి వారు కొందరు చేసే వికృతచేష్టలు అమాయక గ్రామీణుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. తమ మంత్రాలతో రోగాలను నయం చేస్తామంటూ కిందపడేసి తొక్కడం, వాతలు పెట్టడం, ఇష్టాను సారంగా కొట్టడం, ఒక్కటేమిటి వారికి తోచిన ఆటవిక చర్యలన్నీ చేస్తున్నారు. ఇదంతా చిన్న,ఛోటా స్వాముల లీలలు. ఏదైనా సంఘటన జరిగి ఫిర్యాదు అందితే పోలీసులు రంగప్రవేశం చేసి కేసులు పెట్టి అరెస్టు చేయడం, ఆ తర్వాత మరిచిపోవడం సాధారణమైపోయింది. కొందరు స్వామిజీలు ఆ ప్రాంతాన్ని వదిలి మరో ప్రాంతానికి వెళ్లి కొత్త పేరుతో నూతన అవతారం ఎత్తి వ్యాపారాన్ని సాగించుకుంటున్నారు. ఇక బడాస్వాముల సంగతే వేరు. వారి కార్యకలాపాలు, సంపాదన, కూడబెట్టిన కోట్ల రూపాయల ఆస్తులు చూస్తుంటే ఆశ్చర్యం కలగక తప్పదు. వారు సల్పుతున్న రాసలీలు, అమ్మాయిల ఎగుమతులు, గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాల వ్యాపారంతదితరాలు బయటపడుతుంటే 'ఛీ'వీరా మనస్వాములు? వీరికా ఇంతకాలం మనం పూజలు చేసిం ది అంటూ వారి భక్తులే చీదరించుకుంటున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఎందరో స్వామిజీలు కేసులను ఎదుర్కొంటున్నారు. మరికొందరు జైళ్లల్లో కాలం గడుపుతున్నారు. మొన్న సెప్టెంబరులో పేరుమోసి తనకు తానుగా దైవస్వరూపంగా ప్రకటించుకుంటున్న స్వామిజీని ఆగ్రాలో పోలీసులు అరెస్టు చేశారు. తన ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలో ఉన్న మహిళా విద్యార్థులను లైంగిక వేధిం పులకు గురిచేశారనే ఆరోపణపై ఈ అరెస్టులు జరిగాయి. రాజస్థాన్‌లో మరొక ప్రముఖ గురువు న్యాయవిభాగం విద్యార్థినిని మానభంగం చేశారనే కేసులో అరెస్టు అయ్యా రు. మరొకస్వామిజీ చేసిన నేరాలకు జీవితఖైదు శిక్షను అనుభవిస్తూ జైలులోనే మరణించారు. ఇలా చెప్పుకుంటూ పోతే దైవభక్తి ముసుగులో ఎందరో ఇలాంటి అరాచకాలు, అత్యాచారాలు చేసినట్లు తెలుస్తుంది. అంతకుముందు కూడా ఎందరో స్వామిజీలు ఇలాంటి కార్యక్రమాలు చేసి జైళ్లకు వెళ్లిన సందర్భాలున్నాయి. దేశరాజధాని ఢిల్లీలో పేరొందిన ఒక స్వామిజీని ఆరుగురు యువతులతో రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకున్నారు. ఈ ముసుగులో ఆయన దాదాపు రెండువందల మంది అందమైన యువతులను విలాసవంత మైన హోటళ్లకు సరఫరా చేసేవారని పోలీసుల దర్యాప్తులో వెల్లడయింది. ఆయన చరిత్రను ఒకసారి పరిశీలిస్తే స్వామిజీ వేషంలో ఎంత సులభంగా మోసంచేసి కోట్లాది రూపాయలు ఆర్జించవచ్చో ఆచరణలో చేసి చూపించారు. ఉత్తరప్రదేశ్ లోని ఒక కుగ్రామం నుంచి కట్టుబట్టలతో ఢిల్లీకి వచ్చిచాలా సంవత్సరాలపాటు ఒక హోటల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేశారు. ఆ తర్వాత కొంతకాలం మసాజ్ సెంటర్‌లో పనిచేసి అవేమీ అంత లాభదాయకంగా లేకపోవడంతో స్వామిజీ అవతారం ఎత్తారు. అంతే ఆయన స్టార్ తిరిగిపోయింది. పదేళ్లు తిరగకుండానే వందల కోట్లకు అధిపతి అయ్యాడు. ఒకటి, రెండుసార్లు పట్టుబడినా తన పలుకుబడిని, డబ్బును ఉపయోగించి బయటపడ్డాడు. ఇక తమిళనాడులో ఒక స్వామిజీ పదమూడు మానభంగాలు, ఒక హత్యనేరం కింద జైలుపాలయ్యారు. తెలుగురాష్ట్రాలకు సంబంధించి మరొక స్వామిజీ నకిలీ నోట్లు, నీలిచిత్రాలతో పట్టుబడ్డాడు. ఇలా చెప్పుకుంటూపోతే ఎందరినో ఉదహరించ వచ్చు. ఇవన్నీ పోలీసుల దృష్టికి వచ్చిన నకిలీ స్వాముల లీలలు. మూడోకంటికి తెలియకుండా, తెలిసినా బయటపడ కుండా నిరాటంకంగా సాగుతున్న ఈనకిలీ స్వామిజీల అరా చకాలు మరెన్నో ఉండొచ్చు. ఇక అన్నింటికంటే ముఖ్యంగా దురదృష్టకరమైన విషయం ఏమిటంటే కొందరు నాయకులు అధికారులు ముఖ్యంగా పోలీసు అధికారులు ఇలాంటివారికి భక్తులుగా మారి ప్రదక్షిణలు, పాదపూజలు చేయడంతో సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. నమ్మకం, విశ్వా సం, శ్రద్ధాశక్తులు అనేది పూర్తిగా వారి వారి వ్యక్తిగతం. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. వారికి ఎలాంటి ఉద్దేశ్యాలు ఉండక పోవచ్చు. కానీ వారి రాకను, వారికి చేసే పూజా కార్యక్రమాలను ముందుగానే మీడియాకు తెలిపి విస్తృతప్రచారం చేసుకుంటున్నారు. కొన్ని ఆశ్రమాల్లో దేవుని ఫోటోల కంటే ఈ అధికారులు, మరికొందరు నాయకులు వారికి చేసేపాదపూజ కార్యక్రమాల ఫోటోలతో ఆశ్రమమంతానింపేస్తున్నారు. సామాన్యుల్లో విశ్వాసం పెంచేందుకు వీటిని ఎంతగానో ఉపయోగించుకుంటున్నారు. పెద్దపెద్ద అధికారులు, రాజకీయ నేతలే కాళ్లమీద పడి మొక్కుతుంటే మనమెంత అని సామాన్యులు కూడా క్యూలు కడుతున్నారు. వారికెక్కడలేని ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. సమాజంపై తీవ్రప్రభావం చూపుతున్నది. ఏదిఏమైనా కుల,మత, వర్గ, వైషమ్యాలతో విచ్ఛిన్నకర విపరీత ఆలోచనా విధానాలు, కక్షలు, కార్పణ్యాలు, స్వార్థంతో అతలాకుతలమై అట్టు డికిపోతున్న మానవ హృదయ కుహరాలనుండి తమస్సును తరిమికొట్టి మనస్సును నింపి మనిషి మనిషిగా మనగలగడానికి మార్గో పదేశం చేసే అత్యంత పవిత్రమైన గౌరవప్రదమైన స్వామిజీలవ్యవస్థలోకి ఇలాంటి చీడపురుగులు ప్రవేశించడం అత్యంత విచారకరం, బాధాకరం. ఈ విషయంలో పాలకులు మనస్సు పెట్టాలి. మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత పోలీసులు రంగప్రవేశం చేసేకంటే ముందుగానే నిఘాఏర్పాటు చేసి పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ఇలాగే కొనసాగితే మొత్తం ఈ వ్యవస్థ మీదనే నమ్మకాలు సన్నగిల్లుతాయి. ●

ఒక్క మాట

# భావితరాల సంపూర్ణ వికాసానికి ఉద్యాన వన సేవ!

మెరుగు భాస్కరయ్య

ఈ పంచ అభివృద్ధి ప్రక్రియలో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, యాంత్రీకరణ, పల్లెల నుంచి పట్టణాలకు వలసల ఫలితంగా వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, కరవు పరిస్థితులు, అకాల వర్షాల వల్ల వ్యవసాయం కుంటుపడుతోంది. గ్రామాల్లో వ్యవసాయం చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. వీటికి తోడు నేటి యువతలో పర్యావరణం, ఆహారం, ఆరోగ్యం పట్ల అవగాహనలోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితి నుంచి భావితరాలను కాపాడటానికి పాఠశాల స్థాయి నుంచే పిల్లలను సన్నద్ధం చేయాలి. పర్యావరణం, ఆహారం, ఆరోగ్యానికిగల సంబంధాన్ని పిల్లలకు అర్థమయ్యేలా నేర్పించాలి. పాఠశాలల్లో తోటల పెంపకాన్ని పాఠ్యాంశంగా చేర్చడంవల్ల ఈ బృహత్తరకార్యాన్ని నెరవేర్చవచ్చు. ఈ కార్యక్రమాన్ని నేడు అన్ని ఉన్నతపాఠశాలల్లో అమలు చేయాల్సిన అవసరం ఉంది. విద్యార్థులను క్లాసుల వారీగా లేదా బృందాల వారీగా విభజించాలి. తరగతి గదులకు దూరంగా ఒక చోట గుంతను తీసి పాఠశాల ఆవరణను శుభ్రపరచగా వచ్చిన చెత్త, వ్యర్థ పదార్థాలను పోగుచేసి ఈ గుంతల్లో వేసి కంపోస్టు ఎరువు తయారు చేయాలి. ఈ విధానాన్ని విద్యార్థులకు కూడా వివరించాలి. పాఠశాల ఆవరణలో నీటి ఆధారం ఉన్నచోట నర్సరీని ఏర్పాటు చేయాలి. నర్సరీలో పెంచిన మొక్కలను పాఠశాల ఆవరణలో విద్యార్థులతో నాటించాలి. వీటిలో నీడనిచ్చే చెట్లు, అలంకరణ చెట్లు, కూరగాయ లు, పండ్లు, పూల చెట్లు మొదలైనవి ఉండేలా చూడాలి. వాటి ఉపయోగాలను విద్యార్థులకు



తెలియజెప్పాలి. ఈ మొక్కలకు కంపోస్టు గుంతలో తయారు చేసిన ఎరువును వేయాలి. పాఠశాల ఆవరణలో పెంచుతున్న చెట్లకుఅవసరం మేరకు నీరు పెట్టాలి. చెట్లు పెరిగే వివిధ దశల గురించి కూడా విద్యార్థులకు తెలియజెప్పాలి. మొక్కల పెంపకంలో వివిధ దశలైన నేలతయారీ, విత్తనం, ప్రవర్ధనం, నారు పెంపకం, పూత, కోత మొదలైనవి విద్యార్థులకు వివరించి చెప్పాలి. పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ, ఆహారం, ఆరోగ్యంలో మొక్కల పాత్రను విద్యార్థులకు వివరించాలి. విద్యార్థులకు తోటపని చేయడం ద్వారా పనిపైగౌరవం (డిగ్నిటీ ఆఫ్ లేబర్) అలవడుతుంది. పరస్పర సహకారంతో సంఘటితంగా పనిచేయడం విద్యార్థులకు అలవాటవుతుం ది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి దేనినైనా చేయగలమనే సామర్థ్యం సమకూరుతుంది. సహనం నిశిత పరిశీలన అల వాటవుతుంది. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధంపై అవగా హన పెరుగుతుంది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివార ణపై అధ్యయనానికి వీలు కలుగుతుంది. జీవశాస్త్రంలో వివిధ అంశాలను నేరుగా పరిశీలించేందుకు సహజ ప్రయోగశాలలుగా తోటలు ఉపయోగపడతాయి. ఆరోగ్యం, సంతులిత ఆహా రం పట్ల అవగాహన పెరుగుతుంది. విద్యార్థుల్లో మొక్కల పెంపకం, పంటల సాగుపై ఆసక్తి పెరుగుతుంది. పాఠశాల ఆవరణలు పరిశుభ్రంగా ఉండి విద్యాభివృద్ధికి దోహదపడుతుంది. విద్యార్థుల సంపూర్ణ వికాసానికి ఉపయోగకరంగాఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలలన్నింటిలోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టి, అమలుకు అవసరమైన సాంకేతిక సూచనల కోసం మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన, అటవీ శాఖ అధికారుల సహాయసహకారాలు పొందవచ్చు. ●

# తిరుమల దర్శనాల్లో ఆన్‌లైన్ ఆధిపత్యం

అప్పన్న గొనప

తిరుమలలో సాధారణ భక్తుల కష్టాలు పెరుగుతున్నాయి. కరోనా మహమ్మారి అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనేక మార్పులు తీసుకువచ్చింది. భక్తుల సౌకర్యం కోసం అని చెప్పుకుంటూ, దాదాపు అన్ని దర్శన టిక్కెట్లు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అందుబాటులో ఉంచారు. కానీ ఈ నిర్ణయం అనుకోకుండా వేలాది మంది సాధారణ భక్తులకు ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. ముఖ్యంగా వయోవృద్ధులు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, ఆన్‌లైన్ వేదికలను సరిగ్గా వినియోగించలేని వారు ఇప్పుడు పూర్తిగా దర్శన అవకాశాల నుండి దూరమవుతున్నారు. టీటీడీ వెబ్‌సైట్‌లో సర్వర్ సమస్యలు, టిక్కెట్ స్లాట్లు క్షణాల్లో ఖాళీకావడం, మోసపూరిత వెబ్‌సైట్లు పెరుగుతుండడం వంటి అంశాలు ప్రజలలో తీవ్ర ఆవేదన కలిగిస్తున్నాయి. తిరుమలలో ఇప్పటికీ సీనియర్ సిటిజన్లకు, దివ్యాంగులకు ఆఫ్‌లైన్ దర్శనం ప్రారంభం కాలేదు. గతంలో ఈ రెండు వర్గాలకు ప్రత్యేకంగా కౌంటర్లు ఉండేవి. భక్తులు తాము నిర్దేశిత సమయానికి వచ్చి స్వామివారి దర్శనం చేసుకునే సౌలభ్యం ఉండేది. కానీ ప్రస్తుతం ఆ అవకాశమూ లేదు. జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేసిన టీటీడీ ఈ దర్శన్ కౌంటర్లు కూడా నెలలుగా మూతపడ్డాయి. ఇది గ్రామీణ ప్రజలకు పెద్ద దెబ్బగా మారింది. ఎందుకంటే వారు ఆన్‌లైన్ రిజర్వేషన్లకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేని పరిస్థితుల్లో తమకు దర్శన టిక్కెట్ పొందడం అసాధ్యమవుతోంది. ఈ దర్శన్ కేంద్రాలు తిరిగి ప్రారంభిస్తే ఈ వర్గాల భక్తులకు కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంది. కానీ ఇప్పటి వరకు వాటిని పునఃప్రారంభించాలన్న ఎటువంటి చర్యలూ కనిపించడం లేదు. టీటీడీ అధికారుల వాదన ప్రకారం ఆన్‌లైన్ విధానం పారదర్శకత కోసం అని చెబుతున్నారు. కానీ వాస్తవంలో, దాని వల్ల సామాన్య ప్రజల చేరికకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రతి నెల టిక్కెట్ కోటాలు విడుదలవగానే, కొద్దిసేపులోనే అన్ని స్లాట్లు పూర్తవుతున్నాయి. ఫలితంగా సాధారణ భక్తుడు స్వామివారి దర్శనం కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ఇంటర్నెట్ వసతులు సరైన రీతిలో లేని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఈ విధానం పెద్ద భారమవుతోంది. తిరుమల శ్రీవారి సేవ అంటే భక్తి, అనుభూతి, సమర్పణ. కానీ ఇప్పుడు అది ఒక డిజిటల్ పోటీగా మారింది. ప్రతిరోజు



లక్షలాది మంది భక్తులు తిరుమల వెళ్లాలని ఆశపడుతున్నారు. కానీ టిక్కెట్ లేకపోవడం వల్ల చాలా మంది భక్తులు తిరుపతిలోనే ఆగిపోవలసి వస్తోంది. కొందరు ఆలయంలో ఉన్న లడ్డూ ప్రసాదం తీసుకుని తిరిగి వెళ్లిపోతున్నారు. భక్తుల భావాలను, వారి ఆకాంక్షలను గౌరవించడం దేవస్థానం ప్రధాన బాధ్యత. కానీ ఇప్పుడు అది కేవలం సాంకేతిక వ్యవస్థల ఆధారంగా నడుస్తోంది. సీనియర్ సిటిజన్ల విషయానికి వస్తే, వీరికి నడకలో, క్యూలైన్‌లో నిలబడటంలో ఇబ్బందులు ఉంటాయి. గతంలో ప్రత్యేక దర్శన సమయాలు ఇవ్వడం వలన వారు సౌకర్యంగా దర్శనం చేసుకునే వారు. ఇప్పుడు వారిని కూడా ఆన్‌లైన్ పోటీకి దిగమంటున్నారు. ఇది మానవతా విలువలకు విరుద్ధంగా ఉంది. దివ్యాంగులకు కూడా ఇదే పరిస్థితి. వారు ప్రత్యేక ప్రవేశ ద్వారం ద్వారా వెళ్లే అవకాశం లేకపోవడంతో తిరుమల యాత్రకు వెళ్ళడమే ఒక సవాల్‌గా మారింది. ఈ పరిస్థితులు టీటీడీ ప్రతిష్ఠకు అనుకూలం కావు. ఆలయ వ్యవస్థ అంటే కేవలం ఆర్థిక నిర్వహణకాదు, భక్తుల భావోద్వేగాలను కూడా గౌరవించడం అవసరం. గతంలో ఆఫ్‌లైన్ విధానంలో కూడా పారదర్శకతతో వ్యవహరించిన అనేక సందర్భాలు ఉన్నాయి. భక్తులు రాత్రి క్యూలైన్లలో నిలబడి అయినా స్వామిని దర్శించేవారు, అది వారికి భక్తి పరాకాష్టగా అనిపించేది. ప్రస్తుతం డిజిటల్ ఆధారిత టిక్కెట్ విధానం వల్ల మధ్య తరగతి, పేద ప్రజలు వెనుకబడుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందే వారు ప్రధానంగా నగరాల వారే. గ్రామాల్లోని వృద్ధులు, రైతులు, రోజువారీ కూలీలు ఈ వ్యవస్థలో స్థానం లేకుండా పోతున్నారు. ప్రభుత్వాల, దేవస్థానాల ప్రాధాన్యత భక్తులకు సమాన అవకాశాలు కల్పించడంలో ఉండాలి కానీ సాంకేతిక పరిమితులు పెంచడంలో కాదు. టీటీడీ ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోవాలి. తిరిగి జిల్లా కేంద్రాలలో ఈదర్శన్ కౌంటర్లను ప్రారంభించడం అత్యవసరం. అలాగే సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంతాల భక్తుల కోసం ప్రత్యేకంగా ఆఫ్‌లైన్ కోటాలను కేటాయించాలి. భక్తుల ప్రవాహం పెరిగిందని చెప్పి అందరికీ ఒకే విధమైన డిజిటల్ విధానాన్ని రుద్దడం న్యాయబద్ధం కాదు. భక్తి అంటే నమ్మకం. ఆ నమ్మకం సాంకేతిక సౌకర్యాలతో కాదు, అనుభూతితో పెంపొందుతుంది. తిరుమల శ్రీవారి దర్శనం ప్రతి ఒక్కరికీ సమానంగా లభించాలనే దైవ ధర్మాన్ని టీటీడీ గుర్తుంచుకోవాలి. ఈ భూమ్మీద ఎంత ఆధునికత వచ్చినా, భక్తుడి కన్నీరు, మనసులోని వినయమే దైవానికి దగ్గర చేస్తాయి. ఆ భక్తిని కంప్యూటర్ స్క్రీన్ ముందు నిలబెట్టకూడదు. అందువల్ల తిరుమలలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, గ్రామీణ ప్రజల కోసం ఆఫ్‌లైన్ దర్శనాలను తిరిగి ప్రారంభించాలి. ఈదర్శన్ కేంద్రాలను పునఃప్రారంభించి ప్రతి జిల్లాలో టిక్కెట్లు సులభంగా అందుబాటులో ఉంచాలి. టీటీడీకి భక్తుల నమ్మకం అంటే దైవం ఇచ్చిన విశ్వాసం. ఆ విశ్వాసం కాపాడటం వారి ప్రధాన కర్తవ్యం కావాలి. ●

Main tab page 111_Main tab page 111.qxd 11/7/2025 10:14 PM Page 1



ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## జిల్లా సమగ్రాభివృద్ధికి సహకరించాలి

- జిల్లా ఇంచార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**ఒంగోలు, ప్రభాతవార్త**



జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమగ్రమైన ప్రణాళికలతో పనిచేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా సమీక్ష మండలి సమావేశం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్., పబ్లిక్ హెల్త్, మున్సిపల్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, వ్యవసాయ, ఉద్యాన శాఖ, మైక్రో ఇరిగేషన్, పశు సంవర్ధక శాఖ, మార్కెటింగ్, అటవీ శాఖ, జాతీయ రహదారులు తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించి ఆయా కార్యక్రమాల అమలులో నెలకొని వున్న సమస్యల పరిష్కారానికి ఇంచార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, అధికారులకు దిశానిర్దేశం చేసారు. ఈ సమావేశానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం, ఎస్.ఎన్. పాడు, శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు, కందుల నారాయణ రెడ్డి, డా. ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, టి. చంద్రశేఖర్, బి.ఎన్ విజయ కుమార్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఎపి మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డా నూకసాని బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై కూలంకషంగా చర్చించడంతో పాటు ఆ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రధానంగా జిల్లాలో త్రాగునీటి సమస్య ఎలా ఉంది, తుఫాన్ కారణంగా అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఏర్పడటం గాని, మంచినీటి సరఫరా పథకాల్లో ఇబ్బందులు కలగడం, హ్యాండ్ బోర్లు మరమ్మత్తులకు గురికావడం వంటి సమస్యలపై ముఖ్యమంత్రి సూచనలు, ఆదేశాలతో వీటన్నిటినీ పరిష్కరించే దిశగా జిల్లా



కలెక్టర్ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రధానంగా తుఫాన్ కారణంగా ఈ జిల్లాలో అనేకమైన జాతీయ రహదారులు దెబ్బతినడం జరిగిందన్నారు. వీటి పై సంబంధిత అధికారులతో పూర్తి స్థాయిలో సమీక్షించడం జరిగిందన్నారు. వాటిని త్వరగా పునరుద్ధరణ చేసేలా అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ జిల్లాను అన్నీ రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలను, సమస్యలను పరిష్కారించే దిశగా కృషి చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలను పరిగణలోకి తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రత కు చేపడుతున్న చర్యలు వివరిస్తూ, జిల్లాలో గంజాను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలను తెలపడం జరిగింది. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. జల జీవన్ మిషన్ కింద జిల్లా కు 2140 కోట్లు నిధులు మంజూరు కావడం జరిగిందని, సంబంధిత పనులు చేపట్టి త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపి నిధులతో చేపట్టిన ఆర్వో ప్లాంట్స్ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎపి మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ టంగుటూరు పోలీసు స్టేషన్ భవనం శిధిలావస్థలో వుందని, అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సింగరాయకొండ పోలీసు స్టేషన్ నీట మునగం జరిగిందని, ఈ రెండు పోలీసు స్టేషన్లకు నూతన భవనాలు మంజూరు చేయాలని ఇంచార్జి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. లంకా దినకర్ మాట్లాడుతూ జిల్లాకు జల్ జీవన్ మిషన్ కింద నిధులు ,మంజూరు కావడం జరిగిందని, ఆ నిధుల్లో ఎంత నిధులు ఖర్చు చేసారు, ఎన్ని పనులు పూర్తి చేసారని కోరడం జరిగింది. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ ఒంగోలు నగర ప్రజలకు సురక్షిత త్రాగు నీటి సరఫరాతో పాటు అమృత్ పథకం 2.0 కింద చేపట్టిన పనులు



సత్వరం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. 2014-19లో గుండ్లకమ్మ నుండి త్రాగునీటి కొరకు పైప్ లైను పనులు చేపట్టడం జరిగిందని, అందులో 85 శాతం పనులు పూర్తి కావడం జరిగిందని, మిగిలిన 15 శాతం పనులు పూర్తి చేసేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. గిద్దలూరు శాసన సభ్యులు శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ 2014లో నియోజకవర్గంలో 3 గ్రామ పంచాయతీల్లో ప్రజల త్రాగునీటి అవసరాల నిమిత్తం త్రాగునీటిని రవాణ చేయడం జరిగిందని, వాటికి సంబందించిన బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల సంభవించిన తుఫాన్ కారణంగా రైతులు నష్టపోవడం జరిగిందని, వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. అలాగే రోడ్లు దెబ్బతినడం జరిగిందని, ముఖ్యంగా పొలాలకు వెళ్ళే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్.ఎస్.పాడు శాసన సభ్యులు బి.ఎన్. విజయకుమార్ మాట్లాడుతూ ఇటీవల తుఫాన్ కారణంగా గుండ్లకమ్మ ప్రాజెక్టు నుండి నీటిని వదలడంతో చాలా గ్రామాల్లో రోడ్లు, పంట పొలాలు నీట మునిగాయని, వ్యవసాయ రోడ్లు బాగా దెబ్బ తిన్నాయని, ఈ రోడ్లను పునరుద్ధరించాలని శాసన సభ్యులు, ఇంచార్జి మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. శాసన సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రూముల కేటాయింపుకు సంబంధిత ఆసుపత్రి వైద్యులు రోజుకు వేయి రూపాయలు తీసుకోవడం జరిగిందని ఇంచార్జి మంత్రి దృష్టి కి తీసుకురావడం జరిగింది. పాలుట్లకు వెళ్ళే రహదారి పూర్తిగా దెబ్బతిన్న దని, ఆ రోడ్డు ను పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందని కోరారు. నియోజక వర్గ పరిధిలో జల జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యు అధికారి చిన ఓబులేసు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికేట్లకొరకు ఎస్‌బిఐలో ఏర్పాట్లు

**ఒంగోలు, ప్రభాతవార్త**



పింఛన్ దారులు లైఫ్ సర్టిఫికేట్లు సమర్పించడానికి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఒంగోలు రీజియన్ పరిధిలో విస్తృత స్థాయిలో ఏర్పాటు చేసిందని బ్యాంక్ ఒంగోలు రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు తెలిపారు. పింఛన్ దారులు తమ లైఫ్ సర్టిఫికేట్లను జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా సమర్పించాలని సూచించారు. ఆధార్‌తో లింక్ అయిన స్మార్ట్ ఫోన్ ద్వారా పింఛన్ దారులు సులభంగా తమ ఇంటి వద్ద నుంచే జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించిన తర్వాత పింఛన్ దారుల సెల్ నంబర్‌కు మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. పింఛన్ దారుల సౌకర్యార్థం ఎస్‌బీఐ అన్ని శాఖల వద్ద జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్ల సమర్పణకు సంబంధించి సహాయం అందించడానికి తగు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పింఛన్ దారులు భౌతికంగా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించినా తమ శాఖలలో ఆమోదించడం జరుగుతుందన్నారు. తగు భద్రత, సౌకర్యం దృష్ట్యా పింఛన్ దారులు జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలని సూచించడం జరుగుతోందన్నారు. 80 సంవత్సరాల పైబడిన వారు, అనారోగ్యంతో ఉన్న వారు సులభంగా జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా తమ లైఫ్ సర్టిఫికేట్ సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఎస్‌బీఐలో ఖాతా కలిగిన పింఛన్ దారులు తమకు అందుబాటులో ఉన్న ఏ బ్రాంచ్‌కి అయినా వెళ్లి జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్ ఇవ్వవచ్చన్నారు. పింఛన్ దారులు సులభంగా లైఫ్ సర్టిఫికేట్ అందజేయడానికి కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన మాజీ మంత్రి మేరుగ

**నాగులుప్పలపాడు, నవంబర్ 7, ప్రభాతవార్త**



మొంథా తుఫాన్ కారణంగా నాగులుప్పలపాడు మండలం మట్టిగుంట, ఈదుముడి, మద్దిరాల, ముప్పాళ్ళ గ్రామాలలో నీట మునిగిన పంట పొలాలను మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి తుఫాన్ కారణంగా నీట మునిగిన పంట పొలాలను అధికారులు పరిశీలించి రైతులకు తగిన సహాయం అందించి వారికి కొంత ఉపశమనం కలిగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెలుగొండ ఆయకట్టుకు 2026 నాటికి నీరు

- యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పనులు
- నిపుణులతో కలిసి
పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల

**పెద్దదోర్నాల, ప్రభాతవార్త**

వెలిగొండ ప్రాజెక్టు పనులు వచ్చే సంవత్సరానికి పూర్తి చేసి ఆయకట్టు రైతాంగానికి పూర్తి స్థాయిలో నీరు అందిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వెలిగొండ ఫీడర్ కెనాల్‌ను ఇరిగేషన్ నిపుణుల బృందంతో, మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి శుక్రవారం ఆయన వెలుగొండ ప్రాజెక్టు పరిశీలించారు. మొంథా తుఫాన్ వర్షాలకు వెలుగొండ ఫీడర్ కెనాల్ 850 మీటర్ వద్ద, వంద అడుగుల పొడవున 30 అడుగుల లోతులో పడిన గండిని చూశారు. జంట సొరంగాలలోకి 9కి.మీ చొచ్చుకు వచ్చిన నీటిని తొలగించే పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో కూడా వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకుని ఫీడర్ కెనాల్ సీసీ వాల్ లైనింగ్ నిర్మాణంలో డిజైన్స్ అప్రూవల్ చేయమని సూచించారు. ఈ సందర్భంగా వెలిగొండ క్యాంప్ ఆఫీసర్‌లో ప్రాజెక్టు పెండింగ్ పనులపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 30 ఏళ్ల కిందట తన భూమి పూజ చేసిన ఈ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తవ్వకపోవడంపై తీవ్ర ఆవేదన చెందినట్లు రామానాయుడు చెప్పారు. అందువల్లనే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వెలిగొండపై ఆయన ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులను పరుగులు తీయిస్తున్నారు అన్నారు. ఈ నేపథ్యంలోనే మేమంతా రేయింబవళ్లు శ్రమించి వెలిగొండ పూర్తికి కంకణం కట్టుకున్నామన్నారు. వాస్తవాలు ఇలా ఉండగా వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసిన జగన్, తన అబద్దాల వేదిక సాక్షి మీడియాలో వెలిగొండపై అవాకులు చవాకులు పేలడం ఆశ్చర్యం గొలుపుతోందన్నారు ఏడాదిన్నరగా ప్రాజెక్టు పనులు కుంటుపడ్డాయని విమర్శలు చేయడం విడ్డూరం కాక మరేమిటి అని ప్రశ్నించారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లా, ఫ్లోరైడ్ బాధిత జిల్లా అయిన ప్రకాశం జిల్లా వాసులను మోసం దగా చేశాడు అన్నారు. తల్లిని, చెల్లిని మోసం చేసిన అతనికి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేయడం పెద్ద విషయం కాకపోవచ్చన్నారు. నిర్వాసితులకు రూ.900 కోట్లకు పైగా పరిహారం అందించాల్సి ఉండగా తన ఐదేళ్ల హయాంలో ఒక్క రూపాయి అందించలేదని దుయ్యబట్టారు. నాడు2014-19లో టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రూ.1373 కోట్లు నిధులు కేటాయించి రూ.1319 కోట్లు అనగా 96 శాతం ఖర్చు చేశారని చెప్పారు. పూర్తి కాకుండానే పూర్తయిపోయింది అని జాతికి అంకితం చేసిన జగన్ జమానా తరువాత కూడా.. టన్నెల్ -2లో ఇంకా 4.2 కి.మీ లైనింగ్ పనులు, బెంచింగ్ పనులు చేయడంతో పాటు, టీబీఎం మెషిన్ తొలగించాల్సి ఉందన్నారు. ఫీడర్ కెనాల్ లైనింగ్ 3 కి.మీ పొడవున రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల కోసం ఇటీవలే రూ.456 కోట్లతో టెండర్లు పిలిచామని రామానాయుడు వివరించారు. ఈ నెలలోనే ఫీడర్ కెనాల్ పనులు మొదలు పెట్టబోతున్నట్లు చెప్పారు. టన్నెల-2లో బీటీఎం మెషిన్ తొలగించడానికి సాంకేతిక నిపుణుల కమిటీని నియమించామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు 2026 కల్లా వెలిగొండ పూర్తి




చేసి, ఆయకట్టు రైతులకు నీరందించే లక్ష్యంతో రేయింబవళ్లు పని చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీకి కట్టుబడి ఇటీవలే హంద్రీనావా కాలువల ద్వారా రాయలసీమకు కృష్ణా జలాలను తరలించి చూపించామన్నారు. అలాగే వెలిగొండకు కూడా 2026 నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి నీరందించటం ఖాయమన్నారు. అలోగానే నిర్వాసితుల కాలనీలు పూర్తి చేయటం, పరిహారం పంపిణీ తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం గత హయాంలో ఈ ప్రాజెక్టుకి సంబంధించి ఏడు కాలనీలలో నాలుగు కాలనీలు నిర్మించినట్లు చెప్పారు. ఆ పనులు తాలూకు బిల్లులు ప్రభుత్వం వచ్చిన తర్వాతే చెల్లించామన్నారు. ఈ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధమైన కృషి జరుగుతుందని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు. జగన్ హయాంలో చిల్లిగవ్వ కూడా ఇవ్వని కారణంగా వెలిగొండ నిర్వాసితులకు ఇంకా 900 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉందన్నారు. 2026 సంవత్సరం చివరికి ప్రాజెక్టు పూర్తితో పాటు ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని రామానాయుడు చెప్పారు.







## రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టీకరణ

**మార్టూరు, నవంబర్ 7, ప్రభాతవార్త**



రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, ఏ ప్రాంత రైతుకు కూటమి ప్రభుత్వంలో అన్యాయం జరగదు, కొమ్మమూరు కెనాల్‌పై ప్రతిపాదిత లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై అపోహలు ఆందోళన అవసరం లేదని, ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందని, రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల ప్రయోజనం కోసం పీ 4 అనే పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కారుమంచి ప్రసాద్ సీఎం పిలుపుతో రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చారు. ఆ ప్రాంత రైతులకు మేలు చేకూర్చాలనే ప్రసాద్ ఉద్దేశం మంచిదైనప్పటికి, ప్రభుత్వానికి సమర్పించిన డీపీఆర్ తప్పుల తడకగా ఉంది. అది సాంకేతికపరంగా లోపాలు ఉన్నాయని, ప్రభుత్వం నాలుగు నెలల క్రితమే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని పక్కన పెట్టింది. ఈ పథకాన్ని సంబంధించి సాంకేతిక అంశాలపై పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి నేనే స్వయంగా నివేదిక అందించడం జరిగింది. కొమ్మమూరు కెనాల్‌పై ప్రతిపాదిత లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టింది. రైతులందరూ ఆందోళనచెందాల్సిన అవసరం లేదు. వైఎస్సార్‌సీపీ ఉచ్చులో రైతులెవరూ పడవద్దని విజ్ఞప్తి చేశారు. వైసీపీ చేస్తున్న ప్రచారం, అపోహలను నమ్మవద్దు అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొమ్మమూరు కాలువను నిర్లక్ష్యం చేసిందని, కనీసం మరమ్మత్తులు చేపట్టకపోవడంతో మనుగడే ప్రశ్నార్థంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే కాలువలను ఆధునీకరించి వాటర్ కెపాసిటి పెంచి చిట్టచివరి భూములకు సైతం నిరందించేలా కృషి చేశాం. గతంలోపట్టి సీమతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలమైతే, వైసీపీ పాలనలో పంట పొలాలు ఎండిపోతున్న మంకుపట్టుదలతో పట్టిసీమ పంపులు ఆన్ చేయకుండా రైతులు వేదించిన సంగతి తెలిసిందే. చివర ఆయకట్టులో ఉన్న రైతాంగానికి సహజంగా ఉండే ఆందోళనను ఆసరాగా చేసుకుని తెరవెనుక వైఎస్సార్‌సీపీ కుట్రతో ప్రజల్లో ఆందోళన రేకెత్తించి ఆ పత్రిక, నాయకులు తతంగం నడుపుతున్నారు. రైతులందరూ ఆందోళన చెందవద్దు, రైతులు ఏ ప్రాంతంలో ఉన్నా వారి ప్రయోజనాలే కూటమి ప్రభుత్వానికి సమానం, ముఖ్యమే. ఏదైనా అనుమానాలు ఉంటే సంబంధిత శాఖ మంత్రి, అధికారులతో నివృత్తి చేసే బాధ్యత నాదే, మీరెవ్వరు ఆందోళన చెందవద్దు అన్నారు.

## వందేమాతరం గీతం భారతీయులందరికి గర్వకారణం

**ఒంగోలు, ప్రభాతవార్త**



వందేమాతరం గీతం భారతీయులందరికి గర్వకారణం అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈ గీతాన్ని మొదటిసారి ఆలపించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు శుక్రవారం ఉదయం ప్రకాశం భవనం సమీపంలోని చర్చి సెంటర్, అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు మానవహారంగా ఏర్పడి ఈ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులందరూ ఒకటేనని ఐక్యతను చాటుతూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించిన వందేమాతరం గీతం గొప్పదనాన్ని మరోసారి నేటి తరానికి కూడా తెలియజేసేలా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఈ గీతాలాపనకు పిలుపునిచ్చిందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ తరాలు మారినా వన్నెతెరగని గీతం వందేమాతరం అని చెప్పారు. దీని విశిష్టతను అందరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ బంకిం చంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్రోద్యమ సమయంలో ప్రజల్లో శక్తిని నింపిందని అన్నారు. ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ కోట్లాది మందిని ఏకతాటిపైకి తీసుకొచ్చిందన్నారు. నాటి స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేసేలా ఏడాది పాటు ప్రత్యేక ఉత్సవ కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో బి.చిన ఓబులేసు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

- ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**ఒంగోలు, ప్రభాతవార్త**





పర్యావరణాన్ని కాపాడుకోవటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఒంగోలు నగరం లో ఐదు వేల మొక్కలను నాటే కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు చేపట్టారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, బీఎన్ విజయ్ కుమార్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి చైర్మన్ షేక్ రియాజ్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి ముందుగా ఒంగోలు మార్కెట్ యార్డు సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పంజలి ఘటించారు. అనంతరం అంజయ్య రోడ్డులో కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో బాగంగా పచ్చదనానికి పారిశుధ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఒకే రోజు 5000 మొక్కలను నాటేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నగరంలోని ఎనిమిది ప్రధాన రహదారుల వెంట పది కాలేజీల విద్యార్థులను భాగస్వాములు చేస్తూ ఈ మొక్కలను నాటిస్తున్నట్లు తెలిపారు. వీటిని జియోట్యాగ్ చేస్తూ పర్యవేక్షణ బాధ్యతలను కూడా వారికే ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం మంగమూరు రోడ్డులోని రత్నదీప్ సూపర్ మార్కెట్ వద్ద జనార్ధన్‌రావు, రియాజ్ ప్రజలకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

6_6.qxd 11/7/2025 11:31 PM Page 1



## ఈ అభ్యాస్ అంతర్రాష్ట్ర పోటీ పరీక్షల్లో
# సత్తా చాటిన మన బాల భారతి విద్యార్థులు

**- ప్రతిభావంతులైన విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించిన పాఠశాల యాజమాన్యం**




**సంతమాగులూరు నవంబర్ 7,ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలం పుట్ట వారి పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని మన బాల భారతి విద్యార్థులు ఈ అబ్యాస్ అకాడమీ, హైదరాబాద్ వారి సహకారంతో ఒలింపియాడ్ ,ఐ ఐ టి అంతర్రాష్ట్ర ఒలింపియాడ్ పోటీలు రెండవ ప్రతిభా పరీక్ష ఎ మ్యాట్ (ఆర్య భట్ట మెంటల్ ఎబిలిటీ టెస్ట్) పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులతో అక్టోబర్ 18 నిర్వహించిన అంతర్రాష్ట్ర ఒలంపియాడ్ పోటీ పరీక్షలకు 1000 మందికి పైగా పాల్గొన్నారు. ఈ పరీక్షలలో సంతమాగులూరు మండలంలోని మన బాల భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థి ఎల్లిపాయల అశోక్ రెడ్డి, ఐదవ తరగతి విద్యార్థి ఉప్పాల మోక్షి త ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని తమ సత్తా చాటినట్లు మన బాల భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్అకడమిక్ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరసి తమ పాఠశాలను, మండల కీర్తిని చాటిన విద్యార్థులను, వారికి శిక్షణ నిచ్చిన ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల యాజమాన్యం అకడమిక్ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డితో పాటు, పాఠశాల కరస్పాండెంట్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు ( నిన్నేకల్లు ఎస్సై ), పాఠశాల కన్వీనర్ దుగ్గెంపూడి పవన్ కుమార్యాజమాన్య బృందం అభినందించారు.



## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్**



**గిద్దలూరు, నవంబరు 7, ప్రభాతవార్త**
డిసెంబర్ 13న గిద్దలూరు కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ తెలిపారు. గిద్దలూరు సబ్ జైల్‌ను జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ లోక్ ఆదాలతో రాజీ పడదగిన సివిల్ కేసులన్నీ రాజీ చేసుకోవచ్చని తెలియజేశారు. రాజీమార్గమే రాజమార్గమని తెలియజేశారు. మీరు ఇక్కడి నుంచి బయటికి వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని, మీరు ఇక్కడ ఉండటం వల్ల మీ కుటుంబ సభ్యులు ఎంతో మనోవేదనకు గురవుతారని తెలియజేశారు. మీరు జాతీయ లోక్ ఆదాలత్‌ను ఉపయోగించుకొని మీరు బయటికి వెళ్లిన తర్వాత రాజీమార్గమే రాజమార్గమని, కోర్టులలో కేసులు ఉండే మీ బంధువులకు తెలియజేసి, డిసెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలని తెలిపారు. ఖైదీలకు అందుతున్న ఆహార సదుపాయాల గురించి, వైద్య సదుపాయాల గురించి, పరిసరాల పరిశుభ్రత గురించి జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెంట్ యూ లింగారెడ్డి, న్యాయవాది సిహెచ్ పోలయ్య, పారాలీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధనరావు, కోర్టుసిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## వందేమాతర గీతం దేశ ఔన్నత్యాన్ని చాటి చెబుతుంది

**- టిడిపి నాయకులు కృష్ణకిషోర్ రెడ్డి**



**గిద్దలూరు రూరల్, నవంబరు 7, ప్రభాతవార్త**
వందేమాతర గీతం దేశ ఔన్నత్యాన్ని ఐకమత్యాన్ని విశిష్టతను చాటి చెబుతోందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు, టిడిపి నాయకులు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి అన్నారు. వందేమాతరం గీతంను రచించి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డిని పాఠశాల సిబ్బంది దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వందేమాతరం గీతం పరమార్థాన్ని ప్రతిఒక్కరు తెలుసుకోవాలి



**రాచర్ల, నవంబరు 7, ప్రభాతవార్త**
వందేమాతరం గీతం పరమార్థాన్ని ప్రతిఒక్కరు తెలుసుకొని అనుసరించాలని గిద్దలూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె రామకోటయ్య రాచర్ల ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. వందేమాతర గీతం ఆవిర్భవించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం వారు గీత రచయిత బంకీం చంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి రాచర్ల బస్టాండ్ సెంటర్ వరకు అధికారులు విద్యార్థులతో కలిసి వారు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేమాతర గీతాలాపనతో పాటు జాతీయ జెండాను కూడా అదే విధంగా గౌరవించి ప్రదర్శించాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వై వెంకటేష్, కార్యాలయ సిబ్బంది స్వామి రాజ్ కుమార్, మండల ఎంఈఓ షేక్ మొయినుద్దీన్, డిప్యూటీ తహసిల్దార్ వై స్వాతి, ఏపీఎం కె నరేష్, ఏపీఓ ఆర్ మహాలక్ష్మి మ్మ, హెచ్ఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఎంవి నాయక్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం ఉద్యమవీరుకు స్ఫూర్తినిచ్చింది

**కంభం, నవంబరు 7, ప్రభాతవార్త**
వందేమాతరం గేయం స్వాతంత్ర్యం సమయంలో ఉద్యమ వీరులకు స్ఫూర్తినిచ్చి పోరాడేందుకు దోహదపడిందని కంభం సిఐ మల్లికార్జున తెలిపారు. కంభం పట్టణంలోని కందులాపురం సెంటర్లో ఎంపీడీవో వీరభద్ర చారి, తహసిల్దార్ కిరణ్, సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు ఇంకా పలు శాఖల అధికారులు కందులాపురం సెంటర్లో శుక్రవారం వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాలవేసి వందేమాతర గేయాన్ని ఆలపించారు. అనంతరం వందేమాతరం గేయం యొక్క విశిష్టతను వారు ప్రజలకు చాటిచెప్పారు. వందేమాతరం గేయం దేశ ఐక్యతను చాటిచెబుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లుఅబ్దుల్ సత్తార్, సత్యనారాయణ, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో మనకు మంచిరోజులు రాబోతున్నాయి

**- శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి**



**మార్కాపురం, నవంబరు 7, ప్రభాతవార్త**
స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో మార్కాపురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీం నిర్మించిన రఫీ డార్మెంటరీను శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు విశేష సేవలను అందించేందుకు ఆయన్ని ప్రోత్సహించారన్నారు. ప్రయాణికులకు మరింత సౌకర్యం కలిగిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. వెలుగొండ ప్రాజెక్ట్ పురోగతిని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి వెలుగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతిని సమీక్షించినట్లు వెల్లడించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్‌కు టెండర్లు త్వరలోనే పిలవబడనున్నాయని, 2026 డిసెంబర్ నాటికి వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తవుతుందని తెలిపారు. మార్కాపురం జిల్లాగా ప్రకటన త్వరలో మార్కాపురం ప్రత్యేక జిల్లాగా ప్రకటించబడుతుందని నొక్కి చెప్పారు. ప్రజలకు ఎంతో మేలుగా ఉంటుందని పేర్కొన్నారు. శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి శుభం ఫంక్షన్ హాల్లో జరిగిన దండా వారి వివాహ మహోత్సవం, మాధవి గ్రాండ్ ఫంక్షన్ హాల్లో జరిగిన వెన్నా వారి వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ప్రజలకు మరింత సాన్నిహిత్యంగా ప్రభుత్వ సామాజిక కార్యంలో మరింత చురుకుగా పాల్గొని, ప్రజలకు దగ్గరవుతూ, అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నారని ప్రజలు అభిప్రాయపడ్డారు.

# ముమ్మరంగా వాహన తనిఖీలు



**గిద్దలూరు, నవంబరు 7, ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలోని అమరావతి–అనంతపురం జాతీయ రహదారి, కడప–గిద్దలూరు రాష్ట్రీయ రహదారిపై విడతలవారీగా గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్, రూరల్ సీఐ రామకోటయ్య శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఇటీవల వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సిఐలు వాహన తనిఖీలు చేపట్టినట్లు వారు తెలిపారు. వాహనాలకు సంబంధిత ధ్రువపత్రాలు, వాహనం నడుపుతున్న డ్రైవర్ లైసెన్స్, సంబంధిత సేఫ్టీ పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని పరిమిత వేగంతో వాహనాలు నడిపి సురక్షి తంగా గమ్య స్థానాలకు చేరాలని సూచించారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గిద్దలూరు రూరల్, నవంబరు 7, ప్రభాతవార్త**
గిద్దలూరులోని 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ లో విద్యుత్ మరమత్తుల కారణంగా నేడు 8వతేదీ శనివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ డిఈ బివై శేషగిరిరావు శుక్రవారం తెలిపారు. గిద్దలూరు సబ్ స్టేషన్ పరిధిలోని నంద్యాల హైవే మొత్తం, ఒంగోలు హైవే మొత్తం, బ్రిటన్ రోడ్, క్లబ్ రోడ్, రాజా నగర్, వెటర్నరీ హాస్పిటల్, పోలీస్ స్టేషన్ ఏరియా కుమ్మరాం కట్ట, గాంధీ బొమ్మ సెంటర్, ఈ ఈ ఏరియాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయబడుతుందని తెలిపారు. కావున ప్రజలందరూ గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

## ఎన్‌జిఓ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం...




**మార్కాపురం, నవంబర్ 7, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని బ్రాహ్మణ బంధువుల ఆధ్వర్యంలో ఎన్జీఓస్ అధ్యక్షుడిగా భారతుల శ్రీనివాస శాస్త్రి 11వ సారి ఎన్నికైన సందర్భంగా, డిప్యూటీ ఎండీఓగా పదోన్నతి పొందిన వద్దమాను శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం శుక్రవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో గోపాలుని హరిహరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ అతిథులు భారతుల శ్రీనివాస శాస్త్రి, వద్దమాను శ్రీనివాస్‌లను పూలదండలు, శాలువాలతో సన్మానించి, వారి సేవలను ఘనంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రవిచంద్రకుమార్, శ్రీ సాధన విద్యా సంస్థ డైరెక్టర్ గోపాలుని లక్ష్మీ మ్మ రమేష్ బాబు, మార్కాపురం మార్కండేయ స్వామి ఆలయ మాజీ చైర్మన్ కేశవ, రెవిన్యూ శాఖ రిటైర్డ్ డిప్యూటీ తహశిల్దార్ డిటిడివి రమణ, ఎస్ఆర్ సాయి నాగరాజు శ్రీనివాస్, చిప్ శ్రీనివాస్, సునీల్, బొద్దుపల్లి కృష్ణ సోమయాజులు, హరి, భాస్కర్, మధు తదితరులు పాల్గొన్నారు.


### జార్జ్ ఫార్మసీ కళాశాలలో ఘనంగా వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలు



**మార్కాపురం, నవంబర్ 7, ప్రభాతవార్త**
డాక్టర్ శ్యామ్యూల్ జార్జ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, మార్కాపురం కళాశాలలో వందేమాతరం" 150వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం దేశభక్తి గీతాల ఆలాపనతో ఘనంగా జరిగాయి. నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని దేశభక్తి నినాదాలతో కళాశాల ప్రాంగణం మార్మోగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య సమరానికి ప్రేరణనిచ్చిందని అన్నారు. ఇది కేవలం గీతం మాత్రమే కాదని, దేశమంటే ప్రేమ, త్యాగం, ఐక్యతలకు సంకేతమని అన్నారు. విద్యార్థులు ఈ స్ఫూర్తిని తమ జీవన విధానంలో ఆచరణలో పెట్టాలి" అని పేర్కొన్నారు. అకాడమిక్ డీన్ డాక్టర్ వై సునీత మాట్లాడుతూ 150 సంవత్సరాల క్రితం రచించిన వందేమాతరం నేటికీ మనలో దేశభక్తి జ్వాలలను రగిలిస్తోందన్నారు. ఈ తరహా కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశం పట్ల గౌరవం, బాధ్యతా భావం పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో సిఓఈ డాక్టర్ కె అశోక్ బాబు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఎస్డి ముజీబ్, అధ్యాపకులు, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, బీఫార్మసీ విద్యార్థులు సమిష్టిగా వందేమాతరం గీతాన్ని ఆలపించి దేశభక్తి సందేశాన్ని ప్రతిధ్వనింపజేశారు.

## పాలుట్లలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం

**- రచ్చబండ నిర్వహించిన చెంచు, లంబాడి, గిరిజనులు**



**యర్రగొండపాలెం, నవంబరు 7, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఏ గ్రామంలో అయితే వైసీపీ జెండా ఎత్తి పోరాడుతాడో అతడే నాయకుడు, అతని సారధ్యంలో గ్రామంలోని ప్రజలు మమేకమై కదలి మెడికల్ కాలెజీల ప్రవేటీకరణ, రచ్చబండ, కోటి సంతకాల సేకరణ లాంటి ఉద్యమ కార్యక్రమాలు జరిగి తీరాలని తెలిపారో అదే ఊపులో గ్రామ గ్రామాన రేగిన పోరాటం అడవిబిడ్డల గ్రామాలకు సైతం చేరిపోయింది. యర్రగొండపాలెం మండలంలోని నలమల పాలుట్లలో వైఎస్సార్సీపి ఎస్టీ విభాగపు నాయకులు, గ్రామసర్పంచ్ సురేష్ నాయక్ సారధ్యంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ వైసిపి హయాంలో పేద ప్రజల ప్రయోజనార్థం తీసుకువచ్చిన 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందించాలని ఆశయంతో ప్రారంభించడం జరిగిందని, అందులో 5కళాశాలలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారని అన్నారు. జగన్ అమలులోకి తెచ్చిన ఈ 5 కళాశాలలను ప్రభుత్వ నిర్వహణలో ఉండటంవల్ల మా నల్లమల ఆటవీ ప్రాంతంలోని గూడేంలకు చెందిన గిరిజన పిల్లలు కూడ డాక్టరు సీట్లు సాధించగలరని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో మిగతా మెడికల్ కాలేజీలు నిర్మాణం పూర్తి చేయకుండా వాటిని ప్రైవేటీకరణ చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిసూ పార్టీ పిలుపులో భాగంగా కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. మార్కాపురంలో సుమారు 70 ఎకారాల విస్తీర్ణంలో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టి వైద్య భవనం నిర్మాణం జరుపుకోగా ఇప్పుడు దాన్ని పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేయడానికి కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ప్రయత్నం చేయడం చాలా దుర్మార్గమని దానిని మన ప్రాంత గిరిజనులు అందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. గ్రామం నుంచి గిరిజనులంతా కూటమీ ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాలు చేసి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలుట్ల గ్రామంలో గిరిజనులందరు పాల్గొని నినాదాలు చేశారు. గిరిజన గూడేంకు చెందిన నాయకులు, స్థానిక పెద్దలు, వైసీపి కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం గీతాన్ని భావితరాలకు తెలియజేయాలి



**తాళ్లూరు, నవంబర్ 7,ప్రభాతవార్త**
వందేమాతరం గీతాన్ని భావితరాలకు తెలియ జేయాలని జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీడీవో పీ. అజిత అన్నారు. భారతదేశ జాతీయ గీతం ఖివందే మాతరంఖి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద వందే మాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేమాతరం గేయాన్ని 1875 నవంబర్ 7వ సంవత్సరంలో బంకిం చంద్ర ఛటర్జీ రచించినట్లు చెప్పారు. ఈ గేయాన్ని ఆయన తొలిసారి రాసిన ఆనందమఠం నవలలో ప్రచురితం చేసినట్లు పేర్కొన్నారు. ఆయన బెంగాలీలో వ్రాసిన ఈ గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో చాలా ప్రాచుర్యం పొందిందన్నారు. 1950వ సంవత్సరంలో భారదేశ జాతీయ గేయంగా స్వీకరించబడిందన్నారు. ఈ గీతం భారత స్వాతంత్ర్యోద్యమంలో ఒక ముఖ్యమైన నినాదంగా మారిందన్నారు. కార్యక్రమంలోమండల టీడీపీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఐ. శ్రీనివాస్‌రెడ్డి, గొల్లపూడి వేణుబాబు, రాచకొండ వెంకట్రావు, సర్పంచ్ షేక్ వలి, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, ఎంఈఓ సుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం, సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రంగనాయక స్వామి ఆలయంలో నేడు స్వామి వారి మాస కళ్యాణం



**రాచర్ల, నవంబర్ 7, ప్రభాతవార్త**
మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోగల శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో నేడు 8వ తేదీ శనివారం శ్రీ స్వామివారి మాస కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్య నిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య శుక్రవారం తెలిపారు. కల్యాణంలో పాల్గొనదలచిన దంపతులు ముందుగా రూ.1,516 చెల్లించి రశీదు పొందాలని వారు మాత్రమే కళ్యాణంలో పాల్గొనేందుకు అర్హులన్నారు. కళ్యాణంలో పాల్గొనే దంపతులు సాంప్రదాయ దుస్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

# వాహన తనిఖీలు చేపట్టిన ఎస్సై అనుక్



**పొన్నలూరు,నవంబరు 7, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన పొన్నలూరులో ఎస్సై అనుక్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. పాఠశాల బస్సులు, ట్రావెల్స్, లారీలు, ఆటోలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. బస్సుల లోపల అత్యవసర ద్వారాలను, ముఖ్యంగా బస్సులలో ఉన్న అగ్నిమాపక పరికరాల పనితీరును పరిశీలించారు. వాటిని ఏవిధంగా ఉపయోగిస్తారో డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సరైన పత్రాలు లేని వాహనాలకు చలానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, ఇన్స్యూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. వాహనాలు నడిపే క్రమంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## పాఠశాలకు సెలవు లేదు



**దొనకొండ,నవంబర్ 7,నప్రభాతవార్త**
ప్రకాశం జిల్లాలో మొంతా తుఫాను కారణంగా గత నెలలో ఐదు రోజులపాటు పాఠశాలలకు సెలవులు ఇచ్చిన కారణంగా ఈనెల 2 వ శనివారం రేపు అనగా 8వ తేదీన జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మార్చి మాసం వరకు ప్రతి రెండవ శనివారం పాఠశాలలను నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

# విద్యుత్తు చౌర్యం చేస్తే కేసులు



**తాళ్లూరు,నవంబర్ 7,ప్రభాతవార్త**
విద్యుత్తు వినియోగంలో నిబంధనలు పాటించని వినియోగదారుల పై కేసులు నమోదు చేస్తున్నట్లు దర్శి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పాలగిరి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం తాళ్లూరులోని విద్యుత్తు ఉపకేంద్రం ఆవరణలో సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. వివిధ అంశాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మండలంలో 40 బృందాలు గా ఏర్పాడి 3505 విద్యుత్తు సర్వీసులను తనిఖీ చేసినట్లు చెప్పారు. అనధికారిక విద్యుత్తు వాడుతున్న 33 మందిని గుర్తించి వారికి రూ.1.56లక్షలు, అనుమతి మించి అధికలోడ్ వాడుతున్న నలుగురికి రూ.15. 6 వేలు, అనుమతించిన కేటగిరీ కాకుండా మరో కేటగిరీ కింద వాడుతున్న ఒకరికి రూ. 3వేలు జరిమానాలు విధించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో ఒంగోలు డీపీ ఈఈ పి. హైమావతి, దర్శి, పొదిలి డీఈఈలు పి. రవికుమార్, డీ. హరిబాబు, తాళ్లూరు ఏఈ ఎం. రామకృష్ణారెడ్డి, ఎల్ఐ లు వీవీఎస్ కాంతారావు, ఆళ్ల శ్రీనివాసరావు, డీపీ డీఈఈ, ఏఈలు, దర్శి డివిజన్ లోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి

**తాళ్లూరు, నవంబర్ 7, ప్రభాతవార్త**
ప్రతి ఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని స్థానిక పీహెచ్ సీ వైద్యాధికారి పీ. ప్రవీణ్ కోరారు. ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతి పౌరుడు ముందుస్తుగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్ ను ముందుగానే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. ధూమపానం వలన అధికంగా వస్తుందన్నారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ కాన్సర్ పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో డాక్టర్ రాజేష్ యాదవ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## బేస్తవారిపేటలో గ్రామసింహాల స్వైరవిహారం

**- కుక్కల బెడదతో బెంబేల్లెత్తుతున్న వృద్ధులు, చిన్నారులు**

**- జాతీయ రహదారిపై ఇబ్బందులు పడుతున్న వాహనదారులు**



**బేస్తవారిపేట, నవంబరు 7, ప్రభాతవార్త**
బేస్తవారిపేట పట్టణంలో గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. పట్టణంలోని బైపాస్ రోడ్డు, సర్వీస్ రోడ్డు, ఆర్‌కె జంక్షన్, తదితర ప్రాంతాలలో ఎక్కడ ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు దర్శనమిస్తున్నాయ. రోడ్లపై వెళ్ళే ప్రజలు, ప్రయాణీకులు దాడిచేసి గాయపరుస్తాయేమోనని భయపడిపోతున్నారు. ఎప్పుడు ఎటునుంచి వచ్చి దాడిచేస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శునకాలు జాతీయ రహదారిపై పగలు, రాత్రి తేడా లేకుండా సంచరిస్తుండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వీధులలో కుక్కలు గుంపులుగుంపులుగా సంచరిస్తుండడంతో పట్టణంలోని వృద్ధులు, చిన్నారులు హడలెత్తుతున్నారు. ప్రతిరోజు రాత్రిపూట కుక్కల అరుపులతో నిద్రకు భంగం కలుగుతుందని స్థానికులు వాపోతున్నారు. ద్విచక్రవాహనదారుల వెంట పడుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుమార్గంలో వేగంగా వచ్చే వాహనాలకు అడ్డుపడుతున్నాయి. రోడ్డుమార్గంలో వెళ్ళు వాహనదారులు కుక్కలపట్ల అప్రమత్తంగా ఉండడమేతప్పా వేరే మార్గం కనిపించడం లేదు. పట్టణంలోని ప్రజలు చాలావరకు కుక్కల బారీనపడి ఆసుపత్రులలో చేరి వ్యాక్సిన్లు చేయించుకున్నారు. గత రెండు నెలల నుండి బేస్తవారిపేట ప్రభుత్వ వైద్యశాలలో దాదాపు 50మందికి పైగా చికిత్సలు అందించినట్లు కేసులు నమోదైనట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

**అధికారులు కుక్కల బెడద నుండి కాపాడాలి :**
పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న కుక్కల బెడద నుండి తమను కాపాడాలని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. గతంలో పంచాయితీ శాఖవారు కుక్కలను పట్టుకునేవారిని పిలిపించి పట్టణంలో అక్కడక్కడా కుక్కలను పట్టుకోవడం జరిగిందని కానీ పూర్తి స్థాయిలో పట్టుకోకపోవడంతో మరలా తిరిగి కుక్కలబెడద తీవ్రస్థాయికి చేరడం జరిగిందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధికుక్కలను నియంత్రించేందుకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించాల్సిన ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఎన్నో సంవత్సరాలుగా అమలు చేయలేకపోతున్నారు. శస్త్రచికిత్సల కోసం పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో కుక్కల బెడదనుండి తమను రక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## కొంచా వారి వివాహ వేడుకకు హాజరైన వై.విభద్రారెడ్డి

**అద్దంకి ,నవంబర్ 7, ప్రభాతవార్త**
అద్దంకి పట్టణంలోని వైయస్సార్ అపార్ట్మెంట్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన కొంచా వారి వివాహ వేడుకకు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వై వి భద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట నియోజకవర్గానికి చెందిన వివిధ స్థాయిలలోని వైఎస్ఆర్సిపి నేతలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

## - విద్యుత్ శాఖ ఏఈ మణికంఠ



**హనుమంతునిపాడు, నవంబర్ 7, ప్రభాతవార్త**
సబ్ స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా 33/11 కేవీ తిమ్మారెడ్డిపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని హనుమంతునిపాడు, మోరవారిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, పెద్దగొల్లపల్లి, నల్లగండ్ల, రెడ్డెంవారిపల్లి, కొండారెడ్డిపల్లి, దాసరిపల్లి గ్రామాల్లో నేడు అనగా శనివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మణికంఠ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా వందేమాతర గీతం 150 ఏళ్ల సంబరాలు

## - బకీంచంద్రచటర్జి చిత్రపటానికి నివాళులు



**కొనకనమిట్ల, నవంబర్ 7, ప్రభాతవార్త**
వందేమాతర గీతానికి 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా కొనకనమిట్ల మండల తహసల్దార్ మండల పరిషత్ కార్యాలయాలు, పోలీసుస్టేషన్, పలు సచివాలయాలలో శుక్రవారం ఘనంగా వందేమాతర గీతాలాపన జరిగింది. తహసీల్దార్ కార్యాలయంలో ఉపతహసీల్దార్ ఐ.అరుణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ పోలీసు స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌లు వందే మాతర గీతం గొప్పతనం ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆయా కార్యాలయాల లో వందేమాతర గీత రూపకర్త రచయిత దివంగత బకీంచంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాల వేసి తొలుత ఘనంగా నివాళులర్పించారు. జిల్లా పరిషత్ ఏఏ ఉన్నత పాఠశాల, హిందూ పాఠశాలల్లో వందేమాతర గీతాలాపన ఉపాధ్యాయులు, విద్యార్థులు చేశారు.

# బకీంచంద్ర చటర్జికి ఘన నివాళులు

## - వందేమాతర గీత సంబరాలలో అధికారులు, నాయకులు



**కొనకనమిట్ల, నవంబర్ 7, ప్రభాతవార్త**
కొనకనమిట్ల గ్రామ సచివాలయంలో వందేమాతర గీతం సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గేయా రూపకర్త ప్రముఖ రచయిత దివంగత బకీంచంద్ర చటర్జి చిత్రపటానికి పూల వేసి ఘనంగా అధికారులు, నాయకులు నివాళులర్పించారు . ఈ సందర్భంగా ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ వందేమాతర గేయా భావన అందరిలో ఉండాలని వందేమాతర గీతానికి 150 సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు. ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీదేవి, ఎంఈఓ డాంగే షరీఫ్, టీడీపీ మండల కన్వీనర్ మోరబోయిన బాబురావు, నాయకులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కనకం నరసింహారావు, మువ్వా కాటంరాజు, ముక్కల శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, కాంప్లెక్స్ చైర్మన్ పి. శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సిద్దవరంలో ఘనంగా వందేమాతర సంబరాలు



**కొనకనమిట్ల, నవంబర్ 7, ప్రభాతవార్త**
మండలంలోని సిద్దవరంలో బీజేపీ ఆధ్వర్యంలో వందేమాతర గీతం 150 ఏళ్ల సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గేయ రూపకర్త దివంగత బకీం చంద్ర చటర్జీ 1875 నవంబర్ 7న రచించిన వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సమర నినాదంగా జాతిని ఐక్యం చేయడంలో ఎంతో దోహదపడిందని నాయకులు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.ఉదయ్ కుమార్, సచివాలయ సిబ్బంది, టీడీపీ మండల ఉపాధ్యక్షులు కిలారి బొంతయ్య, బీజేపీ మండల అధ్యక్షులు మన్నం సురేష్, బీజేపీ నాయకులు, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ ఎస్ హిమం కాశీం, జిల్లా నాయకులు కల్లం సుబ్బారెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎద్దుల ప్రసన్నాంజనేయులు, జిల్లా నాయకులు కిలారి శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు కేవీఆర్ ప్రధాన కార్యదర్శి కే.వెంకటేశ్వర్లు, టీడీపీ, బీజేపీ, నాయకులు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం వందేమాతర గీతాన్ని ఆలపించారు.

# పామూరు నూతన సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన కావేరి రసూల్, అంచూరి వెంకట్‌రెడ్డి



**పామూరు, నవంబర్ 7, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గం పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మాకినేని శ్రీనివాసరావును మండల ముస్లిం మైనార్టీ నాయకులు కావేరి రసూల్, అంచూరి వెంకట్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ చిన్న హజరత్, మాలపాటి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# కుటుంబ సాధికారిక సభ్యుల సమావేశం నిర్వహించిన షేక్ హాజీ గౌస్





**పామూరు, నవంబర్ 7, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎస్‌కే బాలేరాంతు సాహెబ్ ఇంటి వద్ద రూ.267,268 బూత్ పరిధిలో 267 బూత్ ఇన్‌చార్జి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హాజీ గౌస్, 268 బూత్ ఇన్‌చార్జి సలాం ఖాజా మొహిద్దిన్ ఆధ్వర్యంలో కుటుంబ సాధికారిక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల టీడీపీ అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఎస్‌డీ అమీర్ బాబు, పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి గుంటుపల్లి శ్రీనివాసులు, మండల టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రసూల్, పట్టణ టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొబిన మౌలాలి, పట్టణ ఐటీడీపీ అధ్యక్షుడు పత్తు మస్తాన్, టీడీపీ నాయకులు కేఎస్‌ఎస్ మెంబర్ గల్లా చెన్నయ్య, కోడిగుంపల నాయబ్ రసూల్, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, అదంసా సత్తార్, అదంసా రఫీ, ఖాజావలి, తెనాలి మస్థాన్, మహిళ నాయకులు ఎస్‌కే షాహిర, ఎస్‌కే షమ్మీ, కదిరి రంగారావు, కాంత కోటయ్య, కేఎస్‌ఎస్ మెంబర్స్ తదితరులు హాజరయ్యారు.

# పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించిన ఎంపీడీవో సురేష్ బాబు

**సంతనూతలపాడు, నవంబర్ 7, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం చంద్రపాలెం గ్రామంలో శుక్రవారం శానిటేషన్ కార్యక్రమాలను ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్, డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మౌనిక తదితరులు పాల్గొన్నారు.




## వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన

# మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున







**నాగులుప్పలపాడు, నవంబర్ 7, ప్రభాతవార్త**
మొంథాతుఫాన్ కారణంగా నాగులుప్పలపాడు మండలం మట్టిగుంట, ఈదుమూడి, మద్దిరాల, ముప్పాళ్ళ గ్రామాలలో నీట మునిగిన పంట పొలాలను మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి తుఫాన్ కారణంగా నీట మునిగిన పంట పొలాలను అధికారులు పరిశీలించి రైతులకు తగిన సహాయం అందించి వారికి కొంత ఉపశమనం కలిగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లా ఉత్తమ ఎత్తిపోతల పథకంగా కనుపర్తి ఎత్తిపోతల పథకం



**నాగులుప్పలపాడు, నవంబర్ 7, ప్రభతవార్త**
ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉత్తమ ఎత్తిపోతల పథకం పురస్కారాన్ని కనుపర్తి ఎత్తిపోతల పథకం వరుసగా రెండవ సారి అందుకుంది. ఆచార్య రంగా కిసాన్ సంస్థ వారు ఏర్పాటు చేసిన ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి సభలో ముఖ్య అతిధులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 20 సూత్రాల పథకం చైర్మన్ లంక దినకర్, కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, చుంచు శేషయ్య పాల్గొన్న సభకు అధ్యక్షులుగా ఆళ్ల వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆచార్య రంగా సేవలను గుర్తు చేశారు. సుదీర్ఘకాలం పాటు పార్లమెంటు సభ్యులుగా రైతు పక్షాన నిలబడి ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చారు అని అన్నారు. రైతు కుటుంబంలో పుట్టి స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీలో పట్టభద్రులై రైతుల కోసం పాటుపడిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఎత్తిపోతల పథకంగా కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షులు ఈదర వెంకట కృష్ణారావును శాలువాతో సత్కరించి జ్ఞాపికను ప్రశంసా పత్రాన్ని పుష్పగుచ్ఛంతో అందించారు. ఈ కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం కార్యదర్శి నడిపినేని శేషగిరిరావు, కోశాధికారి గొల్లకారం వెంకట్రావు, డైరక్టర్లు, ఎత్తిపోతల పథకం సిబ్బంది పాల్గొన్నారు. సభా కార్యక్రమంలో తొలుత ఆచార్య ఎన్జీ రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# బాల్య వివాహాల వల్ల కలిగే అనర్ధాలపై అవగాహన



**నాగులుప్పలపాడు, నవంబర్ 7, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి సువర్ణ ఆదేశాల మేరకు ఇవాంజెలిన్ ఆధ్వర్యంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ద్వారా మద్దిరాలపాడులో ఎయిడెడ్ స్కూల్ నందు బాల బాలికలకు చైల్డ్ హెల్ఫ్ లైన్ నెంబర్ 1098, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్ధాలు, పిల్లలపై జరిగే లైంగిక దాడులు వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌తో పాటు నో టచ్ అనే నినాదంతో శ్రీ లక్ష్మీ రక్షణ అధికారి బాల బాలికలకు అవగాహన కల్పించారు. ఎంఈఓ టి.రవి అధ్యక్షతన కిషోర్ వికాసంపై పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ఉపాధ్యాయులు పిల్లలు భవిష్యత్తు వారి ఉన్నత శిఖరాలను చేరుకునే మార్గాలు వివరించారు. ఇలాంటి కార్యక్రమం ద్వారా చాలా మంది పిల్లలకు 1098 ద్వారా వారికి కావాల్సిన సంక్షేమ పథకాలు పొంది వీలుంటుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పిల్లలకు సంబంధించిన పలు జాగ్రత్తలు తెలియజేశారు.

# ఆర్థిక దోపిడి, సామాజిక అణచివేతలు పోవాలంటే సోషలిజమే ఏకైక లక్ష్యం

## - సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు వెల్లడి



**సంతనూతలపాడు, నవంబర్ 7, ప్రభాతవార్త**
ప్రథమ సోషలిస్టు విప్లవం రష్యాలో జయప్రదమై 108 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నవంబర్ 5 నుండి 11 వరకు వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యంలో శుక్రవారం సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోను, ప్రపంచంలోను ఆర్థిక దోపిడి, సామాజిక అణిచివేతలు పోవాలంటే సోషలిజమే ఏకైక లక్ష్యం అని అన్నారు. మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికను 1948లో రాశారని, పెట్టుబడిదారి విధానం శాశ్వతం కాదని, సమాజంలో వస్తున్న ఈ అసమానతలు పోవాలంటే సోషలిజం ప్రధాన లక్ష్యమన్నారు. దానిని లెనిన్ నాయకత్వంలో రష్యాలో ఆచరించి 1917 నవంబర్ 7న విప్లవాన్ని జయప్రదం చేశారన్నారు. మొదటి సారి ఈ భూ ప్రపంచంలో కార్మిక రాజ్యం ఆవిర్భవించిందని అన్నారు. లెనిన్ మొదటి రోజే దేశంలో ఉన్న పరిశ్రమలన్నీ జాతీయం చేస్తూ భూ సంస్కరణల చట్టాన్ని అమలు చేస్తూ 8 గంటల పని దినాన్ని, మహిళలకు అన్ని రకాల హక్కులను రూపొందించి పేదరికం, దోపిడి లేని రాజ్యాన్ని అనతి కాలంలో సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, నాయకులు షేక్ కాలేషా, కే.రామకృష్ణారెడ్డి, నాగూర్‌బి, మస్తాన్‌బి, కాశీం, ఇక్బాల్, ఫరీదాబి తదితరులు పాల్గొన్నారు.

**పేర్నమిట్టలో :**
మండలంలోని పేర్నమిట్టలో పాపని వెంకట సుబ్బయ్య 40వ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని కళా ప్రాంగణం వద్ద, శాంతి నగర్లో సీపీఎం జెండా ఆవిష్కరణలను అన్ను వెంకట సుబ్బారావు, తుళ్లూరు సుబ్బారావులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో దాసరి చిన్న బాబు, ఆముదాల కోటేశ్వరరావు, భూపతి వెంకట రమణారావు, పొత్తూరు చిన్న శేషయ్య, ఉంగరాల రామకృష్ణ, చీదర్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

**ఎండ్లూరులో :**
వార్షికోత్సవంలో భాగంగా మండలంలోని ఎండ్లూరులో జనరల్ బాడీ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నీలం శ్రీనివాసరావు, కంచర్ల పోతగిరిరావు, అలుగునీళ్ళ శ్రీను, కందుకూరి ఎలీషా, వంకాయలపాటి కోటేశ్వరరావు, బిరుదుల దానియేలు తదితరులు పాల్గొన్నారు.

**సంతనూతలపాడులో :**
మండల కేంద్రమైన సంతనూతలపాడులో సీపీఎం సీనియర్ నాయకులు కోదాటి కోటేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు శేషారావు, ముద్రగడ సుబ్రహ్మణ్యం, పలతోటి శ్రీమన్నారాయణ, తేళ్ల ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీని నెరవేర్చిన టీడీపీ నాయకులు



**వెలిగండ్ల, నవంబర్ 7, ప్రభాతవార్త**
మండలంలోని రామగోపాలపురం పంచాయతీలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటేసి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గెలుపుకు సహకరిస్తే గ్రామంలోని రజకుల కుటుంబాలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తామని అప్పట్లో టీడీపీ నాయకులు హామీ ఇవ్వడం జరిగింది. రజకులు తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి ఉగ్ర నరసింహారెడ్డి గెలుపుకు సహకరించిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రామ గోపాలపురం తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి తన సొంత నిధులతో శనివారం ఇంటి ఇంటికి కొళాయి వేయించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రజక కుటుంబ సభ్యులు దేవిరెడ్డి రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ అధ్యక్షులు దేవిరెడ్డి రామిరెడ్డి, మండల పార్టీ తెలుగు యువత అధ్యక్షులు బొబ్బ రమణారెడ్డి, డీలర్ దండగ రంగనాయకులరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గార్బేజ్ కలెక్షన్‌ను పరిశీలించిన ఎంపీడీవో సురేష్‌బాబు




**సంతనూతలపాడు, నవంబర్ 7, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన సంతనూతలపాడులో డోర్ టు డోర్ గ్యార్బేజ్ కలెక్షన్‌ను శుక్రవారం నాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ కార్యక్రమాలను పరిశీలించి ఆయన సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంటన వై.మణి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గేయ రచయిత చటర్జీ రచించిన వందేమాతరం గేయం 150 సంవత్సరాలు అయిన సందర్భంగా పలు వాడలో జోహార్లు



**సంతనూతలపాడు, నవంబర్ 7, ప్రభాతవార్త**
గేయ రచయిత బకిం చంద్ర చటర్జి రచించిన వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు పర్యవేక్షణలో పలువురు అధికారులు,సిబ్బంది హర్షిస్తూ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా చట్టర్జీని స్మరించుకున్నారు. మండలంలోని పలు సచివాలయంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బాబురావు, డిప్యూటీ ఎంపీడీవో అరుణ్ కుమార్, మండల పరిషత్ ఏవో శారద కుమారి, మండల పరిషత్ ప్రతినిధులు బాలకృష్ణ, బాష, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వెలుగు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తి




**వెలిగండ్ల, నవంబర్ 7, ప్రభాతవార్త**
వందేమాతరం గీతానికి 150 ఏళ్ళు పూర్తయిందని,బ్రిటీష్ దమనానికి ప్రతి స్పందనగా పుట్టిన జాతి నినాదమే వందేమాతర గీతమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్త నరసింహాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వందే మాతరం వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు వందేమాతరం జనగణమన గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ఇంద్రభూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ గేయం అనేక మందిలో స్వాతంత్రోద్యమ ఆకాంక్షను, దేశభక్తిని నింపిందన్నారు. వందేమాతరం గీతం భారత్ ఆత్మను ప్రతిబింబిందని, ఆ గేయం అమ్మ అన్న పిలుపులోని ఆప్యాయత,ప్రేమ భక్తి కలగలసిన ఈ సంక్షిప్త కావ్యమని అది పాట కాదని జాతిని మేల్కొలిపి శక్తి అని అన్నారు. ఆధ్యాత్మిక వేత్తలు గేయాన్ని సాక్షాత్తు ఋషి వాక్కుగా విశ్లేషిస్తే, ఉద్యమకారులు దీన్ని పోరాట స్ఫూర్తి కేంద్రంగా పరిగణించారన్నారు. దేశ మాతకు అంకితమైన ఆ సమర నినాదానికి 150 ఏళ్ళు పూర్తి అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, సుంకరి కృష్ణయ్య,పోతంశెట్టి శ్రీనివాసులు,సుంకరి కొండయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైకం శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గిరిధర్, ధనుంజయ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేసే నకిలీ ఎరువుల ముఠా అరెస్ట్... 291 బస్తాల స్వాధీనం..

## - సిఎంఎస్ పేరుతో నకిలీ ఎరువులు అమ్మకానికి యత్నం

## - వ్యవసాయ శాఖ అధికారుల చాకచక్యం

## - మార్కాపురం పరిసర ప్రాంతాల్లో రాత్రి దాడులు





**మార్కాపురం, నవంబర్ 7, ప్రభాతవార్త**
గ్రామాల్లలో తిరుగుతూ రైతులను నమ్మబలికి నకిలీ ఎరువులు అమ్మేందుకు ప్రయత్నించిన ముఠా పట్టుబడింది. ఈ ఘటన గురువారం రాత్రి మార్కాపురం పరిసర ప్రాంతాల్లో చోటుచేసుకుంది. స్థానిక సమాచారం మేరకు కొంతమంది యువతీ యువకులు సిఎంఎస్ అనే నామకరణం గల 50కిలోల ఎరువుల బస్తాలను ఒక్కొక్కటిని రూ.1200లు ఇస్తామని, ముందుగానే రూ.200 అడ్వాన్స్ తీసుకుంటూ రైతులను మోసం చేస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టారు. వ్యవసాయ అధికారి కె బుజ్జిబాయి ఒక ఆటోలో తరలిస్తున్న సిఎంఎస్ రాగ గోల్డు సన్‌షైన్ క్రాప్కోర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తయారుచేసిన ఎరువుల బస్తాలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తదుపరి సమాచారం మేరకు మార్కాపురం బైపాస్ రోడ్‌లోని ఎస్‌ఆర్ పెట్రోల్ బంక్ వద్ద మరో లారీలో కూడా భారీ ఎరువుల నిల్వ ఉన్నట్లు తేలింది. దీనిపై సహాయ వ్యవసాయ సంచాలకుడు డి బాలాజీ నాయక్, పెద్దారవీడు మండల వ్యవసాయ అధికారి ఎన్ లక్ష్మీనారాయణ, స్థానిక అధికారి కె బుజ్జిబాయి బృందంగా ఏర్పడి రాత్రి 10:30 గంటల నుండి 11:45 గంటల మధ్య దాడి చేసి మొత్తం 291 ఎరువుల బస్తాలను సీజ్ చేశారు. స్వాధీనం చేసిన ఎరువులను మార్కాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. 1985 ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం బస్తాల నుండి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పరీక్షల కోసం పంపించారు. పరీక్షా ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఇనాం భూముల సమస్య పరిష్కరించాలి

## - క్రయవిక్రయాలకు అనుమతి ఇవ్వాలని కమిటీ విజ్ఞప్తి



**సింగరాయకొండ,నవంబర్ 7, ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని ఇనాం భూముల క్రయ విక్రయాలపై ఉన్న నిషేధం ఎత్తివేయాలని ఇనాం భూముల పరిరక్షణ కమిటీ మంత్రులను కోరింది.శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన డిఆర్సి సమావేశంలో కమిటీ ప్రతినిధులు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామా నారాయణరెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి,జిల్లా కలెక్టర్ రాజాబాబును కలిసి వినతిపత్రాలు సమర్పించారు.దేవాదాయ శాఖ పరిధిలోని ఇనాం భూముల విక్రయాలపై ప్రభుత్వం దశాబ్దం క్రితం నిషేధం విధించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కమిటీ సభ్యులు మంత్రులకు తెలిపారు.మంత్రులు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.మంత్రులను కలిసిన వారిలో కమిటీ అధ్యక్షుడు కూనపురెడ్డి సుబ్బారావు, కొత్తూరి శ్రీ రంగనాయకులు ఉన్నారు.

# మొక్కజొన్న తోటలో గిరిజన యువకుని మృతదేహం





**పెద్దదోర్నాల, నవంబర్ 7, ప్రభాతవార్త**
మొక్కజొన్న తోటలో పెద్దదోర్నాల మండలం నందిగూడెంకు చెందిన 16 ఏళ్ల గిరిజన యువకుని మృతదేహం వెలుగు చూడడంతో కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత రెండు వారాలుగా కనిపించకుండా పోయిన ఆర్తి నాగన్న మొక్కజొన్న తోటలో శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు దు:ఖంలో మునిగిపోయారు. మృతదేహం ఆనవాలు గుర్తించి తమ కుమారుడే అని తల్లిదండ్రులు గుర్తించారు. ఒంగోలు నుండి వైద్యులను పిలిచి మండల తహసీల్దార్ సమక్షంలో శవాన్ని వెలికి తీసి మృతదేహానికి తోటలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఆ యువకుడు ఎలా చనిపోయాడని, మొక్కజొన్న తోటకు జంతువులకు రక్షణగా పెట్టిన కరెంటు తగిలి చనిపోయాడా..? ఏమైనా ఇతర కారణాలు ఉన్నాయా అనేది పోస్టుమార్టం నివేదిక ఇచ్చిన తర్వాత తెలుస్తుందని, అయినప్పటికి విచారణ చేస్తున్నట్లు ఎస్సై వి.మహేష్ తెలిపారు.

Main tab page 6_Main tab page 6.qxd 11/7/2025 10:14 PM Page 1



## కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన దద్దాల

### - రూ.25వేలు ఆర్థిక సాయం

**కనిగిరి, నవంబర్ 7, ప్రభాతవార్త**



కనిగిరి మండలం బుడగలేరు గ్రామంలో కలుషిత నీరు కారణంగా అనారోగ్యానికి గురైన విద్యార్థులను కనిగిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం పరామర్శించారు. స్థానిక సర్పంచ్ ఎంపీటీసీ సభ్యులు, గ్రామ నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించిన ఆయన ఇటీవల వాంతులు, విరేచనాలు, కామెర్లు వంటి వ్యాధులతో బాధపడిన విద్యార్థులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. విద్యార్థులకు తగిన జాగ్రత్తలు సూచించిన డాక్టర్ దద్దాల బాధిత పేద విద్యార్థులకు రూ.25వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం గ్రామ వీధుల పరిశుభ్రత, తాగునీటి పరిస్థితులను పరిశీలించి స్థానిక ప్రజాప్రతినిధులకు సూచనలు చేశారు. తదనంతరం గవర్నమెంట్ హైస్కూల్‌ను సందర్శించి స్కూల్ యాజమాన్యంతో మాట్లాడిన ఆయన, విద్యార్థులు తాగే నీరు, తినే ఆహారం నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు ప్రభుత్వం తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత తాగునీటి వసతులు కల్పించడం అత్యవసరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఆవుల భాస్కర్, ఎంపీటీసీ పాపనబోయిన కోటమ్మ, సర్పంచ్ వంగేపురం సరలమ్మ, కటికల వెంకటరత్నం, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, ఉండేల రామిరెడ్డి, కాసుల బాలయ్య, బలసాని భాస్కర్, మర్రిబోయిన తిమ్మయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



## కనిగిరిలో 9న ఆర్యవైశ్య వనభోజన మహోత్సవం

**కనిగిరి, నవంబర్ 7, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణం అర్బన్ కాలనీలోని ఆవుల తిరుపతిరెడ్డి గార్డెన్స్‌ల ఈనెల 9వ తేదీన(ఆదివారం) జరగనున్న ఆర్యవైశ్య వనభోజన మహోత్సవంకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవశ్య వనభోజన మహోత్సవం సమాజ ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని, అన్ని వయస్సుల వారు ఒక చోట చేరి ఆధ్యాత్మికతతో ఆనందోత్సాహాలతో జరుపుకునే ఈ కార్యక్రమం సమాజ బలం పెంచుతుందన్నారు. కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమం పరిశీలనలో కనిగిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేవకి శ్రీనివాసులు, సెక్రటరీ బచ్చు రమేష్, రాచపూటి వెంకటేశ్వర్లు, శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానం మాజీ అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం, అంగులూరి అనిల్ కుమార్, రాచర్ల నరేష్, పాల్వాది జగదీష్, పైడిమర్రి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ వాలంటీర్ కుటుంబాన్ని పరామర్శించిన వైసీపీ ఇన్‌చార్జి దద్దాల

**కనిగిరి, నవంబర్ 7, ప్రభాతవార్త**



కనిగిరి మండలం బడుగులేరు గ్రామానికి చెందిన మాజీ వాలంటీర్ బలసాని రాజశేఖర్ కుమారుడు బలసాని భరత్(8) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం పట్ల కనిగిరి వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సానుభూతి వ్యక్తం చేశారు. శనివారం బాధిత కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలిసిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బాలుడి అకాల మరణం పట్ల విచారం వ్యక్తం చేసిన డాక్టర్ దద్దాల, కుటుంబానికి పార్టీ తరుపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక చిన్నారి కోల్పోవడం ఏ తల్లిదండ్రులకైనా తీరని విషాదం, బాధలో ఉన్న కుటుంబానికి మనమంతా తోడుగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఆవుల భాస్కర్, ఎంపీటీసీ పాపనబోయిన కోటమ్మ, సర్పంచ్ వంగేపురం సరలమ్మ, కటికల వెంకటరత్నం, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, పాపనబోయిన నాగరాజు, కాసుల బాలయ్య, బొబ్బూరి పోలయ్య, బలసాని భాస్కర్, మర్రిబోయిన తిమ్మయ్య, ప్రభుదాసు రెడ్డి చింతలపూడి, రాచగుంట్ల ఆంజనేయులు, మర్రి స్టీవెన్, బత్తుల బాల గురవయ్య, బలసాని యెహోషువ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగంలో స్థిరమైన వ్యాపారానికి కొత్త అవకాశాలు

### - ఉద్యోగాలకు దిక్సూచి ఐడీఎల్ కంప్యూటర్స్

**కనిగిరి, నవంబర్ 7, ప్రభాతవార్త**



ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ సమయం వృధా చేసుకోవడం కంటే, స్వయం ఉపాధి ద్వారా మన భవిష్యత్తును నిర్మించుకోవడం తెలివైన నిర్ణయం. ఈ దిశగా ఐడీఎల్ కంప్యూటర్స్ సంస్థ అందిస్తున్న ఫ్రాంచైజీ అవకాశం నిజంగా ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని సంస్థ డైరక్టర్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. కంప్యూటర్స్, బ్యూటిషన్, టైలరింగ్ వంటి కోర్సులు నేర్పించడానికి శిక్షణ కేంద్రం ప్రారంభించాలనుకునే వారికి ఇది ఒక అద్భుతమైన అవకాశం కేవలం రూ.10వేలు పెట్టుబడితోనే స్వంతంగా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ప్రారంభించవచ్చు. ఈ ఫ్రాంచైజీ ద్వారా నిరుద్యోగ యువత, గృహిణులు, చిన్న వ్యాపారులు తమ ప్రాంతంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి స్థిరమైన ఆదాయం పొందవచ్చు. ఐడియల్ కంప్యూటర్స్ సంస్థ నుండి పూర్తి మార్గదర్శనం, శిక్షణ సాంకేతిక సహాయం అందించబడుతుంది. విద్యా రంగంలో స్థిరమైన వ్యాపారం చేయాలనుకునే వారికి, తమ ప్రతిభను ఉపయోగించి ఇతరులకు నైపుణ్యాలు నేర్పించాలనుకునే వారికి ఇది ఒక అమూల్యమైన అవకాశమని, పూర్తి వివరాలకై 9441126340 నందు సంప్రదించాలని ఆయన కోరారు.

## పట్టపు శీనయ్యకు దళిత సంఘాల ఘన నివాళి

**ఒంగోలు, ప్రభాతవార్త**





ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ గజిటెడ్ ఆఫీసర్స్ సంఘ రాష్ట్ర అధ్యక్షులు పట్టపు శీనయ్య మృతి దళిత బహుజనులకు తీరని లోటని రాష్ట్ర దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు విజయేందర్ బహుజన్ అన్నారు. శుక్రవారం ఒంగోలు సంతపేటలోని దళిత సేన జిల్లా కార్యాలయంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో దళిత సేన జిల్లా అధ్యక్షులు పీకా మధుసూదన్ రావు అధ్యక్షతన సంతాప కార్యక్రమం నిర్వహించారు. పట్టపు శీనయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయేంద్ర బహుజన్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాకు చెందిన పట్టపు శీనయ్య ప్రకాశం జిల్లాకు సెరికల్చర్ ఆఫీసర్‌గా వచ్చి కలెక్టర్ కరికాల వళవన్ ఉన్నప్పుడు జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ ప్రజలకు సౌకర్యార్థంగా ఎస్సీ ఎస్టీ ఇన్ఫర్మేషన్ సెల్ అంబెడ్కర్ భవన్ ఆవరణంలో ఏర్పాటు చేసి సీనయ్యని ఇన్చార్జిగా నియమించారన్నారు. ప్రజల సమస్యలను పరిష్కారం అయ్యే విధంగా ఎంతో కృషి చేశారన్నారు. బాధితులకు ఆర్థిక సహాయాలు కూడా తాను అందించేవాడని, అలాంటి వ్యక్తి సీనయ్య మరణం దళిత బహుజన సమాజానికి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమం అధ్యక్షులు పీకా మధుసూదన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగుల సమస్యలను జిల్లా రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తీవ్రంగా కృషి చేశారని, అలాంటి వ్యక్తి మరణం సమాజానికి తీరని లోటుని అన్నారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ బాపట్ల, ప్రకాశం జిల్లాల ఇన్చార్జి పల తోటి ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ పట్టపు శీనన్న దయచేసి గజిటెడ్ అధికారి అయినప్పటికీ గర్వం లేకుండా సామాన్య దళిత గిరిజన పేద ప్రజలతో మమేకమై పనిచేశాడన్నారు. కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని టీచర్ కు మార్గదర్శకంగా ఉండి తన ఎస్సీ ఎస్టీ ఇన్ఫర్మేషన్ సెల్ కేంద్రం బిటిఎ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించాడన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు ట్టి మాల సంపత్ కుమార్, కాటుకూరి డేవిడ్, గుంతోటి విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం 150వ వసంత ప్రతిజ్ఞ

**అద్దంకి, నవంబర్ 7, ప్రభాతవార్త**



వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం రోజున అద్దంకి పట్టణంలో బిజెపి ఆధ్వర్యంలో 10గంటలకు ఆర్కిడ్ స్కూల్ స్వదేశీ ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అద్దంకి పట్టణ అధ్యక్షుడు కాలేశబాబు విరాట్ అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పర్చూరు శ్రీనివాసరావు, జాగర్లమూడి ఎలమందరావులు పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులచే వందేమాతరం గీతం ఆలపించారు. అదే సమయంలో పిల్లలతో స్వదేశి ప్రతిజ్ఞ చేయించడం వంటి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 9న అద్దంకిలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

*- మంత్రి ఆధ్వర్యంలో నిర్వహణ*

*- జూనియర్ కళాశాల అవరణలో ఉదయం 8గంటలకు ప్రారంభం*

*- 18సంవత్సరాల లోపు పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి*

**అద్దంకి నవంబర్ 7, ప్రభతవార్త**



రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో ఈనెల 9వతేదిన ఉదయం 8గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నారు. శంకర్ కంటి వైద్యశాల, జిల్లా అంథత్వ నివారణ సంస్థ వారు సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్యశిబిరాన్ని నిర్వహిస్తారు. పిల్లలకు, పెద్దలకు, వృద్ధులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు. ఎంపిక చేసిన వారికి కంటిలోపల అద్దం అమర్చే శస్త్రచికిత్స నిర్వహిస్తారు. శస్త్రచికిత్స సమయంలో ఉచిత ప్రమాణం, వుంటుంది. అయితే చికిత్స చేయుంచుకునేవారు కుటుంబసభ్యులను ఒకరిని వెంట తెచ్చుకోవాలి, గుంటూరు పెదకాకానిలోని శంకర్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తారు. గతంలో పరీక్షలు చేయుంచుకున్నా, శస్త్రచికిత్స చేయుంచుకున్న వారు కూడ సంబంధిత రికార్డులను 9వ తేది క్యాంపు వద్దకు తెచ్చుకోవాలని వారు సూచించారు. పిల్లలకు సంబంధించి, 0 నుండి 18 సంవత్సరాల వారికి సాదారణ కంటి సమస్యలు, మెల్లకన్ను, శుక్లము, కంటి నుండి నీరు కారుట, దెబ్బల వలన సంభవించిన నల్లగుడ్డు సమస్యలు, వున్నవారికి ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా వైద్యశిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఓటర్ కార్డుల జిరాక్స్ కాపీ, కుటుంబ సభ్యుల ఫోన్‌నంబరును తప్పని సరిగా వెంట తెచ్చుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ మేరకు శుక్రవారం అద్దంకి పట్టణంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిర బ్రోచర్‌ను టిడిపి నాయకులు ఆవిష్కరించారు. క్లష్టర్ ఇన్‌చార్జిలు కాకాని అశోక్, కుందారాపు రామారావు, పట్టణ పార్టీ అధ్యక్షులు అరిగల శ్రీనివాసరావు, స్వచ్ఛభారత్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు మానం దాసు, పట్టణ నాయకులు లహరి, పూర్ణచంద్రరరావు, బౌజంకు నాగరాజు యర్రాకుల రామాంజనేయులు, సింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అధ్యక్షులు గుంజి శ్రీనివాసరావు, డైరెక్టర్‌లు మద్దా ఆంజనేయులు డాక్టర్ గోపి, ఆకుల కోటేశ్వరరావుతోపాటు పలువురు పట్టణ, మండల నేతలు బ్రోచర్ అవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన వారిలోవున్నారు.

## ప్రమాదకరంగా రేణింగవరం రోడ్డు

### - గోతులు, పగుళ్ళతో పొంచియున్న ప్రమాదం

### - తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతి

**అద్దంకి నవంబర్ 7 ప్రభాతవార్త**



అద్దంకి - రేణింగవరం రోడ్డు ప్రమాదకరంగా వుందని, గోతులు, పగుళ్ళతో ప్రమాదాలు పొంచియున్నాయని పట్టణ ప్రజలు, అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు జార్లపాలెం సమీపంలో లోలెవల్ చప్టాలో సుమారు అడుగు లోతు, వెడల్పుతో గోతులు ఏర్పాడ్డాయని, అదేవిధంగా 20 అడుగుల పొడవున రోడ్డు మధ్యలో పగుళ్లు ఏర్పడ్డాయని వీటితో ప్రమాదం పొంచి వుంది. ద్విచక్ర వాహనాలు, రాత్రి సమయంలో ప్రమాదాలు గురి అవుతున్నాయని, ఇన్నోవా వాహనం చోదకుడు ఈ పగుళ్ళు రోడ్డును గమనించి, వెంటనే బ్రెక్ వేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని త్రిమూర్తులు ప్రభాతవార్త దృష్టికి తెచ్చారు. ఈ విషయమై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



## రాయితీపై గ్రూపులకు డ్రోన్‌లు అందజేత

### - రైతులకు విత్తనాలు పంపిణీ



మండలంలోని పమిడిపాడు, రావినూతల గ్రామాలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి రెండు డ్రోన్ గ్రూపులకు 80 రాయితీపై డ్రోగో డ్రోన్ కంపెనీకి సంబంధించిన కిసాన్ డ్రోన్లు తిరుమల కస్టమ్ హైరింగ్ సెంటర్, పమిడిపాడు శివ గంగ డ్రోన్ కస్టమ్ హైరింగ్ సెంటర్, రావినూతల రైతులకు శుక్రవారం అందజేశారు. కిసాన్ డ్రోన్ పూర్తి ధర రూ.9,80,000/ కాగ రాష్ట్ర ప్రభుత్వం 80శాతం రాయితీ, 7,80,000/ రాయితీ పోను గ్రూప్ కట్టవలసినది 2,00,000/ లక్షల ఈ రోజు ఈ రెండు కిసాన్ డ్రోన్ గ్రూపులకు కిసాన్ డ్రోన్స్ సహాయ వ్యవసాయ సంచాలకులు అద్దంకి ఎఫ్రాయం, మండల వ్యవసాయ అధికారి ఎస్.రామ మోహన్ రెడ్డి లు అందజేశారు. కొరిశపాడు మండలంలోని రైతులు సదరు డ్రోన్ కస్టమ్ హైరింగ్ సెంటర్స్ సర్వీసెస్ పంటలపై పురుగుమందు పిచికారి కొరకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అదే విధంగా పమిడిపాడు గ్రామంలో శనగ పంట సాగు చేసే రైతులకు 25 రాయితీపై శనగ విత్తనాలు సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో రెండు డ్రోన్ గ్రూపులకు సంబంధించి కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ, పిన్నక శ్రీధర్, మామిళ్ళపల్లి హనుమంతరావు, రామినేని శ్రీనివాస్ రావు, రైతులు పాల్గొన్నారు.

## కొంచా వారి వివాహ వేడుకకు హాజరైన వై.విభద్రారెడ్డి

**అద్దంకి నవంబర్ 7, ప్రభాతవార్త**



అద్దంకి పట్టణంలోని వైయస్సార్ అపార్ట్మెంట్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన కొంచా వారి వివాహ వేడుకకు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వైవి భద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట నియోజకవర్గానికి చెందిన వివిధ స్థాయిలలోని వైఎస్ఆర్సిపి నేతలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## పట్టణంలో నేడు విద్యుత్ అంతరాయం

**అద్దంకి నవంబర్ 7 ప్రభాతవార్త ::**

అద్దంకి టౌన్ సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు శనివారం విద్యుత్ టవర్ లైన్స్ కొత్త వైరు ఏర్పాటు చేసే పని నిమిత్తం భవాని సెంటర్ నుండి రాణి పెట్రోల్ బంక్ వరకు రోడ్డుకు తూర్పు వైపున ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎడి దామోదరం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా రవి బార్ అండ్ రెస్టారెంట్ నుండి భవాని సెంటర్ వరకు రోడ్డుకు రెండు వైపులా, భాగ్యనగర్ పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సంస్థకు సహకరించవలసిందిగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం దామోదరం కోరారు.

## జిల్లా స్థాయిలో కొప్పెరపాడు విద్యార్థుల ప్రతిభ

**బల్లికురవ, నవంబర్ 7, ప్రభాతవార్త**




బాపట్ల జిల్లా స్థాయిలో శుక్రవారం జరిగిన స్కిల్ కాంపిటీషన్ పోటీలలో వీఎస్ఎఫ్ఐ విభాగంలో మండలంలోని వి.కొప్పెరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం పొందింది. విశేష ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ఎం.మహిత, ఎం.కీర్తన, బి.విజయలక్ష్మి, సీహెచ్ కావ్య గ్రూపు బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా మెమోంటో అందుకున్నారు. ట్రేడ్ టీచర్ పార్వతి, విద్యార్థులను.. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## వందేమాతరం గేయం ఆలపించిన ఎంపీడీవో

**హనుమంతునిపాడు, నవంబర్ 7, ప్రభాతవార్త**



వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఘనంగా సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రంగ సుబ్బరాయుడు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సిబ్బందితో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అదే విధంగా ఆ గేయానికి ఉన్న చారిత్రాత్మక ప్రాముఖ్యత, దేశభక్తి భావనను సిబ్బందికి వివరించారు.కార్యక్రమంలో ఉమ్మనపల్లి టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు యలనాటి చిన్న కోటయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కటికల వెంకటరత్నం దంపతులు

**హనుమంతునిపాడు, నవంబర్ 7, ప్రభాతవార్త**



మండల పరిధిలోని దాసళ్ళపల్లి గ్రామం గూడూరి లక్ష్మయ్య కుమారుడు వివాహ వేడుకలో వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కటికల వెంకటరత్నం, గుడిపాటిపల్లి గ్రామ సర్పంచ్ కటికల రిబ్కా దంపతులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట ఉమ్మన్నపల్లి సర్పంచ్ కొదమల ప్రసన్న కుమార్, కటికల యాకోబు, గాలిమోటు అనిల్ కుమార్, రాయినూతల యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

### - ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపు

**మార్టూరు, నవంబర్ 7, ప్రభాతవార్త**



ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఈనెల 8వ తేదీ శనివారం ఉదయం 8గంటల నుంచి ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఏలూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్టు, నోవా అగ్రి గ్రూప్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ సంయుక్తంగా శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కంటి పరీక్షలతో పాటు బీపీ, షుగర్, రక్త పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించనున్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఉచిత శస్త్రచికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రజలకు సేవ చేయలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు.

## క్యాన్సర్‌పై అవగాహన

**మార్టూరు, నవంబర్ 7, ప్రభాతవార్త**



మార్టూరు గ్రామంలో గవర్నమెంట్ హాస్పిటల్ నందు జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం గవర్నమెంట్ హాస్పిటల్‌కు వచ్చిన పేషెంట్లు అందరికి మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ గార్గేయ క్యాన్సర్ టెస్టుల ద్వారా ముందుగా తెలుసుకున్నట్లయితే తగ్గించడానికి వీలవుతుంది లేదంటే ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా కూడా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చే పరిస్థితి ఉంది అని విపులంగా క్యాన్సర్ గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మార్టూరు రోటరీ అధ్యక్షులుమాదాల సాంబశివరావు, కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు జాష్టి సాంబశివరావు, రొటేరి యన్స్ మిన్నకంటి సాంబశివరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు, డాక్టర్ విష్ణు తేజ, డాక్టర్ భాను చంద్ర నాయుడు, డాక్టర్ అశోక్ రెడ్డి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, గవర్నమెంట్ హాస్పిటల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు కరణం ఆశీర్వాదం

**బల్లికురవ, నవంబర్ 7, ప్రభాతవార్త**



జీవీఎస్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన వివాహ వేడుకకు చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హాజరై నూతన వదూవరులను ఆశీర్వదించారు. లింగ రామకృష్ణారెడ్డి, సత్యవతిల కుమారుడు అభిజిత్, రియాలకు వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ తదితరులు ఉన్నారు.

## చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌పై అవగాహన

- కలవకూరులో పర్యటించిన ట్రాన్స్‌కో ఈఈ
- చేనేత కార్మికుల ఇల్లు సందర్శన
- ప్రభుత్వ ఉచిత విద్యుత్ పథకం వర్తింపుపై పరిశీలన
- ఉచిత విద్యుత్ లభించని కార్మికులు వెంటనే ధరఖాస్తు చేసుకోవాలి
- ఈఈ చేనేత కార్మికులకు సూచన

**అద్దంకి, నవంబర్ 7, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు విద్యుత్ శాఖ ద్వారా 200 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్‌ను అందజేస్తుంది. ఈ పథకం చేనేత కార్మికులు అందిపుచ్చుకొని లబ్ది పొందుతున్నారా అనే అంశంపై అద్దంకి ట్రాన్స్‌కో ఈఈ నల్లూరి మస్తాన్‌రావు శుక్రవారం ప్రత్యేక పరిశీలన చేశారు. అందులో భాగంగా అద్దంకి మండలంలోని కలవకూరు గ్రామంలో గల చేనేత కార్మికుల గృహాలను, వారి నిర్వహిస్తున్న మగ్గాలను పరిశీలించారు. వారికి ఉచితంగా 200 యూనిట్లు వరకు విద్యుత్ లభిస్తుందా లేదా అనే అంశాన్ని చేనేత కార్మికులను ఈఈ అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఈ పథకం అందుతున్న వారి వివరాలను కూడ ప్రతి కార్మికుని ఇంటికి వెళ్లి తెలుసుకోవడంతోపాటు ఈ పథకం ఎవరికైతే అందడం లేదో వారిని వెంటనే మీసేవా ద్వారా సంబంధిత వివరాలతో ధరఖాస్తు చేసుకోవాలని ఈఈ చేనేత కార్మికులకు సూచించారు. ఈ పరిశీలనలో ఈఈ వెంట డిప్యూటీ ఇంజనీర్ ఎం దామోదరం తోపాటు పలువురు ట్రాన్స్‌కో సిబ్బంది వున్నారు.

## పట్టణంలోని 10వ వార్డులో కుక్కల బెడద

### - చర్యలు తీసుకోవాలని పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వినతి

**అద్దంకి నవంబర్ 7 ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలోని 10వ వార్డు పరిధిలో యూనియన్ బ్యాంకు సమీపంలో శ్రీనగర్ 3వలైన్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఒంటరిగా వచ్చే చిన్నపిల్లలు, మహిళలపై కుక్కల గుంపు దాడి చేస్తున్నాయని మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు కోరారు. ఉదయం 8గంటల ప్రాంతంలో ఆవీధులో నుండివస్తున్న మహిళపై కుక్కలు దాడి చేయడంతో రాళ్ళు, కర్రలతో కుక్కలను తరిమివేయడం జరిగిందని, రిటైర్డు బ్యాంకు ఉద్యోగి బుద్దీష్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు తాళ్ళూరి బాబురావు తెలిపారని ఆయన వివరించారు. వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఈ విషయంపై బాబురావు వినతి పత్రం అందించారని దీనిపై అధికారులు స్పందించాలని మన్నం పేర్కొన్నారు.

8-11Pg5 9_8-11Pg5.qxd 07/Nov/25 10:27 PM Page 1





# మీరు ప్రశాంతంగా రిటైర్ కాలేరు

**- బీహార్ ఎన్నికల సభలో సిఇసిపై ప్రియాంక గాంధీ హెచ్చరికలు**

**పాట్నా, నవంబరు 7:** ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ నేరుగా కేంద్ర ఎన్నికల సంఘంను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. సిఇసి జ్ఞానేష్ కుమార్ పేరు ప్రస్తావిస్తూ, మీరు ప్రశాంతంగా పదవీ విరమణ చేయలేరంటూ హెచ్చరికలు చేశారు. రీగాలో శుక్రవారం ఎన్నికల సభలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ... "జ్ఞానేశ్ కుమార్.. మీరు ప్రశాంతంగా రిటైర్ అవుతారని అనుకుంటున్నారేమో.. అది జరగదు. జ్ఞానేశ్ కుమార్ పేరును మరిచిపోవద్దని ప్రజలకు చెప్పదలచుకున్నా"ను అని అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు ఇసిలు ఎస్ఎస్ సంధు, వివేక్ జోషి పేర్లను కూడా గుర్తుపెట్టుకోవాలని ప్రియాంకగాంధీ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా "చోర్ చోర్" అంటూ ప్రియాంక మద్దతుదారులు నినాదాలు చేయడం కనిపించింది. హర్యానా ఎన్నికల్లో ఓట్ల అవకతవకలకు పాల్పడ్డారని, ప్రజలు తమకు జరిగిన మోసాన్ని మరిచిపోరని ప్రియాంక అన్నారు. ఇందులో ప్రమేయమున్న జ్ఞానేశ్ కుమార్, ఎస్ఎస్ సంధు, వివేక్ జోషిలు ప్రశాంతంగా రిటైర్ అవుతామని అనుకుంటే పొరపడినట్టేనని పేర్కొన్నారు. కాగా, ప్రియాంక గాంధీ వ్యాఖ్యలపై రాజకీయ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రక్రియ జరుగుతుండగా ఎన్నికల అధికారులను బెదిరించడంలో ఔచిత్యాన్ని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ ప్రసంగాల పరిధి ఏమేరకు ఉండవచ్చనే దానిపై రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

# బీహార్‌లో ఎన్డీయె గెలుపు ఖాయం

**- మా ట్రాక్ రికార్డును నమ్మే రికార్డు స్థాయి పోలింగ్, - ఆర్‌జెడి, కాంగ్రెస్ పాలనలో రెడ్ టెర్రర్, - ఎన్‌డిఎ వచ్చాకే నక్సల్ హింసాకాండకు విముక్తి, - ఔరంగాబాద్ ఎన్నికల సభలో ప్రధాని మోడీ**

**పాట్నా, నవంబర్ 7:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రస్తావిస్తూ, ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఓటరుకు ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలోని ఎన్‌డిఎ డబుల్ ఇంజినీర్డ్ ప్రభుత్వంపై ప్రజలలో పెరుగుతున్న విశ్వాసం, నమ్మకానికి నిదర్శనమన్నారు. అలాగే తనకు, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఉన్న ట్రాక్ రికార్డు, తమ పట్ల ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ) అఖండ విజయం సాధిస్తుందని మోడీ ధీమా వ్యక్తం చేశారు. ఔరంగాబాద్‌లో శుక్రవారం ఎన్నికల సభలో ప్రధాని మాట్లాడుతూ... "బీహార్ ప్రజలు అన్ని రికార్డులను బద్దలు కొట్టారు. స్వాతంత్రనయం తర్వాత రాష్ట్రంలో ఇది అతిపెద్ద పోలింగ్ శాతం. మొదటి దశలో దాదాపు 65శాతం ఓటింగ్ జరిగింది. బీహార్ యువత, రైతులు, మహిళలు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏను ఆశీర్వదిచడానికి వస్తున్నారని ఇది చూపిస్తుంది" అని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ఓటర్లు తరలి వచ్చినందుకు భారత ఎన్నికల కమిషన్‌ను ప్రశంసించారు. ఆర్‌జెడి- కాంగ్రెస్ పాలనలో ఈ ప్రాంతంలో జరిగిన రెడ్ టెర్రర్ భయానకతను గుర్తు చేస్తూ, ఔరంగాబాద్ చాలాకాలంగా నక్సల్ హింసాకాండ ఎదురొనకందని, నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం హయాంలోనే హింసాకాండ నుండి విముక్తి పొందిందని ప్రధాని మోడీ అన్నారు. "మోడీ- నితీశ్ ట్రాక్ రికార్డు ప్రజల ముందుంది. తాము ఏదైతే చెప్పానో అదే చేశా. రామాలయం నిర్మిస్తామన్నాం. అది జరిగిందా లేదా? 370వ అధికరణ కుప్పకూలుతుందని చెప్పాం. అది సాకార మైందా లేదా?" అని మోడీ ప్రశ్నించారు. నితీష్ కుమార్ సీఎంగా ఉన్న మొదటి తొమ్మిదేళ్లు కేంద్రం లోని కాంగ్రెస్- ఆర్‌జెడి ప్రభు త్వం ఆయనను పనిచేయనీయలేదని, 2014లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత బీహార్ అభివృద్ధి కోసం మూడు రెట్లు అధికంగా నిధులు కేటాయించా మని వివరించారు. మహాకూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్‌జెడి ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సైతం విశ్వసించడం లేదని అన్నారు. కాంగ్రెస్ బిహార్ అధ్యక్షుడిని ఆర్‌జెడి అవమానించిందని చెప్పారు. గత 35-40 ఏళ్లుగా ఎప్పుడూ గెలవని సీట్లను మాత్రమే కాంగ్రెస్‌కు ఆర్‌జెడి ఇచ్చిందన్నారు. పలుచోట్లు రెండు పార్టీలు ఒకరిపై మరొకరు పోటీ చేస్తున్నాయని, సొంత సహచరులను నమ్మని వారు ఎవరికైనా ఎలా మేలు చేస్తారని ప్రధాని ప్రశ్నించారు. ఎన్‌డిఎ మేనిఫెస్టోను ప్రజలు విశ్వ సించారని, రాష్ట్రంలో లక్షలాది రిక్రూట్‌మెంట్లు తాము జరపడమే ఇందుకు కారణమని చెప్పారు. ఆర్‌జెడి, కాంగ్రెస్ ట్రాక్ రికార్డు ఏమిటో ప్రజలకు బాగా తెలుసునని, భూములకు ఉద్యోగాలిచ్చారన్నారు.



# టిఎంసి ఎంపికి తప్పని సైబర్ మోసం

**బ్యాంక్ ఖాతానుంచి రూ.50 లక్షలు స్వాహా**

**న్యూఢిల్లీ, నవంబరు 7:** దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. సొమ్ము కాజేసేందుకు నేరగాళ్లు కొత్త కొత్త దారులను వెతుక్కుంటున్నారు. సామాన్యులతోపాటూ సెలబ్రిటీలు కూడీ వీరి ఉచ్చులో పడి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. తాజాగా ఓ ఎంపీ సైబర్ మోసానికి బలయ్యారు. ఆయన బ్యాంక్ అకౌంట్ నుంచి నేరగాళ్లు ఏకంగా రూ.50లక్షలు వరకూ కాజేశారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, నాలుగుసార్లు లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సైబర్ మోసానికి బలయ్యారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎంపీ ఖాతాను సైబర్ నేరగాళ్లు నకిలీ పత్రాలను ఉపయోగించి యాక్సెస్ చేశారు. నకిలీ పాన్, ఆధార్ కార్డులను ఉపయోగించి మోసానికి పాల్పడ్డారు. అకౌంట్ నుంచి ఏకంగా రూ.56లక్షలు కాజేశారు. ఈ సొమ్మును వివిధ ఖాతాలకు తరలించడం, ఏటీఎమ్ ద్వారా విత్‌డ్రా చేయడంతోపాటూ ఆభరణాల కొనుగోళ్లకు ఉపయోగించినట్లు తేలింది.



# భారత్‌నుంచి వచ్చిన ఫోన్‌కాలే ప్రాణాలు కాపాడింది!: షేక్ హసీనా

**ఢాకా, నవంబర్ 7:** బంగ్లాదేశ్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అల్లర్లలో ముష్కరుల దాడి నుంచి కేవలం 20 నిమిషాల వ్యవధిలో ఆమె తప్పించుకుని సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు. ఆమె అక్కడి నుంచి తప్పించుకోవడానికి భారత్ నుంచి వచ్చిన ఫోన్ కాల్ కారణమని తెలుస్తోంది. ఆమె ప్రాణాలను కాపాడింది భారత్ నుంచి వచ్చిన ఫోన్ కాలేనని తెలియజేస్తూ ఒక పుస్తకం త్వరలో విడుదల కానుంది. ది స్టోరీ ఆఫ్ ఆన్ అన్‌ఫినిష్డ్ రెవెల్యూషన్ అనే పేరుతో రానున్న ఈ పుస్తకంలో పలు ఆసక్తికర విషయాలను పొందు పరిచారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఆ నిరసనల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితులు తీవ్ర హింసాత్మకంగా మారడంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి, దేశం విడిచి భారత్‌కు వచ్చారు. ఆమె అధికారిక భవనం గణభవన్ నుండి బయటకు వచ్చిన సరిగ్గా 20 నిమిషాలకు నిరసనకారులు అక్కడకు చొచ్చుకువచ్చారు. వారు రావడానికి ముందే ఆమె సురక్షితంగా బయటపడ్డారు. పరిస్థితులు అదుపు తప్పుతున్నప్పటికీ, తాను బంగ్లాదేశ్‌ను విడిచి వెళ్లబోనని షేక్ హసీనా కరాఖండీగా చెప్పినట్లు ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆమెను బంగ్లాదేశ్ విడిచి వెళ్లేందుకు ఒప్పించాలని సోదరి రెహానా, అమెరికాలో ఉంటున్న ఆమె కుమారుడు వాజీద్‌కు బంగ్లా ఆర్మీ చీఫ్, ఎయిర్ ఫోర్స్, నేవీ చీఫ్‌లు సూచించినట్లు సమాచారం. నిరసనకారులు గణభవన్ వైపుకు దూసుకొస్తున్న సమయంలో హసీనా ప్రయాణించే విమానానికి తమ గగనతలంలోకి ప్రవేశించేందుకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది ఆ పుస్తకంలో పేర్కొన్న వివరాల ప్రకారం, 2024 ఆగస్టు 4న మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు భారత్ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని, ఆ ఫోన్ చేసింది హసీనాతో బాగా పరిచయమున్న ఒక ఉన్నతాధికారి అని తెలుస్తోంది. ఆ సంభాషణ చాలా క్లుప్తంగా ముగిసింది. ఇప్పటికే చాలా ఆలస్యమైందని, వెంటనే గణభవన్‌ను వీడకపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆ అధికారి హసీనాను అప్రమత్తం చేశారని, భవిష్యత్తులో పోరాటం చేయడానికి ప్రాణాలతో ఉండటం ముఖ్యమని సూచించారని ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆ మాటలకు షాక్ తిన్న హసీనా, బంగ్లాదేశ్‌ను వీడాలని నిర్ణయం తీసుకోవడానికి ఆ తర్వాత కూడా అరగంట సమయం తీసుకున్నారని ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆ సందేశాన్ని పూర్తిగా విశ్వసించిన ఆమె, దేశం విడిచి వెళ్ళే ముందు తన ప్రసంగాన్ని రికార్డు చేయాలని భావించారని వెల్లడించారు. అయితే, ముష్కరులు ఏ క్షణమైనా లోపలకి చొచ్చుకు వచ్చే అవకాశం ఉండటంతో సైన్యాధికారులు ప్రసంగం రికార్డు చేయడానికి అంగీకరించలేదు. అనంతరం సోదరి రెహానా హసీనాను బలవంతంగా కారులో కూర్చోబెట్టారు. మధ్యాహ్నం 2.33 గంటల సమయంలో చాపర్ బంగ్లాదేశ్‌లో టేకాఫ్ అయి అరగంటలో భారత్‌లో దిగిందని, అప్పటి నుంచి ఢిల్లీలో ఆమెకు భారత ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని ఆ పుస్తకం పేర్కొంది. ఆ రోజు భారత్ నుంచి ఫోన్ కాల్ రాకపోతే తన తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్‌లాగే హసీనా కూడా హత్యకు గురయ్యేవారని ఆ పుస్తకంలో ఆందోళన వ్యక్తం చేశారు.

# అహ్మదాబాద్ ప్రమాదంలో పైలట్ ఇన్ కమాండ్‌ను నిందించలేం

**పిటిషన్ విచారణలో సుప్రీం సంచలన వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, నవంబరు 7:** అహ్మదాబాద్‌లో 260 మంది ప్రాణాలను బలిగొన్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనలో పైలట్‌ఇన్‌కమాండ్‌ను నిందించలేమని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనకు సంబంధించి పైలట్ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం, కేంద్ర ప్రభుత్వం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)లకు నోటీసులు జారీ చేసింది. ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానానికి పైలట్‌ఇన్‌కమాండ్‌గా పనిచేసిన సుమీత్ సబర్వాల్ ఈ ప్రమాదంలో మరణించారు. ఆయన తండ్రి పుష్కరాజ్ సబర్వాల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్ఐపీ) ఈ ఘటనపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ఈ ఏడాది జులైలో విడుదల చేసిన ప్రాథమిక నివేదికను వారు తమ పిటిషన్‌లో సవాల్ చేశారు. విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోయిందని ఏఏఐబీ తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. రెండు ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌లు ఒకదాని తర్వాత ఒకటి వేగంగా "కటాఫ్" పొజిషన్‌లోకి వెళ్లాయని తెలిపింది. సుమారు 10 సెకన్ల తర్వాత స్విచ్‌లను తిరిగి ఆన్ చేసినప్పటికీ, అప్పటికే ఇంజిన్లు ఆగిపోయి (ఫ్లేమ్డ్ అవుట్) విమానం కుప్పకూలిందని నివేదికలో వివరించింది. ఈ నివేదికతో విభేదిస్తూ పైలట్ తండ్రి, పైలట్ల సంఘం దాఖలు చేసిన పిటిషన్లను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు, పైలట్‌ను నిందించలేమని వ్యాఖ్యానిస్తూ కేంద్రం, డీజీసీఏల నుంచి వివరణ కోరింది. ఈ కేసులో తదుపరి విచారణ జరగనుంది.

# వెనిజులాపై కమ్ముకుంటున్న అమెరికా యుద్ధమేఘాలు!

**కారకాస్, నవంబరు 7:** అమెరికా, వెనిజులా మధ్య ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. నిన్న రెండు అమెరికా ఎఫ్52 బాంబర్లు కరేబియన్ సముద్రంలో వెనిజులా తీరం వెంబడి ప్రయాణించాయి. అమెరికా సైనిక విమానాలు ఈ ప్రాంతంలో శక్తి ప్రదర్శన చేయడం ఇది నాలుగోసారి కాగాఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న వైరాన్ని మరింత పెంచింది. విమాన కదలికలను ట్రాక్ చేసే వెబ్‌సైట్ ఫ్లైట్ రాడార్ 24 డేటా ప్రకారం, ఈ రెండు బాంబర్లు వెనిజులా తీరానికి సమాంతరంగా ప్రయాణించాయి. ఆ తర్వాత రాజధాని కరాకస్‌కు ఈశాన్య దిశలో కాసేపు చక్కర్లు కొట్టి, తిరిగి తీరం వెంబడి ప్రయాణిస్తూ ఉత్తర దిశగా సముద్రంలోకి వెళ్లిపోయాయి. అక్టోబర్ మధ్య నుంచి అమెరికా సైనిక విమానాలు వెనిజులా సమీపంలో ప్రయాణించడం ఇది నాలుగోసారి. గతంలో ఒకసారి ఎఫ్52, రెండుసార్లు బి1బిబాంబర్లు ఇలాంటి విన్యాసాలు చేశాయి. ఈ ప్రాంతంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు సైనిక చర్యలు చేపడుతున్నామని వాషింగ్టన్ చెబుతోంది. ఇందులో భాగంగానే యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ యుద్ధనౌక బృందాన్ని లాటిన్ అమెరికాకు పంపింది. ప్యూర్టోరికోలో ఎఫ్35 స్టెల్త్ యుద్ధ విమానాలను, కరేబియన్ సముద్రంలో ఆరు నౌకాదళ నౌకలను మోహరించింది. సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు డ్రగ్స్ రవాణా చేస్తున్నాయనే ఆరోపణలతో 17 నౌకలపై దాడులు చేశామని, ఈ దాడుల్లో 67 మంది మరణించారని అమెరికా పేర్కొంది. అయితే, లక్ష్యంగా చేసుకున్న నౌకలు మాదకద్రవ్యాల రవాణాకు ఉపయోగించబడ్డాయని గానీ, అవి దేశానికి ముప్పుగా పరిణమించాయని గానీ అమెరికా ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలను విడుదల చేయలేదు. ఈ సైనిక కదలికలు, దాడులతో ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. డ్రగ్స్ నిరోధం అనేది కేవలం ఒక సాకు మాత్రమేనని, అధ్యక్షుడు నికోలస్ మాదూరో ప్రభుత్వాన్ని కూలదోయడానికే వాషింగ్టన్ కుట్ర పన్నుతోందని వెనిజులా తీవ్రంగా ఆరోపిస్తోంది.

# సంక్షిప్తంగా..

## శబరిమలకు 60 ప్రత్యేక రైళ్లు



**తిరువనంతపురం, నవంబర్ 7:** శబరిమల వెళ్లే భక్తులకు శుభవార్త. భక్తుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల మీదుగా శబరిమలకు మొత్తం 60 ప్రత్యేక రైళ్లు నడుపు తున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లు నవంబర్, డిసెంబర్, జనవరిలోని పలు తేదీల్లో సర్వీసు లందించనున్నాయి. చర్లపల్లి, కొల్లం, చర్లపల్లి ప్రత్యేక రైళ్లు పగిడిపల్లి, గుంటూరు, గూడూరు, రేణిగుంట మీదుగా మొత్తం 20 సర్వీసులందించనున్నాయి. నర్సాపూర్ - కొల్లం - నర్సాపూర్ రైళ్లు విజయవాడ, గూడూరు, రేణిగుంట మీదుగా 20 సర్వీసులు అందించనున్నాయి. మచిలీపట్నం - కొల్లం - మచిలీపట్నం రైలు గూడూరు, రేణిగుంట మీదుగా 10 సర్వీసులు అందిస్తాయి. మచిలీపట్నం - కొల్లం - మచిలీపట్నం రైళ్లు గుంటూరు, నంద్యాల, కడప, రేణిగుంట మీదుగా 10 సర్వీసులందిస్తాయి.

## 15 యేళ్లనాటి హత్యకేసులో భర్త అరెస్టు!



**న్యూఢిల్లీ, నవంబరు 7:** దాదాపు 15 ఏళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసు మిస్టరీని ఢిల్లీ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. భార్యను హత్య చేసి, అది ఆత్మహత్యగా చిత్రీకరించి పరారైన భర్తను గుజరాత్‌లో అరెస్ట్ చేశారు. నిందితుడు నరోత్తమ్ ప్రసాద్‌ను ఢిల్లీకి తరలించి, తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. 2010 మే 31న ఢిల్లీలోని జహంగీర్‌పురి ప్రాంతంలోని ఒక ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఇంటి తలుపులు పగలగొట్టి చూడగా, 25 ఏళ్ల మహిళ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో నేలపై పడి ఉంది. సంఘటనా స్థలంలో ఒక సూసైడ్ నోట్ కూడా లభించింది. విచారణ ప్రారంభించిన పోలీసులకు మృతురాలి భర్త నరోత్తమ్ ప్రసాద్‌పై అనుమానం కలిగింది. అప్పటికే అతను పరారీలో ఉండటంతో అనుమానం బలపడింది. దీంతో పోలీసులు అతడిని నిందితుడిగా ప్రకటించి, అతడి ఆచూకీ తెలిపిన వారికి రూ.10,000 రివార్డు కూడా ప్రకటించారు.

## సైనిక్ స్కూల్‌లో ర్యాగింగ్



**గాంధీనగర్, నవంబర్ 7:** ఒక సైనిక్ స్కూల్‌లో జూనియర్లపై సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. బలవంతంగా శిక్షించడంతో పాటు కర్రతో వారిని కొట్టారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. గుజరాత్‌లోని బాలచాడి సైనిక స్కూల్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక సీనియర్ విద్యార్థి టవల్ ఉన్నాడు. జూనియర్ స్టూడెంట్స్‌ను అతడు వేధించాడు. పుష్ అప్‌లు తీయమని బలవంతం చేశాడు. ఆ పొజిషన్‌లో ఉన్నవారిని వరుసగా కర్రతో కొట్టాడు. దీంతో కొందరు జూనియర్లు బాధతో అల్లాడిపోయారు. కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# సుఖోయ్ తయారీ పరిజ్ఞానం మొత్తం బదలీకి రష్యా సుముఖం

# ఇక భారత్‌లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్‌లోనే జెట్‌ల తయారీ




**మాస్కో, నవంబరు 7:** భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని చేరుకోబోతోంది. రష్యాకు చెందిన అత్యాధునిక ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ ఎస్‌యు57 (సుఖోయ్57)ను భారీ ఎత్తున ఉత్పత్తి చేసే సామర్థ్యం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు ఉందని రష్యా టెక్నికల్ బృందం నిర్ధారించింది. కేవలం ఉత్పత్తికి అనుమతి ఇవ్వడమే కాకుండా, సోర్స్ కోడ్‌లు సహా పూర్తి టెక్నాలజీని బదిలీ చేయడానికి కూడా రష్యా ముందుకొచ్చింది. ఈ ఒప్పందం ఖరారైతే, ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాల్లో ఒకటైన ఎస్‌యు57 ఇకపై భారత్‌లోనే తయారు కానుంది. సుఖోయ్ డిజైన్ బ్యూరో, ఇతర రక్షణ సంస్థలతో కూడిన రష్యా బృందం సెప్టెంబర్ నెలలో హెచ్ఏఎల్ సౌకర్యాలను సందర్శించింది. ఎస్‌యూ57ఈ యుద్ధ విమానాల దేశీయ ఉత్పత్తికి అవసరమైన మౌలిక సదుపాయాల్లో దాదాపు 50 శాతం ఇప్పటికే హెచ్ఏఎల్ వద్ద ఉన్నాయని ఈ బృందం తన నివేదికలో స్పష్టం చేసింది. హెచ్ఏఎల్ సుమారు 505 స్టెల్త్ జెట్లను తయారుచేయగలదని నివేదికలో పేర్కొన్నది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఢిల్లీ పర్యటనకు కొద్ది రోజుల ముందు ఈ నివేదికను సమర్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పుతిన్ పర్యటనలోనే ఈ కీలక ఒప్పందంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు. గతంలో సుఖోయ్‌ఎస్‌యు30 ఫైటర్ జెట్లను భారత్‌లో విజయవంతంగా ఉత్పత్తి చేసిన అనుభవం హెచ్ఏఎల్‌కు ఉంది. 2000 సంవత్సరంలో కుదిరిన ఒప్పందం మేరకు ఈ జెట్లను హెచ్ఏఎల్ తయారు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే రష్యా బృందం బెంగళూరు, నాసిక్, కోరాపుట్‌లోని హెచ్ఏఎల్ యూనిట్లను సందర్శించి, ఇక్కడి తయారీ సామర్థ్యాలను, సాంకేతిక సంసిద్ధతను అంచనా వేసింది. రష్యా నివేదిక నేపథ్యంలో, పెట్టుబడులు పెట్టాల్సిన కీలక రంగాలను గుర్తిస్తూ హెచ్ఏఎల్ కూడా ఒక అంతర్గత నివేదికను సిద్ధం చేస్తోంది. అత్యాధునిక కాంపోజిట్ మెటీరియల్స్, రాడార్‌ను తప్పించుకునే కోటింగ్స్, డిజిటల్ డిజైన్, నెక్స్ట్ జనరేషన్ ఇంజిన్ టెస్ట్ బెడ్స్ వంటి వాటిపై దృష్టి సారించనుంది. ఎస్‌యు57ని జెట్ల సంయుక్త ఉత్పత్తి భారత వైమానిక దళాన్ని గణనీయంగా బలోపేతం చేస్తుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తగ్గుతున్న ఫైటర్ జెట్ల స్క్వాడ్రన్ల సమస్యను అధిగమించడంతో పాటు, ప్రపంచ ఏరోస్పేస్ రంగంలో భారత్ స్థాయిని ఇది మరింత పెంచుతుంది. దేశీయంగా అభివృద్ధి చేస్తున్న ఐదో తరం ఫైటర్ జెట్ ప్రోగ్రామ్‌కు కూడా ఈ ప్రాజెక్ట్ అదనపు బలాన్ని ఇస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# నాన్సీపెలోసీ రిటైర్‌మెంట్‌ప్రకటించి అమెరికాకు ఎంతో మేలుచేసారు: ట్రంప్



**వాషింగ్టన్, నవంబరు 7:** చట్టసభలో స్పీకర్‌గా పనిచేసిన నాన్సీ పెలోసీ తాను ఇక రాజకీయాలనుంచి రిటైర్ అవుతానని ప్రకటించడంతో డొనాల్డ్‌ట్రంప్ ఛలోక్తులు వేస్తూ ఆమెచాలా చెడ్డనేత అని అవినీతిపరు రాలంటూ ఆమె పోవడం వల్ల అమెరికాకు ఎంతోమేలు జరిగిందని వ్యాఖ్యలుచేసారు. నాన్సీ పెలోసీ తాను ఇక రిటైర్ కావాలనుకుంటున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ట్రంప్ ఆమెపై ఉన్న వ్యతిరేకతను మొత్తం వెళ్లగక్కారు. దేశానికి చెడుజరిగే అంశాలపైనే నాన్సీ ఫోకస్‌పెట్టారని, ఆమె అవినీతి పరురాలని, ఎంతో చెడ్డపనులుచేసే మహిళ అని ఆమె రిటైర్‌కావడం అమెరికాకు ఎంతోమేలు జరిగిందని వ్యంగ్యోక్తులు విసిరారు. దేశప్రతిష్టను ఎంతో దెబ్బతీసారని, ఆమె రిటైర్ అవుతూ దేశానికి ఎంతో మేలుచేసారని వైట్‌హౌస్‌లో మీడియాతోమాట్లాడుతూ వ్యాఖ్యలుచేసారు. అమెరికా ప్రతినిధుల సభకు మళ్లీఎన్నికకావాలని కోరుకోవడంలేదని నాన్సిపెలోసీ ప్రకటించారు. శాన్‌ఫ్రాన్సిస్కోకు 40 ఏళ్లపాటు ప్రాతినిద్యం వహించిన ఆమె గురువారం తాజాగా తన రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని ప్రకటించారు. స్పీకర్ కార్యాలయంలో తన చివరి ఏడాది పూర్తి చేసానని ఆమెచెపుతూ తాను శాన్‌ఫ్రాన్సిస్కోను ఎంతోప్రేమించానని, చరిత్ర సృష్టించానని ఆమె పేర్కొన్నారు. ప్రగతిపథంలోనే నడిచామని ఆమె చెప్పారు.

# యువకుడిపై దాడి, నాలికతో కాళ్లు నాకించిన వైనం



**సూరత్, నవంబరు 7:** గుజరాత్‌లోని సూరత్ నగరంలో మానవత్వం సిగ్గుపడే ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ఓ యువకుడిని దారుణంగా కొట్టి, కత్తితో బెదిరించి, బలవంతంగా కాళ్లు నాకించారు. ఈ పైశాచిక చర్యను నిందితుడే స్వయంగా తన ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం గమనార్హం. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ కావడంతో ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన సుధీర్ పాండే అనే యువకుడు ఉపాధి కోసం సూరత్‌కు వచ్చి అమ్రోలి ప్రాంతంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. అక్కడే ఈ దాడి జరిగింది. దాడికి పాల్పడిన వ్యక్తిని బాధితుడు "భోలా భాయ్" అని పిలుస్తున్నట్లు వీడియోలో వినిపిస్తోంది. నిందితుడు కత్తి చూపించి సుధీర్‌ను బెదిరిస్తూ తీవ్రంగా కొట్టాడు. 'భోలా భాయ్, నన్ను క్షమించు. నేను ఇకపై ఎప్పుడూ సూరత్‌కు తిరిగి రాను' అని బాధితుడు వేడుకుంటున్న దృశ్యాలు వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# బంగారు, వెండి బల్లుల తాపడాలు మారలేదు : స్పందించిన కంచి ఆలయం



**చెన్నై, నవంబరు 7:** తమిళనాడులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో బల్లుల విగ్రహాలకు ఉన్న తాపడాలను మార్చినట్లు ఫిర్యాదు అందడం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఆలయ మేనేజ్‌మెంట్ స్పందిస్తూ ఆరోపణలను తోసిపుచ్చింది. ఆ విగ్రహాల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. 'ఆలయంలోని బంగారు, వెండి బల్లుల విగ్రహాలు సీలింగ్‌కు అలాగే ఉన్నాయి. వాటిని తొలగించడం గానీ, తాపడాలను మార్చడం గానీ చేయలేదు. దీనిపై ఆలయాల ఉద్యమకారుడు తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం' అని ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి శుక్రవారం వెల్లడించారు. కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో ప్రస్తుతం పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆలయంలోని పురాతన బంగారు, వెండి బల్లుల తాపడాలను మార్చేసి వాటి స్థానంలో కొత్త తాపడాలను ఏర్పాటు చేశారని శ్రీరంగానికి చెందిన రంగరాజ నరసింహ ఫిర్యాదు చేశారు. దీంతో విగ్రహాల అక్రమ తరలింపు నిషేధ విభాగం పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆలయ ఇఒ రాజ్యలక్ష్మిని పోలీసులు 8 గంటలపాటు విచారించారు. ఆలయంలోని ఇతర సిబ్బందిని కూడా ప్రశ్నించారు.

ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. అవసరమైనప్పుడు విచారణకు రావాలని ఆయల ఇఒ, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిసింది. 108 దివ్య క్షేత్రాల్లో ఒకటైన కాంచీపురంలోని ఈ ప్రసిద్ధ వరదరాజస్వామి ఆలయంలో బంగారు, వెండి బల్లులు విశిష్టమైనవి. నిత్యం ఈ ఆలయాన్ని దేశం నలుమూలల ఉంచి వచ్చే భక్తులు దర్శించుకుంటారు. ఇక్కడి బంగారు, వెండి బల్లులను తాకితే దోషనివారణ జరుగుతుందని నమ్మకం.

8-11pg6exHMNWJQE 10_8-11pg6exHMNWJQE.qxd 07/Nov/25 10:30 PM Page 1



### అమరావతిలో రూ.212 కోట్లతో

# గవర్నర్ బంగ్లా నిర్మాణం

### టెండర్లు పిలిచిన ఏపిసిఆర్‌డిఏ

రాజంపేట, నవంబరు 7 ప్రభాతవార్త: రాజధాని అమరావతిలో రాష్ట్ర గవర్నర్‌కు బంగ్లా, ఉద్యోగులు అతిథి గృహాలు, ఇతర పనులు చేపట్టేందుకు రూ.212.22 కోట్ల అంచనా వ్యయంతో పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎపి సిఆర్‌డిఏ టెండర్లను శుక్రవారం ఆహ్వానించింది. అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్ పరిధిలోనే గవర్నర్ రెసిడెన్స్ కాంప్లెక్స్ నిర్మిస్తారు. అసెంబ్లీ దర్బార్ హాల్, రెండు అతిథి గృహాలు, సిబ్బందికి 68 క్వార్టర్లు నిర్మిస్తారు.144 మందికి అకామిడేషన్ కల్పించేలా బరాక్స్ నిర్మిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలోనే గవర్నర్ రెసిడెన్సీ కాంప్లెక్స్ చేపడతారు. టెండర్లో పాల్గొనేందుకు ఈనెల 20 వరకు గడువుగా నిర్ణయించారు. ఇదే రోజున టెక్నికల్ బిడ్ కూడా ఓపెన్ చేసి గుత్తేదారును ఖరారు చేస్తారు.

### తహసీల్దార్లు, ఆర్డీవోలు, డీఆర్వోలకు

# టోల్ ఫీజు మినహాయింపు ఇవ్వండి

### - మోర్త్ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని జాతీయ రహదారులు మీదుగా ప్రయాణించే తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు (ఆర్డీఓ కేడర్), స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు (డీఆర్వో కేడర్) తదితర అధికారుల వాహనాలకు టోల్ ఫీజుల నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అధికారిక కార్యక్రమాల కోసం ప్రయాణించే ఆయా అధికారుల సొంత, అద్దె వాహనాలకు వారి వద్ద ఉన్న ప్రభుత్వ గుర్తింపు కార్డు చూసి టోల్‌ఫీజు వసూలు చేయకుండా మినహాయించాలని కోరింది. ఈ మేరకు ఆర్‌అండ్‌బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) కార్యదర్శికి లేఖ రాశారు. ఈ అధికారుల వాహనాలకు టోల్ ఫీజు తీసుకోకుండా చూడాలంటూ ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. దీంతో ఆర్‌అండ్‌బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మోర్త్‌కు లేఖ రాశారు. ఆయా అధికారులంతా ఎన్నికలు, జనాభా లెక్కలు, ప్రకృతి విపత్తులు, జాతీయ రహదారులకు భూసేకరణ విధుల కోసం, ప్రభుత్వం నిర్వహించే రాష్ట్ర, ప్రాంతీయ, జిల్లా స్థాయి సమావేశాలకు వివిధ కోర్టుల్లో కేసుల నిమిత్తం హాజరయ్యేందుకు జాతీయ రహదారులపై ప్రయాణిస్తుంటారని, వీరికి టోల్ ఫీజు నుంచి మినహాయించేలా జాతీయ రహదారుల అధికారులకు తగిన ఆదేశాలివ్వాలని లేఖలో కోరారు.

# ఆ గోడ కూల్చేందుకు

# రూ.32 లక్షలు చెల్లించండి

### - విజయసాయిరెడ్డి కుమార్తెకు హైకోర్టు ఆదేశం

విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: భీమిలి బీచ్‌కు సమీపంలో సిఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన కాంక్రీట్ గోడలో ఇప్పటికే కొంతభాగాన్ని కూల్చేయగా, మిగిలింది కూడా కూల్చేందుకు రూ.31.97 లక్షలు 2 వారాల్లో జీవీఎంసీకి జమ చేయాలని వైఎస్సార్సీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డిని, అవ్యాన్ రియల్టర్స్ కంపెనీని హైకోర్టు ఆదేశించింది. కాంక్రీట్ గోడ నిర్మించి పర్యావరణానికి నష్టం చేసినందుకు రూ.17.46 కోట్లు చెల్లించాలని కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ (ఎంఒఇఎఫ్) నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికపై అభ్యంతరాలు తెలిపేందుకు 2 వారాల సమయం ఇచ్చింది. ఎంఒఇఎఫ్ తుది నిర్ణయంపై అభ్యంతరం ఉంటే తగిన వేదికలో సవాలు చేసుకునేందుకు నేహారెడ్డికి, ఆమె కంపెనీకి అవకాశం ఇచ్చింది. మరోవైపు షోకాజ్ నోటీసులకు సమాధానంగా రెస్పాండెంట్ల యజమానులు ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకొని 2 వారాల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయాలని జీవిఎంసి అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన్ రావుతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది.


## టిడిపి కార్యాలయంలో ప్రజావేదిక షెడ్యూల్

గుంటూరు, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించే 'ప్రజా వేదిక'కు సంబంధించి శనివారం నుండి పాల్గొనే నాయకుల షెడ్యూల్ వివరాలను టిడిపి కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు వెల్లడించారు. ఈనెల 8వ తేదీ శనివారం రోజున మంత్రి కొల్లు రవీంద్ర, ఎపిసిఐడి ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, 10న 'మండలి' చీఫ్ విప్ ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఏపిఎస్‌డిసిఎల్ ఛైర్మన్ సుజయకృష్ణ రంగారావు, 11న మంత్రి ఎన్ఎండి ఫరూక్, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, 12న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎపిఐడబ్ల్యూఎపి ఛైర్మన్ డాక్టర్ శివ ప్రసాద్, 13న మంత్రి కొలుసు పార్థసారథి, ఎపిహెచ్‌బి ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు, 15న శనివారం ఎమ్మెల్సీ బిటి నాయుడు, ఎపి శెఐడిసి ఛైర్మన్ కెకె చౌదరి పాల్గొంటారని తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రతి శుక్రవారం ఎమ్మెల్యేలు వారివారి నియోజకవర్గాల్లో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కావున ఆరోజున కేంద్ర కార్యాలయంలో ఎలాంటి గ్రీవెన్స్ కార్యక్రమం ఉండదన్నారు.



## సూరమాలలో సురక్షిత తాగునీటి ప్రాజెక్టు ప్రారంభం

తొట్టంబేడు, నవంబరు 7 ప్రభాతవార్త: గ్రామీణులకు సురక్షితమైన మంచినీటిని పొందేలా తిరుపతి ఐఐటి ఇంక్యూబేటెడ్ చేయబడిన ప్రాజెక్టును తొట్టంబేడు మండలంలోని మారుమూల గ్రామం రౌతుసూరమాలలో శుక్రవారం ప్రారంభించారు. తిరుపతి ఐఐటి సౌజన్యంతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎన్‌జిఇఎన్ డైరెక్టర్ ప్రొఫెసర్ షాహాబూద్దీన్ వివరించారు. ఈ ప్రాజెక్టు ఆధునాతన కెపాసిటవ్ డియోనైజేషన్ (సిడిఐ) ఆధారిత నీటి శుద్ధీకరణ వ్యవస్థను విజయవంతంగా పనిచేస్తుందన్నారు. పర్యావరణ ప్రభావాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇంజనీర్‌తోపాటు బొజ్జల బృందమ్మ, మండల తెలుగుదేశం నాయకుడు రావిళ్ళ మునిరాజా నాయుడు తదిరులు పాల్గొన్నారు.




ట్రోంసోలోని నార్వే సీఫుడ్ కౌన్సిల్ ప్రధాన కార్యాలయంలో ఎంపి పుట్టా మహేష్, భారత ఎంపిల బృందం

# ఎపి ఆక్వా పరిశ్రమతో కలిసి పనిచేయండి

### నార్వే సీఫుడ్ కౌన్సిల్‌కు ఎంపి పుట్టా వినతి

ఏలూరు, నవంబరు 7 ప్రభాతవార్త: నార్వే పర్యటనలో ఉన్న ఏలూరు ఎంపి పుట్టా మహేష్ కుమార్ ట్రోంసోలోని "నార్వే సీఫుడ్ కౌన్సిల్" ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. నార్వేలో ఆక్వా రంగం అభివృద్ధి, సముద్ర ఆధారిత ఉత్పత్తుల వాణిజ్యం లాభదాయకంగా నడిపిస్తున్న తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లలో నార్వేజియన్ సముద్ర ఆహార విలువను పెంచడానికి ఆక్వా పరిశ్రమలతో కలిసి కౌన్సిల్ పనిచేస్తున్న విధానాన్ని ఆసక్తిగా విన్న ఏలూరు ఎంపి, భారతదేశం ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగం అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందని, దీనిపై తన పర్యటనలో దృష్టి పెట్టాలని మంత్రి నారా లోకేష్ చెప్పిన విషయాన్ని నార్వే అధికారులకు తెలియచేసారు. ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించవలసిందిగా "నార్వే సీఫుడ్ కౌన్సిల్" సభ్యులను ఎంపి ఆహ్వానించారు. అంతకు ముందు ఆర్కిటిక్ కౌన్సిల్ కార్యాలయాన్ని, నార్వేజియన్ పోలార్ ఇన్స్టిట్యూట్‌ను భారత ఎంపిల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మత్స్య, మైనింగ్, సముద్ర రవాణా, పెట్రోలియం రంగాలలో సమగ్ర వనరుల నిర్వహణ, వాతావరణ మార్పులపై పరిశోధన, పర్యవేక్షణ జరుగుతున్న తీరును ఆర్కిటిక్ కౌన్సిల్ డైరెక్టర్ మాథ్యూ పార్కర్ భారత బృందానికి వివరించారు. ట్రోంసోలోని ఫిన్‌మార్క్ కౌంటీలోని కారజోహ్క గ్రామంలో ఉన్న "సామీ పార్లమెంట్"ను సందర్శించారు. నార్వేలోని సామీ వారసత్వం కలిగిన ప్రజలకు ప్రతినిధిగా ఉంటూ, సామీ ప్రజల కోసం సాంస్కృతిక స్వయంప్రతిపత్తి సంస్థగా పనిచేస్తున్న తీరును అక్కడి అధికారులు భారత ప్రతినిధి బృందానికి వివరించారు.

### ఇంధన సామర్థ్య, సంరక్షణ కార్యక్రమాల

# అమలుకు చర్యలు తీసుకోండి

### ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయవాడ, నవంబరు 7 ప్రభాత వార్త ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ఇంధన సామర్థ్య, ఇంధన సంరక్షణ కార్యక్రమాలను వేగవంతంగా అమలు అమలు చేసి రాష్ట్ర ఇంధన సామర్థ్య లక్ష్యాలను సాధించాలని ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్, స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఎపిఎస్ఇసిఎం) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో ఎపిఎస్ఇసిఎం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ, ఇంధన సామర్థం రాష్ట్ర ఇంధనరంగ పురోగతిలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. భవనాలు, పరిశ్రమలు, మునిసిపాలిటీలు, వ్యవసాయం, రవాణా రంగాల్లో ఇంధన సామర్థ్యం, ఇంధన పొదుపుకు సంబంధించి స్పష్టమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలని సిఇఓ సూచించారు. అన్ని కార్యక్రమాలు స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఏక్షన్ ప్లాన్,



ఎనర్జీ కన్సర్వేషన్ ఎఫిషియెన్సీ పాలసీ 2023-28కు అనుగుణంగా అమలు కావాలని, అలాగే ప్రోజెక్టుల పర్యవేక్షణ, ధ్రువీకరణ సమర్థవంతంగా జరగాలని సిఇఓ ఆదేశించారు. అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ఎనర్జీ కన్సర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఇసిబిసి) ఖచ్చితంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల్లో ఇసిబిసి ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పద్ధతులు అవలంబించేలా ప్రోత్సహించాలని, సిఇఓ వివరించారు. అలాగే ఇంజనీర్లు, ఆర్కిటెక్టులు, పట్టణ స్థానిక సంస్థల అధికారులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. పరిశ్రమల క్లస్టర్లతో సమన్వయం సాధించి ఇంధన సామర్థ్య సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని ప్రోత్సహించాలని పెర్ఫర్మ్, అచీవ్, ట్రేడ్ (పాట్) కార్యక్రమం నుంచి కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ వ్యవస్థ వైపు మార్పును సులభతరం చేయాలని ఆదేశించారు. ఇంధన వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా పరిశ్రమలు ఉత్పాదకతను, పోటీ సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని సిఇఓ పేర్కొన్నారు. ఎంఎస్ఎంఇ యూనిట్లు ఇంధన సామర్థ్య పరికరాలు, పద్ధతులు ఉపయోగించేందుకు సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని కొనసాగించాలని సూచించారు. పరిశ్రమల అసోసియేషన్ల సంఘాలతో కలిసి క్లస్టర్ స్థాయి కార్యక్రమాలను చేపట్టి, ఉత్పాదకతను పెంచి, వ్యయాన్ని తగ్గించి, కార్బన్ ఉద్గారాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తుందని నాగలక్ష్మి పేర్కొన్నారు.




# రైల్వేలో వందేమాతర గీతం ఆలాపన

గుంతకల్లు రైల్వే, నవంబరు 7 ప్రభాత వార్త: ఆధునిక భారతీయ సాహిత్య సృష్టలలో, భారత జాతీయ పునరుజ్జీవనోద్యమంలో తీవ్ర ప్రభావాన్ని చూపిన వందేమాతర గీతం ఆలాపన రైల్వేలో భక్తిశ్రద్ధలతో ఆడంబరంగా జరిగింది. భారత జాతీయ గీతమైన వందేమాతర గీతం 150 వసంతాల సంస్మరణోత్సవ కార్యక్రమం స్థానిక డిఆర్ఎం కార్యాలయ ఆవరణలో రైల్వే అధికార యంత్రాంగం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెటిరియల్ మేనేజర్ రాజేష్ పి.ఖడే, అదనపు డిఆర్ఎం సుధాకర్, ఎపిఓ వి.కల్పన, రైల్వే పాఠశాల ప్రిన్సిపాల్ బి.మధుసూదన్ రావు, రైల్వేలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది, రైల్వే ఉన్నత పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో

# డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపు

గుంతకల్లు రైల్వే, నవంబరు 7 ప్రభాతవార్త: రాయలసీమలోని దక్షణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో పదవీ విరమణ చేసిన రైల్వే పెన్షనర్ల సౌకర్యార్థం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ 4.0కు సంబంధించి తమ కార్యాలయంలో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసినట్లు అఖిల భారత రైల్వే పెన్షనర్ల సంక్షేమ సమాఖ్య (ఏఐఆర్‌పిడబ్ల్యూఎఫ్) డివిజనల్ కార్యదర్శి షేక్ మస్తాన్ వలీ తెలిపారు. కేంద్ర పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖ, రైల్వేబోర్డు, జోనల్ అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికేట్లను ఈ నెలాఖరులోగా నమోదు చేసుకోవలసి ఉంటుందని డివిజనల్ కార్యదర్శి షేక్ మస్తాన్ వలీ తెలిపారు.

పెన్షనర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండ పెన్షనర్ల సౌకర్యార్థం గుంతకల్లులోని రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యాలయంలోని సమాఖ్య కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. కావున లైఫ్ సర్టిఫికేట్లను నమోదు చేసుకోవాలనుకునే వారు తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో తమ తమ పెన్షన్ పేమెంట్ ఆర్డర్, ఆధార్, బ్యాంకు ఖాతా పాస్ బుక్‌లను, బ్యాంకు ఖాతాతో లింక్ ఉన్న మొబైల్ ఫోన్, పాన్ కార్డు, ఓటర్ ఐడి కార్డులను తీసుకొని తమ కార్యాలయంలో ఏర్పటుచేసిన జీవన్ ప్రమాణ్ కేంద్రంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌లను నమోదు చేయించుకోవల సిందిగా ఆయన తెలిపారు.



'వందేమాతరం' 150 ఏళ్ల సంబరాల్లో నేతలు కళావెంకట్రావు, పరుచూరి అశోక్‌బాబు, ఎవి రమణ, బ్రహ్మం చౌదరి, దారపనేని తదితరులు

### టిడిపి కేంద్ర కార్యాలయంలో

# 'వందేమాతరం' 150 యేళ్ల సంబరాలు

గుంటూరు, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: స్వాతంత్ర్య పోరాటానికి బీజం వేసి కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలను ఒక తాటిపైకి తెచ్చిన గేయం వందేమాతరమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో వందేమాతరం 150 ఏళ్ల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, టిడిపి జాతీయ అధికార ప్రతినిధి, నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య, అయ్య దేవర కాళేశ్వరరావు లాంటి స్వాతంత్ర్య ఉద్యోమ నాయకుల గొప్పతనం గుర్తు చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం బోర్డు సభ్యుడు ఏవీ రమణ, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మం చౌదరి, హజ్ యాత్ర కమిటీ ఛైర్మన్ హసన్‌బాషా, పార్టీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ దారపనేని నరేంద్ర బాబు,కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది పాల్గొని వందేమాతరం గేయం ఆలపించారు.

# రైలు ప్రమాదాలపై మాక్ డ్రిల్



గుంతకల్లు రైల్వే, నవంబరు 7 ప్రభాతవార్త: గుంతకల్లు పట్టణ శివారులోని తిమ్మనచెర్ల రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం రైలు ప్రమాదం జరిగిన అనంతరం తీసుకోవలసిన తక్షణ చర్యలను, క్షతగాత్రులను, ప్రయాణీకులను రక్షించేందుకు తీసుకోవలసిన చర్యలపై రైల్వే, ఎన్‌డిఆర్ఎఫ్ దళం సంయుక్తంగా మెగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. అనంతరం డిఆర్ఎం సిఎస్ గుప్తా, ఎన్‌డిఆర్ఎఫ్ ఆర్ఆర్‌సి బెంగళూరు 10వ బెటాలియన్ కమాండర్ అఖిలేష్ కుమార్ చౌబే, హరిశ్చంద్ర పాండే, సీనియర్ డిఎంఇసి అండ్ డబ్ల్యూ పి.ఎస్. మణికుమార్, రైలే భద్రతా అధికారి సూర్యనారయణ మీడియాతో మాట్లాడుతూ... ఈ విన్యాసం రైలు ప్రమాదం జరిగిన సమయంలో చేపట్టవలసిన అత్యవసర పరిస్థితులలో రైల్వే, ఎన్‌డిఆర్ఎఫ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బృందాల సమన్వయ ప్రతిభను గురించి తెలియజేయడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రజలకు విపత్తు నిర్వహణలో సరైన అవగాహన కల్పించడం ఈకార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో రైల్వేకు చెందిన అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్కౌట్స్, గైడ్స్ బృందాలు తదితరులు పాలొన్నాయి.

### యువత భవిష్యత్‌ను

# నాశనం చేయడమే జగన్ లక్ష్యం




గుంటూరు, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: గత ఐదేళ్ల ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ గంజాయి, డ్రగ్స్ ఉన్నా వాటి మూలాలు ఏపిలోనే ఉన్నాయని, గత ఐదేళ్ల వైసిపి నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని డ్రగ్స్, గంజాయి వ్యాపారం చేశారని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరి అన్నారు. శుక్ర వారం టిడిపి కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019 నుండి 2024 వరకు ఆంధ్రప్రదేశ్ నుండి ప్రపంచవ్యాప్తంగా దొరికిన ప్రతి గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థం వెనుక వైఎస్ఆర్‌సిపి నాయకులు లేదా వారి అధికార దుర్వినియోగం ఉన్నట్టు బయటపడింది. ఇది యాదృచ్ఛికం కాదన్నారు. వైఎస్ఆర్‌సిపి విద్యార్థి నాయకుడు పులగం కొండారెడ్డి లిక్విడ్ డ్రగ్స్‌తో ఇంజినీరింగ్, కాలేజీ విద్యార్థులకు సప్లయ్ చేస్తూ పట్టుబడ్డాడని,. 48 గంటలు గడిచినా పార్టీ నుండి సస్పెండ్ చేయలేదని... అంటే జగన్ డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తున్నాడని యువత అంచనా వేస్తోందన్నారు. నిన్న తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ పెట్టిన "స్టూడెంట్స్ మీటింగ్" అది డ్రగ్స్ వింగ్ సమావేశం. హాజరైన వారంతా గంజాయి, డ్రగ్స్ కేసుల్లో ఉన్న రౌడీ షీటర్లు, సప్లయర్లు, డీలర్లు. స్టూడెంట్ వింగ్ అని డప్పు కొట్టుకోవడం యువతను మోసం చేయడమే అన్నారు. ఇక రాష్ట్రానికి జగన్ లాంటి విపత్తు అవసరం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ యువత ఈ రోజు జగన్‌ను జోకర్‌గా చూస్తోందనే విషయాన్ని ఆయన తెలుసుకుంటే చాలని అన్నారు.


### రోడ్డు ప్రమాదంలో

# ఒకరు మృతి

కలిగిరి (నెల్లూరు), నవంబరు 7 ప్రభాత వార్త: కావలి- కలిగిరి రహదారిలో శుక్ర వారం పెద్దపాడువద్ద బైక్ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కలిగిరిలోని జిర్రావారిపాలెంకు చెందిన మనోజ్ (26) మృతి చెందగా మరో ఇద్దరు గాయాలతో బయట పడ్డారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు కథనం మేరకున జిర్రావారి పాలెంకు ముగ్గురు స్నేహితులు తుమ్మల పెంట సముద్ర స్నానానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డుపై ఉన్న ప్రమాద హెచ్చరిక బోర్డును బైక్ ఢీకొని ప్రమాదం సంభవించింది. గాయాలపాలైన కిరణ్‌ది బెంగళూరు. బందువుల ఇంటికి వచ్చి సరదాగా స్నేహితులతో కలసి సరదాగా సముద్ర స్నానానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బైక్ ప్రమాదం జరిగిందని మృతుని బంధువులు తెలిపారు.

# 17న పరశురామేశ్వరుని సన్నిధిలో భస్మాభిషేకం

శ్రీకాళహస్తిరూరల్, నవంబరు 7 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన అనందవల్ల సమేత పరశురామేశ్వరుని సన్నిధిలో కార్తీక నెల 17న నాల్గవ సోమవారం ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఛైర్మన్ బత్తల గిరిబాబునాయుడు, ఆలయ ఇఓ రామ చంద్రారెడ్డి తెలిపారు. ఆ రోజు ఇక్కడ వెలసిన స్వామికి ఉజ్జయిని మహాంకాళి స్వామి అలంకారము నిర్వహించుటకు నిర్ణయించినట్లు వివరించారు. అలాగే భస్మాభిషేకం, సహస్ర దీపాలంకరణ సేవ, ఏకదశ రుద్ర పారాయణం, సహస్ర బిల్వ అర్చన, పలు విశేష కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సహస్ర దీపారాధనలో భక్తులే దీపాలను తమ స్వహస్తాలతో వెలిగించి మొక్కులు తీర్చుకోవచ్చునని తెలిపారు.



### 10న భరద్వాజతీర్థంలో లక్ష దీపోత్సవం

శ్రీకాళహస్తి, నవంబరు 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో భరద్వాజ మహామునిచే తపస్సు చేయటానికి తవ్వించిన భరద్వాజ తీర్థంలో ఈ నెల 10న సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయల ఇఓ డి.బాపిరెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగు కోనేరుల్లో దీపార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19 'స్వర్ణమ్మ' నదీ హారతులను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం



కోవూరు (నెల్లూరు), నవంబరు 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల బలం కారణంగా గత నాలుగు దశాబ్దాలకు పైగా పటిష్టంగా ఉందని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు సమీపంలోని విపిఆర్ అతిథి గృహంలో శుక్రవారం సాయంత్రం కోవూరు మండలానికి సంబంధించి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జెండాను మోసిన కార్యకర్తలను మరిచిపోయే ప్రసక్తే లేదన్నారు. కార్యకర్తలు కానీ, ప్రజలు కానీ ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమ ఇంటి తులుపులు ఎప్పుడూ తెరచే ఉంటాయన్నారు. ఎక్కడైనా తప్పులు జరిగి ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని సరిదిద్దుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. పెన్నా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, జొన్న వాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షురాలు పార్వతి, సర్పంచ్‌లు విజయ, మాజీ ఎంపీపీ రమణమ్మ, ఉమా, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు ఇంతా మల్లారెడ్డి, కాటంరెడ్డి కృష్ణారెడ్డి, నీటి సంఘం అధ్యక్ష కార్యదర్శులు అత్తిపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, గాదిరాజు సుధాకర్, బాలరవి, వెంకట్, సుబ్బానాయుడు, చింతలపూడి పెంచలయ్య, పురుషోత్తం, నాగరాజు, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం బిజెపి చేతిలో కీలుబొమ్మ



విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పుడు స్వయం ప్రతిపత్తి సంస్థ కాదని, బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. విజయవాడలో మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఎన్నికల కమీషన్, కేంద్ర ప్రభుత్వ విధానాలపై పలు ఆరోపణలు చేసారు. మోడీ మోసం మీద, ఎన్నికల సంఘం దగాపై రాహుల్ గాంధీ హైడ్రోజన్ బాంబు పేల్చారన్నారు. ఈ దొంగ ఓట్లు లేకుంటే కాంగ్రెస్ భారీ మెజారిటీతో గెలిచేది అని చెప్పారు. ఎన్నికల సంఘం తన బాధ్యతను విస్మరించి బిజెపి పక్షాన పనిచేస్తోందని మండిపడ్డారు. ఓటర్ జాబితా, సిసిటివి ఫుటేజ్, డిజిటల్ డేటా వంటి ఆధారాలు ఇవ్వకుండా ఎన్నికల సంఘం దాచిపెడుతోందని తెలిపారు. బిజెపికి ఎన్నికల సంఘం మరో ఆర్ఎస్ఎస్ వంటి వ్యవస్థ అని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేపట్టిన"ఓట్ చోర్ - గద్దీ చోర్" ప్రచారానికి ప్రజలు విశేష స్పందన చూపారని చెప్పారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుంచి 17.65 లక్షల మంది ప్రజలు సంతకాలు చేసి ఈ ఉద్యమానికి మద్దతు తెలిపారని వివరించారు. ఈ సంతకాలను ఢిల్లీకి పంపిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు జెడి శీలం, మస్తాన్ వలి, నరహరిశెట్టి నరసింహారావు ఇదే ప్రకటనలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు చేసారు.

8-11P g7exHMNWJQE 11_8-11P g7exHMNWJQE.qxd 08/Nov/25 12:07 AM Page 1



# వైఎస్సార్సీ నేత ఆత్మహత్య

తణుకు, నవంబరు 7 ప్రభాతవార్త: తణుకు పట్టణానికి చెందిన వైసీపీ నేత వీరమల్లు ఫణీంద్రకుమార్ (45) గురువారం రాత్రి ఆయన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నారు. తణుకు పట్టణ ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తణుకు బొమ్మల వీధిలో నివాసం ఉంటున్న ఫణీంద్రకుమార్ గురువారం ఉదయం తన భార్యతో మాటామాటా పెరిగి మనస్తాపం తో బయటకు వెళ్లిపోయారు. అనంతరం మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చిన ఆయన తన బెడ్రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. అయితే పడుకున్నారని భావించిన కుటుంబ సభ్యులు సాయంత్రం సమయంలో తలుపులు కొట్టినప్పటికీ స్పందన లేకపోవడంతో బెడ్రూం తలుపులు పగలగొట్టారు. ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేళాడుతూ కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హుటాహుటిన ఫణీంద్రకుమార్ నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువు లకు అప్పగించారు. పట్టణ ఎస్ఐ కె. శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తుపాన్ నష్టంపై 10న కేంద్ర బృందం రాక

గన్నవరం, నవంబరు 7 ప్రభాతవార్త: మొంథా తుపాన్ నష్టాన్ని పరిశీలించేందుకు ఈనెల 10వ తేదీ కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ డికె.బాలాజీ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఉదయం కృష్ణాజిల్లా కంకిపాడు మండలంలో తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటపొలాలను బాలాజీ పరిశీలించి రైతులతో మాట్లా డారు. ఈదురుగాలులకు వరిపైరు నేలవాలి పోవటంతో పంటకు తీరని నష్టం జరిగిందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ గన్నవరం యండిఓ కార్యాలయాన్ని సందర్శించి ఇక్కడ తుపాన్ నష్టం వివరాలతో ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



సహస్ర దీపాలంకరణలో అనుగ్రహిస్తున్న అమ్మవార్లు

# దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా కార్తీక పూజలు

ఇంద్రకీలాద్రి, నవంబరు 7 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో గురువారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, ఛైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ ఛైర్మన్లు తెలిపారు. సహస్ర దీప కాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధా కృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాల తో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.

### సీతానగరంలో కృత్తికా దీపోత్సవం



శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల అనుబంధ ఆలయ మైన శ్రీమద్వీరాంజనేయ సమేత కోదండ రామ స్వామివారి ఆలయంలో గురువారం జరిగిన కృత్తికా దీపోత్సవంలో ఇఓ వికె శీనా నాయక్, ఛైర్మన్ రాధాకృష్ణలు పాల్గొన్నారు. దుర్గమ్మ ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన వి.లక్ష్మినారాయణ, గాయత్రి దంపతులు వారి కుటుంబీకులు మహంకాళిరావు, రత్నకుమారిపేరిట రు.1,00,116ల విరాళాన్ని శుక్రవారం అందించారు. అలాగే విజయవాడకు చెందిన రత్నయ్య, దంపతులు రు.1,01,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, మెమంటో అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.

### భక్తుల సౌకర్యాల పెంపు



దుర్గమ్మవారి భక్తులకు పలు సౌకర్యాల కల్పన చేయడానికి పాలకమండలి సమావేశం నిర్ణయించింది. శుక్రవారం జరిగిన బోర్డు మీటింగ్‌లో ఇఓ వికె శీనా నాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు పాల్గొని పలు తీర్మానాలు చేశారు. ఆలయంలో భక్తులకు అందుబాటులో మార్గనిర్దేశం కోసం సూచీ బోర్డుల ఏర్పాటు, వేదపాఠశాలనుండి ఆలయానికి చేరుకోడానికి బస్సు ఏర్పాటు, ఆలయం తెరిచి వుంచినంతసేపు ఉచిత ప్రసాద వితరణ, కుంకుమ ప్రసాదం వితరణ, కొండపైన, క్రింద దేవస్థానం స్టాల్స్ ఏర్పాటు చేసి కొబ్బరికాయలు, పంచెలు, కుంకుమ, చీరలు, పలు పూజా సామాన్లు అందుబాటులో వుంచడం, కేశఖండన శాలలో మహిళలు దుస్తులు మార్చుకోడానికి గదుల ఏర్పాట్లు, అన్నదానం క్యూలైన్లో కూర్చునే సౌకర్యం, ఆలయంలో ప్రయివేటు విక్రయ షాపులు నిషేధం తదితర అంశాలను ప్రస్తావించి అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఇఓ శీనా నాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ తెలిపారు.



వందేమాతరం గేయానికి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా విజయవాడలో జాతీయ గీతాలాపన కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇతర ప్రముఖులు

# వందేమాతరం స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణం

- విద్వాంసులు నుంచి విప్లవకారుల వరకు ఈ గేయం కదిలించింది
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయుల్లో వందేమాతరం గేయం స్ఫూర్తి నింపిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విద్వాంసులు నుంచి విప్లవకారుల వరకు ఈ గేయం కదిలించిందన్నారు. వందేమాతరం స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వందే మాతరం గేయానికి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కేబీఎన్ కళాశాలలో ప్రత్యేక వేడుకలు జరిగాయి.

ఇందులో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు యలమంచిలి సత్యనారాయణ(సుజనా చౌదరి), రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, కేబీఎన్ కళాశాల సెక్రటరీ టి.శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. వి.నారాయణరావు, ప్రిన్సిపల్ డా. జి.కృష్ణవేణి తదితరులతో కలిసి భరతమాత చిత్రపటానికి పూలమాలలు అలంకరించారు. అదేవిధంగా వందే మాతరం రచయిత బంకించంద్ర చటర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దాదాపు మూడువేల మంది విద్యార్థులతో వందేమాతరం గేయాలాపన చేశారు. ప్రధానమంత్రి సందేశాన్ని వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఎందరో ప్రాణాలు త్యాగం చేశారని.. ఈ సందర్భంగా ఆ మహనీయులకు నివాళి అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమానికి వేదికగా నిలిచిందని, ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపిందన్నారు. ఈరోజు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు కారణమైన వందేమాతరం ఔన్న త్యాన్ని యువత తెలుసుకొని, దేశభక్తిని, జాతీయతా భావనను పెంపొందించుకొని ముందడుగు వేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో...

వందేమాతరం గేయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ ఒక్కరూ ఐక్యంగా దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా వి.రాధికారెడ్డి అన్నారు. నగరంలోని డా.ఎన్‌టిఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో శుక్రవారం వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. వందేమాతరం గేయాన్ని డిప్యూటీ రిజిస్ట్రార్లు, జాయింట్ రిజిస్ట్రార్లు, సిబ్బందితో రిజిస్ట్రార్ రాధికా రెడ్డి ఆలపించి వేడుకలను ప్రారంభించారు. వందేమాతరం వేడుకలలో పాల్గొనడం తమకు చాలా ఆనందంగా ఉందని రిజిస్ట్రార్, డా. వి.రాధికా రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్లు, జాయింట్ రిజిస్ట్రార్లు తెలిపారు.

# అట్టహాసంగా రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 7 ప్రభాతవార్త: అనంతపురం జిల్లాలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవములు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో 3 రోజుల పాటు నిర్వహించే 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవములను ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, ఉమ్మడి జిల్లాల జాయింట్ కలెక్టర్‌లు శివ్‌నారాయణ్ శర్మ, మౌర్య భరద్వాజ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, అమరావతి ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వందేమాతరం 150వ స్మారకోత్సవాల సందర్భంగా సీసీఎల్ఏ, స్పెషల్ సిఎస్, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, తదితరులు వందేమాతరం జాతీయ గీతం ఆలాపన చేశారు. ముందుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన రెవెన్యూ ఉద్యోగులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ , స్పెషల్ సిఎస్ జి.జయలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు ఒక టీమ్‌గా కలిసి పనిచేయాలి.. ఉద్యోగులంతా మంచి ఉత్సాహభరిత వాతావరణంలో క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. క్రీడలకు సంబంధించి కంటింజెంట్ కెప్టెన్లతో ప్రమాణం చేయించారు. తదనంతరం క్రీడలను సీసీఎల్ఏ, స్పెషల్ సిఎస్ ప్రారంభించారు. మార్చ్ ఫస్ట్‌లో కాకినాడ జిల్లా 1వ బహుమతి, 2వ బహుమతి అనంతపురం జిల్లా, 3వ బహుమతి ఈస్ట్ గోదావరి జిల్లా, 4వ స్థానం నంద్యాల జిల్లా కైవసం చేసుకోగా, వారికి సీసీఎల్ఏ స్పెషల్ సిఎస్ చేతులమీదుగా చిరు సత్కారం చేశారు. అనంతరం సీసీఎల్ఏ కమిషనర్, కలెక్టర్, జెసి, అసిస్టెంట్ కలెక్టర్ క్రికెట్ ఆటలో పాల్గొని బౌలింగ్, బ్యాటింగ్ చేశారు.




# మాటల వాణ్ని కాదు.. పాటల వాణ్ని

- ప్రఖ్యాత సంగీత మాంత్రికుడు ఇళయరాజా

విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త: తాను మాటల వాణ్ని కాదు.. పాటల వాణ్ని.. మాటలు మాట్లాడటం కంటే నాకు పాటలు పాడటమే సులభం అనీ "నిజజీవితంలో జరిగిన ఘటనలు, పరిణామాలే నా స్వరాలనీ. వాటినే తాను పాటలుగా మార్చాను" అని ప్రఖ్యాత సంగీత మాంత్రికుడు ఇళయరాజా అన్నారు. 8న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ట్రెండ్ సెట్టర్ ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్ సంబంధించి శుక్రవారం మీడియాతో ముచ్చటించారు. తాను స్వరపరిచిన గీతాలను విన్నవారికి తమ జీవితాల్లో జరిగిన ఘటనలను గుర్తుకు చేసుకుంటారని, ఆ పాటతో ఆ సందర్భాలు ఆ జీవిత సంఘటనలు మనసులో ముద్రితమై ఉంటాయన్నారు. ఇప్పుడు పాట రాస్తున్న వారు ఎవరో పాడే వారికి తెలియడం లేదని ఆవేదన వ్యకం చేశారు. గాయనీ గాయకులు ఒకరికొకరు తెలియని పరిస్థితి ఇప్పుడు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్న ట్రెండ్ సెట్టర్స్ లైవ్ అధినేత సుధాకర్, పద్మనాభుని రవి, అంబటి శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య రాజూరు రామకృష్ణారెడ్డికి రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోషిప్



అనంతపురం, నవంబరు 7 ప్రభాతవార్త బ్యూరో: రాయల సీమలో ఓ మారుమూల గ్రామం లో జన్మించి వివిధ విశ్వవిద్యాల యాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఆచార్య రాజూరు రామ కృష్ణారెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోషిప్ ఆచార్య రావూరికి దక్కడం విశేషం. పదవీ విరమణ తర్వాత కొంతమంది ఏ పని చేయకుండా, ఏ యాపకము పెట్టు కోకుండా జీవితం గడుపుతూ ఉంటారు. అయితే ఆచార్య రామకృష్ణారెడ్డి తీరు వేరు.. సైన్స్ రంగంపై ఉన్న అపారమైన ప్రతిభ, కష్టపడే తత్వము, ఏదో చేయాలని తపన ఉండటం వల్ల సైన్స్ పై పుస్తకాలు రాయడం, అంతర్జాతీయ సెమినార్లకు నివేదికలు పంపడం లాంటి చర్యలను చేస్తుంటాడు... అమెరికా లాంటి వివిధ దేశాల్లోనీ గ్రంథాలయాల్లో ఆచార్య రామకృష్ణారెడ్డి రాసిన పుస్తకాలు ఉన్నాయంటే ఆయన కృషి ఏంటో అర్థం చేసుకోవచ్చు. గతంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర ఆచార్యుడిగా పనిచేశారు. ఇటీవల ఆచార్య రాజూరు రామకృష్ణారెడ్డిని రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా ప్రకటించింది. ఇందులో సభ్యత్వం పొందినందుకు ఎంతో గర్వంగా ఉందని రామ కృష్ణారెడ్డి తెలిపారు. ఆచార్య రెడ్డి, సైద్ధాంతిక, భౌతిక, పర్యావరణ శాస్త్రాల్లో పరిశోధన చేశారు. అతిసులభమైన సైద్ధాంతిక పద్దతులను ముఖ్యంగా రసాయన శాస్త్ర సంబంధిత క్వాంటం సిద్ధాం త పరమైన రసాయన బంధనాల్ని, భౌతిక రసాయనక పదార్థ ధర్మాల పైన అధ్యనం చేశారు. దుర్భిక్ష, వెనుకబడిన, కరువు ప్రాంతమైన, అనంతపురం పర్యావరణ క్షేత్రం అంశంగా కూడా పరిశోధన చేశారు. ఈ రంగాలలో ఆచార్యరెడ్డి 244 పరిశోధనా ప్రతుల్ని, గూగుల్ సైటేషన్స్ 6439, ఐ10 ఇండెక్స్ 125, హెచ్.ఇండెక్స్ 45ను పొందారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం రూపొందిం చిన వరల్డ్ టాప్-2 శాస్త్రవేత్తల పట్టికలో ఆచార్య రెడ్డి పేరును ప్రస్తావించడం జరిగింది. ఈయన పరిశోధనలకు ఇస్రో, యూజీసీ, డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు కోట్ల ఆర్థిక సాయం అందించారు. ఈయన పర్యవేక్షణలో 21 మంది డాక్టరేట్లు పొందారు. బెస్ట్ టీచర్, బెస్ట్ సైంటిస్ట్, యూజీసీ ఏమిరేట్స్ ఆచార్యుడుగా, బిఎస్సార్ ఫాకల్టీ ఫెలో, మ్యాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు కూడా పొందారు. గతంలో ఈయనకు ఎన్ఎన్ ఈఎస్ఎ, ఇండియా వారు కూడా ఇచ్చారు. విదేశా ల్లో ఈయన పుస్తకాలు ప్రచురింపబడ్డాయి. పాపు లర్ సైన్స్ రచయితగా కూడా ఈయనకు పేరుంది.

# హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్‌లోనూ ఓట్ల చోరీ

**ఆధారాలతో బయటపెట్టినా ఇసి స్పందించలేదెందుకు?**

**నేడు బీహార్‌లోనూ ఆ దిశగా బిజెపి పన్నాగం**

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రఆరోపణలు**



న్యూఢిల్లీ, నవంబరు 7: ఓట్ చోరీ అంశంపై లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తన దాడిని తీవ్రతరం చేశారు. దేశంలో ఎక్కడ ఏ ఎన్నిక జరిగినా అధికార బిజెపి 'చువాన్ చోరీ' (ఎన్నికలను దొంగలించడం)లో పాల్గొంటుందని, నరేంద్రమోడీ చువాన్ చోరీ ద్వారానే ప్రధానమంత్రి అయ్యారని రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో హోల్‌సేల్‌గా ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ ఓట్ల చోరీపై తన దగ్గర చాలా ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఓట్ల చోరీపై ప్రజెంటేషన్లు కొనసాగుతాయని చెప్పారు. ప్రధాని మోడీ 'చువాన్ చోరీ' ద్వారా ప్రధాని అయ్యారని తెలిపారు. బిజెపి ఓట్ల చోరీపై యువతకు స్పష్టంగా తెలియజేస్తామన్నారు. హర్యానాలో జరిగిన ఎన్నికలు... అస్సలు ఎన్నికలే కాదన్నారు. హర్యానాలో జరిగిన ఓట్ల చోరీపై అనేక ఆధారాలు చూపించామన్నారు. బిజెపి నేత కుమారుడు రెండు చోట్ల ఓటు వేశారని ఆరోపించారు. అయితే తాను చేసిన ఆరోపణలకు ఇప్పటి వరకు ఎన్నికల సంఘం స్పందించలేదని తెలిపారు. నకిలీ ఓటు, నకిలీ ఫొటోలతో బిజెపి నాయకులు ఓట్లు వేశారని, దీనిని బిజెపి కూడా సమర్థిస్తోందని విమర్శించారు. తన ప్రజెంటేషన్‌లో చూపిస్తున్న చిన్న ఉదాహరణలనే మీడియా తీసుకుంటోందని, బ్రెజిలియన్ మహిళ ఓటు వేసింది ఎవరని ప్రశ్నించారు. మోడీ, అమిత్ షా, ఇసి కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం ఒక మనిషి... ఒక ఓటు అని చెబుతోంది. కానీ హర్యానాలో మానరతం ఒక మనిషి... బహుళ ఓట్లు అని బిజెపి అంటోందని పేర్కొన్నారు. ఇప్పుడు బీహార్‌లో కూడా అదే ఒరవడిని బిజెపి చేయబోతున్న దన్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్‌లలో జరిగింది కూడా ఇదేనన్నారు. బీహార్‌పై కూడా ఇలాంటి ప్రజెంటేషన్‌తో తిరిగి వస్తానని, అక్కడ కూడా ఓట్ చోరీ జరుగుతుందని అను మానం వ్యక్తంచేశారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

**మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర**



గన్నవరం(కృష్ణా), నవంబరు 7 ప్రభాతవార్త: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మచిలీపట్నంలోని టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. ఈసందర్బంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో 110 అర్జీలు రాగా వాటిలో అత్యధికంగా ఇళ్ళస్థలాలు, పింఛన్‌లకు సంబంధించినవే ఉన్నా యన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయటంలో కూటమి ప్రభుత్వం విజయవంతమైందన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో ఏయంసి ఛైర్మన్ కుంచే దుర్గాప్రసాద్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లాగ్రంధాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ యంపిపి కాగిత వెంకటేశ్వరావు, మాజీ జడ్‌పిటీసి లంకే నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# గత ఐదేళ్లు నువ్వు చేసింది అంతా క్రెడిట్ చోరీనే జగన్

**మీడియా సమావేశంలో మంత్రి పార్థసారధి**




గుంటూరు, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: గత ఐదేళ్లు నువ్వు చేసింది అంతా క్రెడిట్ చోరీనే, అంతా దోపిడినే, విధ్వంసమే కదా జగన్ రెడ్డి అంటూ మంత్రి కొలుసు పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లా డారు. తుపాను సమయంలో చంద్రబాబు ప్రభుత్వం సత్వర స్పందన చూపిందని, నష్ట అంచనా నుంచి కేంద్ర కమిటీని రప్పించడం వరకు పార్టీఅధికార యంత్రాంగాలను సమన్వయం చేసి క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని నడిపించిన తీరును అందరూ ప్రశంసిస్తున్నారని చెప్పారు. కేంద్ర మాజీ కార్యదర్శి సుభాష్ చంద్ర ఘార్గ్ కూడా చంద్రబాబును "విజన్‌కు మారు పేరు" అంటూ అభినందించారని, రాష్ట్ర ప్రయోజనాల్లో రాజీపడని నాయకుడని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ విధ్వంసాన్ని విజన్‌గా చూస్తే, కూటమి ప్రభుత్వం అభివృద్ధి, ఉద్యోగాలు, పెట్టుబడులతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏపి అభివృద్ధి, పెట్టుబడుల గురించి చర్చిస్తుంటే పులివెందుల ఎమ్మెల్యే మానసిక స్థితి దెబ్బతిని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి జరిగిందని, క్రెడిట్‌ను చంద్రబాబు దోచుకుంటున్నారని చెప్పడం అమాయకత్వమా లేక నవ్వాలా అని ప్రశ్నించారు. 151 సీట్ల నుంచి 11కి పడిపోవడానికి మోసాలు, విధ్వంసమే కారణమని, ప్రజలు శిక్షించారని గుర్తుచేశారు.




# విజయవాడలో అలెన్ విద్యా కేంద్రం

విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త: దేశంలో ప్రతిష్టాత్మకమైన అలెన్ విద్యా సంస్థ బ్రాంచ్ ఏపిలో విజయవాడ, విశాఖలో నెలకొల్పడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై సంస్థ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండడంతో జాతీయ అంతర్జాతీయ సంస్థలు తమ బ్రాంచ్లను నెలకొల్పుతున్నాయన్నారు. డిసిపి కేజీవి సరితా, అలెన్ ఆంధ్ర, తెలంగాణ సమన్వయకర్త సీతారాం నందూరి, వైస్ ప్రెసిడెంట్ అండ్ జోనల్ హెడ్ మహేష్ యాదవ్, టీఎన్ హెడ్ సంతోష్ సింగ్, తెలంగాణ హెడ్ సౌరభ్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై జిల్లా కలెక్టర్ సీరియస్

**హాస్టళ్లలో టాయిలెట్లు నిర్మాణంపై సమీక్ష**

ఏలూరు, నవంబరు 7 ప్రభాతవార్త: విధుల పట్ల నిర్లక్ష్యం, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయని అధికా రులను ఉపేక్షించేది లేదని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను హెచ్చరించారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో, అంగన్వాడీ కేంద్రాలు, పర్యా టక శాఖకు చెందిన ప్రదేశాలలో టాయిలెట్లు నిర్మాణ పను లపై ఆర్‌డబ్ల్యూఎస్, సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ శుక్రవారం ద్వారా కలెక్టర్ సమీక్షిం చారు. సంక్షేమ వసతి గృహాలకు టాయిలెట్లు మంజూరు చేసి 3 నెలల సమయం దాటినా ఇంకా టాయిలెట్లు నిర్మించకపోవడంతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కామవరపుకోట, జీలుగుమిల్లి, కైకలూరు, ముదినేపల్లి, పోలవరం, కలిదిండి మండలాల ఆర్ డబ్ల్యూఎస్ ఇంజ నీరింగ్ అధికారుల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, 24 గంటలలోగా పనులలో పురోగతి ప్రదర్శించని సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తానని హెచ్చ రించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు మంజూరు చేసిన టాయిలెట్లు, త్రాగునీటి పనులు వెంటనే పూర్తి చేయాలనీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు తమ శాఖకు చెందిన వసతి గృహాలకు మంజూరైన పనులు పూర్తిఅయ్యేలా సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించా లన్నారు. పనులు పూర్తి నాణ్యతతో ఉండేలా పర్య వేక్షించాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు దోమ తెరలు అందించాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాల న్నారు. సిపిఒ వాసుదేవరావు, సంక్షేమ శాఖల అధికా రులు, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

8-11pg10exHMNWJQE 12 ONG_8-11pg10exHMNWJQE.qxd 07/Nov/25 11:16 PM Page 1



## మహిళల ఐపిఎల్ మెగావేలంలో..

# భారత్ క్రీడాకారిణులకు బిగ్ ఛాన్స్



హర్మన్‌ప్రీత్ కౌర్



జెమీమా రోడ్రిగ్స్



షఫాలీ వర్మ



స్మృతి మంధాన

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచకప్ 2025 విజయంతో భారత మహిళల క్రికెట్ జట్టుకు మంచి క్రేజ్ ఏర్పడింది. భారత అమ్మాయిల విజయం వెనుక వుమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) పాత్ర కూడా ఉంది. టీమిండియా జట్టులోని పలువురు సభ్యులు డబ్ల్యూపీఎల్ ఫ్రాంచైజీల టీముల్లో ఉన్నారు. ఇప్పటికే మూడు సీజన్లు పూర్తి చేసుకున్న డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ కోసం సమాయత్తమవుతుంది. గత మూడు సీజన్లలో ముంబై ఇండియన్స్ రెండు సార్లు డబ్ల్యూపిఎల్ టైటిల్ గెలవగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఒకసారి గెలిచింది. ఇక 4వ విడత డబ్ల్యూపీఎల్ 2026కు సంబంధించిన మెగా వేలం ఈ నెల 27న జరగనుంది. ఈ మెగా వేలం రూల్స్ ప్రకారం ప్రతి జట్టు గరిష్ఠంగా ఐదుగురు ప్లేయర్లను మాత్రమే రిటైన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో గరిష్ఠంగా ముగ్గురు భారత క్యాప్డ్ ప్లేయర్లు, ఇద్దరు ఫారిన్ ప్లేయర్లు, ఇద్దరు క్యాప్డ్ ప్లేయర్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక వేలం పర్స్ వాల్యూను రూ.15 కోట్లుగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆయా ఫ్రాంచైజీలు తమ జట్లలోని ప్లేయర్ల రిటైన్, రిలీజ్ జాబితాలను ఖరారు చేశాయి. డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌తో పాటు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తమకు కలిసొచ్చే ఆటగాళ్లను రిటైన్ చేసుకొని

### ఫ్రాంచైజీల రిటైన్ లిస్ట్‌లో ప్లేస్ సేఫ్

అవసరం లేని ఆటగాళ్లను వేలంలోకి వదిలేసాయి. ముంబై, బెంగుళూరు, ఢిల్లీ ఐదుగురి ఆటగాళ్లను, యూపీ ఒకే ఒక్క ప్లేయర్‌ను అంటిపెట్టుకుంది. ముంబై అట్టిపెట్టుకునే జాబితాలో నాట్ సీవర్ బ్రంట్ (రూ.3.5 కోట్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ.2.5 కోట్లు), కమిలిని, రిలీజ్‌లో అక్షితా మహేశ్వరి, పూజా, ఢిల్లీ రిటైన్‌లో జెమీమా రోడ్రిగ్స్(రూ.2.2 కోట్లు), షఫాలీ వర్మ(రూ.2.2 కోట్లు), నికీ ప్రసాద్, రిలీజ్ లిస్ట్‌లో చరణి, నందిని కశ్యప్, అరుంధతిరెడ్డి, మిన్ను మణి, రాధా యాదవ్, స్నేహ దీప్తి, టిటాస్ సాధు. రాయల్ ఛాలెంజర్స్ రిటైన్‌లో స్మృతి మంధాన(రూ.3.5 కోట్లు), రిచా (రూ.2.75 కోట్లు), రిలీజ్‌లో రాఘవి బిస్త్, మేఘన, శోభనా, సోఫీ డివైన్, రేణుకా, యూపీవారియర్స్ రిలీజ్‌లో క్రాంతి, దీప్తి శర్మ, చమరి అతపత్తు, సోఫీ ఎక్లెస్టోన్, సైమా, గుజరాత్ జెయింట్స్ రిలీజ్ లిస్ట్ దయాళన్ హేమలత, మేఘనా సింగ్.



## ఫిడే వరల్డ్ కప్‌లో.. భారత్ గ్రాండ్ మాస్టర్ల దూకుడు

**న్యూఢిల్లీ:** ఫిడే వరల్డ్ కప్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా విదిత్ గుజరాతీ ఎట్టకేలకు రెండో ర్యాపిడ్ గేమ్‌లో అర్జెంటీనా వండర్ కిడ్ ఫాస్టినో ఓరో డిఫెన్స్‌ను ఛేదించగలిగాడు. వి ప్రణవ్, ఎం ప్రాణేష్ కూడా ఈ టోర్నమెంట్‌లో మూడవ రౌండ్‌కు చేరుకుని మొదటి సెట్ ర్యాపిడ్ గేమ్‌లలో తమ ప్రత్యర్థులపై విజయం సాధించారు. రెండు క్లాసికల్ గేమ్‌లలో 12 ఏళ్ల ఓరో ఒత్తిడి తెచ్చినా కానీ విదిత్ రెండవ రాపిడ్ గేమ్‌లో బ్లాక్ పావులతో 52మూవ్‌ల విజయాన్ని సాధించాడు. అలాగే ప్రణవ్ నార్వేకు చెందిన ఆర్యన్ తారిని ఓడించగా, ప్రాణేష్ జర్మనీకి చెందిన దిమిత్రిజ్ కొల్లార్స్‌ను ఓడించి ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్, ఎరిగాసి అర్జున్, పి హరికృష్ణ, కార్తీక్ వెంకట్రామన్, దీప్తయన్ ఘోష్ వంటి వారితో తదుపరి రౌండ్‌లో చేరాడు. అయితే మరో భారత్ గ్రాండ్ మాస్టర్ నిహాల్ సరిన్ బిలీ స్టామటిస్ కౌర్కొలోస్ ఆర్డిటిస్ (గ్రీస్) చేతిలో ఓడిపోయాడు. ఇక విదిత్ ఇప్పుడు అమెరికాకు చెందిన సామ్ షాంక్లాండ్‌తో తలపడనున్నాడు. అతను రెండవ రౌండ్‌లో గ్రాండ్‌మాస్టర్ వాసిల్ ఇవాన్‌చుక్‌ను ఓడించాడు. ఇతర బోర్డులలో జరిగిన రెండవ క్లాసికల్ గేమ్‌లో ప్రపంచ జూనియర్ ఛాంపియన్ ప్రణవ్, రూక్‌పాన్ ముగింపులో 44 కదలికలలో మొదటి రాపిడ్ గేమ్‌ను గెలుచుకున్నాడు. ఆ తర్వాత అతను రెండవ గేమ్‌లో బ్లాక్‌తో నార్వేజియన్‌ను డ్రాగా ముగించాడు. ప్రాణేష్, కొల్లార్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో, బ్లాక్ గేమ్ ఆడుతున్న భారత ఆటగాడు, రెండవ రాపిడ్ గేమ్‌లో 24వ మూవ్‌లో ఆధిక్యాన్ని సాధించాడు.

## వన్డే సిరీస్‌లో పాకిస్థాన్ చిత్తు

**న్యూఢిల్లీ:** వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా పాకిస్థాన్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. ఫైసలాబాద్‌లోని ఇక్బాల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన రెండో వన్డేలో పాకిస్తాన్‌పై 8 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. ఈ విజయం దక్షిణాఫ్రికా మూడు మ్యాచ్‌ల వన్డేసిరీస్‌ను 1-1తో సమంచేయడంలో సహాయపడింది. దక్షిణాఫ్రికా 270పరుగుల లక్ష్యంలో భాగంగా లువాన్‌డ్రే ప్రిటోరి యస్ (46) తో కలిసి 81 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం ఇన్నింగ్స్‌కు వేదికగా నిలిచింది. డి కాక్, టోనీ డి జోర్జి (63 బంతుల్లో 76) ల మధ్య 153 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్ నిజంగా సజీవంగా మారింది. డి జోర్జి బౌండరీలతో నిండిన ఇన్నింగ్స్‌తో పాకిస్తాన్‌కు భారీ నష్టాన్ని కలిగించాడు. డి కాక్, స్టాండ్‌ఇన్ కెప్టెన్ మాథ్యూ బ్రీట్జ్కే (17) తో కలిసి, దాదాపు 10 ఓవర్లు మిగిలి ఉండగానే ఛేజింగ్‌ను 40.1 ఓవర్లలో 270/2 వద్ద ముగించాడు. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్, దక్షిణాఫ్రికా పేస్ దాడికి ప్రారంభంలోనే విఫలమైంది. ఎడమచేతి వాటం సీమర్ నాండ్రే బర్గర్ మొదటి 5 ఓవర్లలోనే ఫఖర్ జమాన్, బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్ వికెట్లతో సహా 4/46 వికెట్లు తీసుకు న్నాడు. అతని కఠినమైన పేస్, స్వింగ్ పాకిస్తాన్‌ను 22/3 వద్ద కుప్పకూల్చాయి. లెగ్‌స్పిన్నర్ న్యాబా పీటర్ కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు 3/55 సాధించాడు. ప్రారంభ పతనం ఉన్నప్పటికీ, సైమ్ అయూబ్ (53), సల్మాన్ అలీ ఆఘా (69), మహ్మద్ నవాజ్ (59) ప్రతిఘటించి పాకిస్తాన్‌ను 269/9కి పెంచారు. అయితే, దక్షిణాఫ్రికా ఫామ్‌లో ఉన్న టాప్ ఆర్డర్‌ను అధిగమించలేకపోయారు.

## అనధికారిక మ్యాచ్‌లో..

# భారత్‌కు 34 రన్స్ ఆధిక్యం



**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్ 34 పరుగుల ఆధిక్యంలో ఉంది. రెండో అనధికారిక టెస్టు మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 47.3 ఓవర్లలో 221 పరుగులకే ఆలౌట్ అయింది. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అకెర్‌మన్ విధ్వంసకర శతకంతో ఒంటరి పోరాటం చేశాడు. సహచరులు సహకరించకపోయినా, ఒక్కడే నిలబడి 200 పరుగుల మార్కును దాటించాడు. కేవలం 118 బంతుల్లోనే 17 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 134 పరుగులుచేశాడు. అకెర్‌మన్ కాకుండా దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో జోర్డన్ హెర్మన్ (26), సుబ్రాయన్ (20) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో టీమ్ కెప్టెన్ టెంబా బావుమా సహా నలుగురు డకౌట్లయ్యారు. అంతకు ముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులకు ఆలౌట్ అయింది. ధృవ్ జురెల్ (132) వీరోచిత శతకంతో టీమిండియా పరువు కాపాడాడు. 126 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన జురెల్ టెయిలెండర్లు కుల్దీప్ (20), సిరాజ్ (15) సహకారంతో టీమిండియాకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. భారత్ ఇన్నింగ్స్‌లో సీని యర్లు కెఎల్ రాహుల్ (19), సాయి సుదర్శన్ (17), అభిమన్యు ఈశ్వరన్ (0), దేవదత్ పడిక్కల్ (5), రిషబ్ పంత్ (24) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. ఇక దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 221 పరుగులకు ఆలౌట్ కావడంతో భారత్ 34 పరుగుల ఆధిక్యంలోఉంది.

## హాంగ్‌కాంగ్ సిక్సస్ టోర్నీలో భారత్ చేతిలో పాకిస్థాన్‌కు పరాభవం



**న్యూఢిల్లీ:** భారత్ చేతిలో పాకిస్థాన్‌కు మరోసారి పరాభవం ఎదురైంది. హాంగ్‌కాంగ్ సిక్సస్ టోర్నీలో పాకిస్థాన్‌పై భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 2 పరుగుల తేడాతో విజయం సాధించింది. మాంగ్ కాక్ వేదికగా శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 6 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 86 పరుగులు చేసింది. ఓపెనర్లు రాబిన్ ఊతప్ప (28), భరత్ చిప్లి (24) ఒక మాదిరిగా ఆడారు. ఆఖర్లో కెప్టెన్ దినేశ్ కార్తిక్ (17 నాటౌట్) సైతం బ్యాట్‌కు పనిచెప్పాడు. భారత్ ఇన్నింగ్స్‌లో స్టువర్ట్ బిన్ని 4, మిథున్ 6 పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో మహమ్మద్ షెహజాద్ 2, అబ్దుల్ సమద్ ఒక వికెట్ తీశారు. అనంతరం పాకిస్థాన్ 87 పరుగుల లక్ష్య ఛేదనలో వరుణుడు అడ్డు పడ్డాడు. దీంతో పాక్ స్కోర్ 41/1 (3 ఓవర్లు) వద్ద ఉండగా వర్షం మొదలైంది. ఎంతకీ తగ్గకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత్‌ను విజేతగా ప్రకటించారు. మ్యాచ్ ముగిసే సమయానికి ఖ్వాజా సఫీ (18 నాటౌట్), అబ్దుల్ సమద్ (16 నాటౌట్) క్రీజులో ఉన్నారు. మాజ్ సదాఖత్ (7) ఔట్ కాగా, సదాఖత్ వికెట్ స్టువర్ట్ బిన్నికి దక్కింది. ఈ టోర్నీలో భారత్ తమ తదుపరి మ్యాచ్ కువైట్‌తో తలపడనుంది.

## స్టాక్ మార్కెట్లకు మూడో రోజూ తప్పని నష్టాలు

**ముంబయి, నవంబరు 7:** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల ధోరణులు, విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే ఎక్కువ ఆసక్తిచూపించడంతో భారత స్టాక్ సూచీలు మూడోరోజు కూడా నష్టాల్లోనే ముగిసాయి. ఉదయంనుంచే నష్టాలతోట్రేడింగ్ ప్రారంభం అయింది. పిఎస్‌యు బ్యాంకుల్లో కొనుగోళ్ల మద్దతుతో ఒకదశలో లాభాల్లోకి వచ్చి మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. దీనితో వారాంతంలో సూచీలకు భారీ నష్టాలకు కొంత బ్రేక్‌పడింది. నిఫ్టీ 25,500 దిగువన ట్రేడింగ్ ముగించింది. సెన్సెక్స్ 83,150.15 పాయింట్ల వద్ద ప్రారంభం అయి ఇంట్రాడేలో 82,670.95వద్ద కనిష్టస్థాయికి వెళ్లింది. ఆ తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ చివరికి 94.73 పాయింట్లవద్ద నష్టంతో ముగిసింది. 83,216.28వద్దముగిసింది. నిఫ్టీకూడా 17.40 పాయింట్ల నష్టంతో 25,492.30వద్ద స్థిరపడింది. డాలరుతోరూపాయి మారకం విలువలు 88.65గా నడిచింది. సెన్సెక్స్ సూచీల్లో బ్లాక్‌డీల్ తో ఎయిర్‌టెల్ సుమారు 4శాతం నష్టపోయింది. 0.8శాతం వాటాను సింగ్‌టెల్ విక్రయించడంతో ఎయిర్‌టెల్‌షేర్లు ఒత్తిడిలో ముగిసాయి. టెక్‌మహీంద్ర,




ట్రెంట్, రిలయన్స్, హెచ్‌సిఎల్ టెక్నాలసీజ్ షేర్లు నష్టాల్లోముగిసాయి. బజాజ్‌ఫైనాన్స్, టాటా స్టీల్, మహీంద్ర అండ్ మహీంద్ర, బజాజ్ ఫిన్‌సెర్వ్, ఐసిఐసిఐబ్యాంకు షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురుబ్యారెల్‌కు 64 డాలర్లవద్ద కొనసాగితే ఔన్స్ బంగా రంధరలు 4004 డాలర్లవద్ద ట్రేడ్ అయింది.

## రిటైల్‌ద్రవ్యోల్బణం 0.6% అంచనా

### రేటింగ్ సంస్థల ఆర్థికవేత్తల విశ్లేషణ



**న్యూఢిల్లీ, నవంబరు 7:** దేశంలో రిటైల్‌ద్రవ్యోల్బణం రికార్డుస్థాయికి అక్టోబరులో నమోదు అయింది. కూరగాయల ధరలు తగ్గడమే ఇందుకుకారణం. జిఎస్టీ, సేవలరంగ పన్నులు తగ్గింపు కూడా ఒకింత కారణం అయింది. రిజర్వుబ్యాంకు అంచనాలు కూడా ద్రవ్యోల్బణం పరంగా తగ్గించింది. మార్కెట్ నిపుణులు ఎక్కువశాతం 0.2నుంచి 0.6శాతంగా రిటైల్‌ద్రవ్యోల్బణం ఉంటుందని వెల్లడించారు. సెప్టెంబరులో నమోదయిన 1.5శాతంతో పోలిస్తే తగ్గుతుందని అంచనావేసారు. ఆర్‌బిఐ కూడా తన ఎంపిసి సమీక్షలో ఈ ఆర్థికసంవత్సరం రిటైల్‌ద్రవ్యోల్బణం 2.6శాతం మించకపోవచ్చని వెల్లడించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా అంచనాలు చూస్తే 0.4నుంచి మైనస్ 0.6శాతంగా ఉండవచ్చని వెల్లడించింది. జిఎస్టీ రేట్ క్రమబద్ధీకరణ ఇందుకు దోహదంచేస్తుందని బీవోబీ అంచనావేసింది. ఇక్రా అంచనాలనుచూస్తే అక్టోబరులో రిటైల్‌ద్రవ్యోల్బణం 0.5శాతంగా ఉంది. ఎంపిసి కమిటీ డిసెంబరులో మళ్లీ సమావేశం కానుంది. అప్పటికి సగతున 2026లో రిటైల్ ద్రవ్యోల్బణం ప్రస్తుతం ఉన్న 2.6శాతంనుంచి 2.6శాతంగా ఉండవచ్చని ఇక్రా ఆర్థికవేత్త అదితినాయర్ అన్నారు. డిబిఎస్ బ్యాంకు ఆర్థికవేత్త రాధికా రావు మాట్లాడుతూ రిటైల్‌ద్రవ్యోల్బణం మరింత తగ్గుతుందని వెల్లడించారు. వార్షికపద్ధతిలోచూస్తే ద్రవ్యోల్బణం 0.2శాతం తగ్గుతుందని వెల్లడించారు.

## రూ.2 లక్షలకు చేరువకానున్న వెండి

### పెరుగుతున్న పెట్టుబడులే కారణమంటున్న రేటింగ్ సంస్థలు

**న్యూఢిల్లీ, నవంబరు 7:** అమెరికా,భారత్‌లమధ్య జరుగుతున్న వాణిజ్యచర్చలు కొలిక్కివచ్చేలోపే వెండి బంగారంధరలపై ఈ ప్రభావం ఎక్కువ చూపిస్తోంది. భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న బంగారం, వెండి ధరలకు ఈ చర్చలు కొలిక్కివస్తే బ్రేక్ వేసే అవకాశం ఉంది. దేశ ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ధరలు వాటి గరిష్ఠ స్థాయి నుండి 10 శాతానికి పైగా తగ్గాయి. ఇంతలో వెండి ధరలు వాటి గరిష్ట స్థాయి నుండి దాదాపు 14 శాతం తగ్గాయి. అంటే బంగారం,వెండి ధరలు ఇప్పటికే ఒక నెల రోజుల్లో గణనీయమైన దిద్దుబాటును చూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ప్రస్తుతం ఔన్సుకు 48 డాలర్లనుండి 50డాలర్ల వరకు ఉంది. ప్రస్తుత సంవత్సరం చివరి వరకు వెండి ధరలు ఈ శ్రేణిలో ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఇంకా వచ్చే ఏడాది మధ్య నాటికి, వెండి ధరలు ఔన్సుకు 60 నుండి 75డాలర్ల వరకు చేరుకోవచ్చు. చైనా, భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు పూర్తిగా తిరిగి తెరిచినందున నిపుణులు వెండి ధరలపై గణనీయమైన పందెం వేస్తున్నారు. ఈనేపథ్యంలో కిలో వెండి రెండులక్షలరూపాయలు దాటినా ఆశ్చర్యపోనవసరం లేదని రేటింగ్



సంస్థలు పేర్కొంటున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలు, సౌర ఫలకాల ఉత్పత్తి పెరుగుతోంది. చైనా, యునైటెడ్ స్టేట్స్ మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారు కావడం వల్ల చైనా పరిశ్రమలు గణనీయమైన వృద్ధికి దారి తీస్తాయి. తత్ఫలితంగా వెండికి పారిశ్రామిక డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps